THE MOST Sensational TELUGU DAILY IN TELUGU STATES

www.kakatiyadaily@gmail.com



ఎడిటర్ ఇన్ చీఫ్ బెనర్జీనాథ్ చౌదరి

POSTAL REGD.NO.AP/VJ/GTR/58/2005

RNI.REGD.No.APTEL/2003/14530

"ప్రజాపక్షం- ప్రత్యక్షర సాక్ష్యం"

Estd: 2003

# కాకతీయ®

దినపత్రిక

17-06-2026 | బుధవారం | గుంటూరు | రూ - 1-00 | పేజీలు : 8 | సంపుటి - 23 | సంచిక - 48

Epaper: kakatiyadaily.com | facebook: Kakatiya Daily | twitter.com: kakatiya | instragram.com : Kakatiya Daily

Editor In Chief Benarji Naddh 7729995277, 9989320577

Published From : GUNTUR, KHAMMAM, ANANTAPUR & KAKINADA

కాకతీయ ఈపేపర్ కొరకు kakatiyadaily.com లాగిన్ అవ్వండి. 7729995277 వాట్సాప్‌కు జాయిన్ అవ్వండి.

Legal affairs: All Legal Affairs About kakatiya Should be filed in Guntur Courts only




## ఓటమి నాలో కసి పెంచింది..

### మంగళగిరి అభివృద్ధిపై లోకేష్ భావోద్వేగం

- మంగళగిరిని రాష్ట్రంలోనే నెం.1గా తీర్చిదిద్దుతానన్న లోకేష్
- జగన్ బెంగళూరులో కాకుండా ఏపీలో నివసిస్తే వాస్తవాలు తెలుస్తాయని చురక
- జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీని ఆపలేరని వ్యాఖ్య
- కావాలనే వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేస్తున్నారని ఆరోపణ

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన సొంత నియోజకవర్గమైన మంగళగిరిని అన్ని రంగాల్లో నెం. 1గా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, గెలిచిన మొదటి రోజు నుంచే అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తున్నామని తెలిపారు. 2019లో 5,300 ఓట్ల తేడాతో

02




**ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌పై 'ఎల్ నినో' ప్రభావం తీవ్రంగా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశంలోని 12 ప్రధాన వ్యవసాయ రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉండటంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రైతులకు నష్టం తగ్గించేందుకు ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ రాష్ట్రాలకు సూచించింది.**

# 'ఎల్‌నినో' ముప్పు..

## ఏపీ, తెలంగాణ సహా 12 రాష్ట్రాల్లో వర్షాభావం ముప్పు

- అప్రమత్తమైన కేంద్రం.. ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలకు ఆదేశాలు
- రైతులను ఆదుకునేందుకు ముందస్తు చర్యలపై దృష్టి
- ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన కేంద్ర వ్యవసాయ మంత్రి
- ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచన

రైతులకు, వ్యవసాయ రంగానికి ఆందోళన కలిగించే ఒక కీలక అప్‌డేట్ వాతావరణ శాఖ నుండి వచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దేశంలోని దాదాపు 12 రాష్ట్రాలపై 'ఎల్ నినో' తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా అప్రమత్తమైంది. ఖరీఫ్ 2026 సన్నద్ధతపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.
ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాధారణం కంటే తక్కువగా

02



గొడ్డలి పార్టీ బతికితే రాష్ట్రానికి

## అంధకారమే

### మంత్రి అచ్చెన్నాయుడు

- గొడ్డలి పార్టీ బతికితే రాష్ట్రం అంధకారంలోకి వెళ్తుందన్న అచ్చెన్నాయుడు
- డీఎస్సీపై చర్చకు రావాలంటూ జగన్‌కు సవాల్ విసిరిన మంత్రి

02




నీట్ రీ-టెస్ట్

## టెలిగ్రామ్‌పై నిషేధం..

### కోర్టును ఆశ్రయించిన సంస్థ

- నీట్ రీ-టెస్ట్‌కు ముందు తాత్కాలిక నిషేధం
- జూన్ 30 వరకు మెసేజ్ ఎడిట్ ఫీచర్ నిలిపివేత
- ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవడమే లక్ష్యమన్న ఎన్‌టీఏ

02




### పాలన చూడండి.. పెట్టుబడులు పెట్టండి:

## రోడ్ షోలో చంద్రబాబు

- సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సన్నాహకంగా సింగపూర్‌లో బిజినెస్ రోడ్ షో
- హాజరైన సీఎం చంద్రబాబు
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఏపీకి పేటెంట్ ఉందన్న సీఎం
- విశాఖ సదస్సుకు సన్నాహకంగా సింగపూర్‌లో బిజినెస్ రోడ్ షో
- పెట్టుబడులకు ఏపీ అత్యంత సురక్షితమైన ప్రాంతమని వెల్లడి

సింగపూర్ పర్యటనలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు.. పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా రెండో రోజు పర్యటనను పూర్తి చేశారు. సింగ పూర్‌లో రెండు రోజుల పర్యటనకు వచ్చిన ఆయన.. పూర్తిగా రెండో రోజు పెట్టుబడులపైనే దృష్టి పెట్టారు. ఈ క్రమంలో మంగళవా రం ఉదయం నుంచి పెట్టుబడుల వేట

02

### గుడివాడ అమర్‌నాథ్ క్షమాపణ చెప్పాలి: వంగలపూడి అనిత

- అనితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గుడివాడ అమర్‌నాథ్
- మీ ఇళ్లలో కూడా మహిళలు ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్న అనిత
- మహిళలను కించపరిచే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

02






## ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయప్రతాప్ రెడ్డికి భద్రత కొనసాగింపు.. ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురు

- ఫుడ్ కమిషన్ ఛైర్మన్ భద్రత పునరుద్ధరణపై కీలక పరిణామం
- సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని చెప్పిన డివిజన్ బెంచ్
- ఛైర్మన్ చిట్టా విజయప్రతాప్ రెడ్డికి 1o1 భద్రత కొనసాగింపు
- ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ (ఫుడ్ కమిషన్) ఛైర్మన్ విజయప్రతాప్ రెడ్డి భద్రత వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు 1o1 భద్రతను పునరుద్ధరించాలని గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది. ఈ విషయంలో ప్రభుత్వ

02



## ఆమె గొంతు నొక్కలేరు

### అనితకు మద్దతుగా నారా లోకేశ్

- మేకప్ మంత్రి అంటూ అనితపై గుడివాడ అమర్ నాథ్ అనుచిత వ్యాఖ్యలు
- అనితను టార్గెట్ చేయడం వెనుక వైసీపీ వికృత రాజకీయం దాగుందని మండిపాటు

02




### వితంతువులకు గుడ్ న్యూస్ చెప్పిన ఏపీ ప్రభుత్వం

- కొత్తగా 2.20 లక్షల మంది వితంతువులకు పింఛన్లు
- ప్రతి నెలా రూ. 4 వేల పింఛన్
- మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నామన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వితంతు మహిళలకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్

02



### తెలంగాణలోని హన్మకొండలో

## పవన్ కల్యాణ్ పర్యటన

తీవ్ర నరాల సమస్యతో బాధపడుతున్న చిన్నారిని కలిసిన పవన్

02

## ఇక బ్యాంకుల ఇష్టం చెల్లదు.. అవసరం లేని పాలసీలు, లోన్లు అంటగట్టొద్దు!: ఆర్‌బీఐ

- బ్యాంకుల మిస్ సెల్లింగ్‌పై ఆర్‌బీఐ కఠిన నిబంధనలు
- లోన్ కోసం బీమా పాలసీ కొనాలని బలవంతం చేయొద్దు
- ప్రతి ఉత్పత్తికి విడిగా కస్టమర్ అంగీకారం తప్పనిసరి
- డిజిటల్ వేదికల్లో మభ్యపెట్టే పద్ధతులపై నిషేధం
- 2027 జనవరి 1 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు

బ్యాంకుకు ఓ పనిమీద వెళ్తే మరో ప్రొడక్ట్‌ను అంటగట్టడం, లోన్ తీసుకోవాలంటే బీమా పాలసీ తప్పనిసరి అని చెప్పడం, మొబైల్ యాప్ తెరిస్తే వరుసగా లోన్ ఆఫర్లు చూపించడం వంటి పద్ధతులకు త్వరలో చెక్ పడనుంది. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆర్‌బీఐ కఠిన నిబంధనలను తీసుకొచ్చింది. బ్యాంకులు అనుసరించాల్సిన కొత్త మార్గదర్శకాలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటి వరకు బ్యాంకింగ్ రంగంలో తరచూ వినిపించిన ఫిర్యాదుల్లో 'మిస్ సెల్లింగ్' ఒకటి. అంటే వినియోగదారుడికి అవసరం లేని ఫైనాన్షియల్ ప్రొడక్ట్‌ను అమ్మడం. సరైన సమాచారం ఇవ్వకుండా ఒప్పించడం. అనుమతి లేకుండానే పాలసీలు లేదా ఇతర సేవలు జత చేయడం వంటి చర్యలు ఇందులోకి వస్తాయి. ఇలాంటి వ్యవహారాలకు తొలిసారి స్పష్టమైన నిర్వచనం




ఇచ్చిన ఆర్‌బీఐ వాటిపై కఠిన వైఖరి అవలంబించింది. కొత్త నిబంధనల ప్రకారం రుణం మంజూరు చేయాలంటే తప్పనిసరిగా బీమా పాలసీ కొనాలని బ్యాంకులు షరతు విధించకూడదు. గృహ రుణం లేదా వ్యక్తిగత రుణం తీసుకునే సమయంలో బీమా అవసరమైతే వినియోగదారుడు తనకు నచ్చిన సంస్థ నుంచి పాలసీ తీసుకునే స్వేచ్ఛ ఉండాలి. బ్యాంకు సూచించిన సంస్థ నుంచే కొనాలంటూ ఒత్తిడి చేయడం నిషేధం.

02

కాకతీయ ప్రాంతీయమ్

## అమర్ నాథ్ పై మహిళా కమిషన్ సీరియస్



ఏపీ హోం శాఖా మంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ చేసిన వివాదాస్పద కామెంట్లు రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అమర్ నాథ్ పై విశాఖపట్నంలో కేసు నమోదైనట్లు తెలుస్తోంది. తాజాగా అమర్ నాథ్ కామెంట్లపై ఏపీ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ స్పందించారు. అమర్ నాథ్ వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. మహిళా మంత్రి అనితను 'మేకప్ మంత్రి' అని సంబోధిస్తూ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలను శైలజ తీవ్రంగా తప్పుబట్టారు. అమర్ నాథ్ పై చర్యలు తీసుకోవాలని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు లేఖ రాయబోతున్నామని తెలిపారు. అంతేకాదు, ఈ వ్యవహారంపై అమర్ నాథ్ కు మహిళా కమిషన్ తరఫున సమన్లు జారీ చేస్తామని చెప్పారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలు ఉండొచ్చని, కానీ, ఒక మహిళా ప్రజా ప్రతినిధి రూపం, దుస్తులు, మేకప్ గురించి మాట్లాడటం సమర్థనీయం కాదని శైలజ స్పష్టం చేశారు. అమర్ నాథ్ వ్యాఖ్యలు ఒక్క హోంమంత్రిని మాత్రమే కాకుండా మొత్తం మహిళా సమాజాన్ని కించపరిచేలా ఉన్నాయని అన్నారు. ఓ పక్క దేశవ్యాప్తంగా మహిళా రిజర్వేషన్లపై చర్చ జరుగుతోందని, కానీ, అమర్ నాథ్ వంటి నేతలు ఇలా బాధ్యతారాహిత్యంతో వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పుడిప్పుడే రాజకీయాల్లోకి మహిళలు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఈ తరహా కామెంట్లతో వారు నిరుత్సాహపడి వెనకడుగు వేసే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేశారు.

## 'ఎల్‌నినో' ముప్పు..

మొదటిపేజి తరువాయి

వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని కీలక వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలపై ప్రభావం ఉంటుందని తెలిపింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, ఝార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో, శివరాజ్ సింగ్ చౌహాన్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు తగ్గితే రైతులు నష్టపోకుండా ఉండేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో ఉన్న జిల్లా అధికారులు, రాష్ట్రాల వ్యవసాయ విభాగాలు, కృషి విజ్ఞాన్ కేంద్రాలు, ఇతర అనుబంధ సంస్థలతో తక్షణమే సమన్వయ సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. కరువు లాంటి పరిస్థితులు ఎదురైతే ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

## గొడ్డలి పార్టీ బతికితే రాష్ట్రానికి అంధకారమే: మంత్రి అచ్చెన్నాయుడు

మొదటిపేజి తరువాయి

"గొడ్డలి పార్టీ మళ్లీ పుంజుకుంటే రాష్ట్రం అంధకారంలోకి వెళ్లడం ఖాయమ"ని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. వెన్నుపోటు అనే పదానికి జగనే పేటెంట్ తీసుకున్నారని, దానికి కర్త, కర్మ, క్రియ అన్నీ ఆయనేనని ఎద్దేవా చేశారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రాన్ని, పదవి కోసం కాంగ్రెస్‌ను, ఆస్తి కోసం కన్నతల్లిని, చెల్లిని సైతం వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్‌దని ఆరోపించారు. డీఎస్సీ నియామకాల విషయంలో జగన్ తప్పుడు ప్రచారంతో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. దమ్ము, ధైర్యం ఉంటే మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్‌ను స్వీకరించి డీఎస్సీపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు. రొయ్యల మేత ధరలు జగన్ హయాంలో ఎంతలా పెరిగాయో ఆధారాలతో సహా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆయా కంపెనీలకు కులాన్ని ఆపాదించడం అత్యంత సిగ్గుచేటని విమర్శించారు. గతంలో జగన్ ప్రచారం చేసిన అబద్ధాలను సమర్థవంతంగా తిప్పికొట్టలేకపోవడం తమ తప్పేనని అంగీకరించిన అచ్చెన్నాయుడు, ఈసారి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వాస్తవాలు, గణాంకాలతో జగన్ చేసే ప్రతి ఆరోపణను తిప్పికొడతామన్నారు. హోం మంత్రి అనితను రాజకీయంగా ఎదుర్కోలేకనే వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని, తమ ఇంట్లోనూ మహిళలు ఉన్నారనే స్పృహ లేకుండా మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్య నిషేధం సహా గతంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చని జగన్‌కు, కూటమి మేనిఫెస్టో గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని అచ్చెన్నాయుడు తేల్చి చెప్పారు.

## ఆమె గొంతు నొక్కలేరు

**అనిత సాధించిన విజయాలను తగ్గించలేరని వ్యాఖ్య**

మొదటిపేజి తరువాయి

హోంమంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నేత గుడివాడ అమర్ నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యల దుమారం ఏపీ రాజకీయాల్లో మరింత ముదిరింది. ఈ వ్యవహారంపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా అత్యంత తీవ్రంగా స్పందించారు. ఈ వ్యాఖ్యలు యాదృచ్ఛికంగా చేసినవి కావని, వైసీపీ ఐదేళ్ల విఫల పాలనలో పెంచి పోషించిన విషపూరిత రాజకీయ సంస్కృతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో శాంతిభద్రతలు, అభివృద్ధిపై మాట్లాడటానికి ఆ పార్టీ నేతల వద్ద ఎలాంటి సమాధానాలు లేవని లోకేశ్ ఎద్దేవా చేశారు. హోంమంత్రి పదవిలో ఉన్న ఒక మహిళను, అందులోనూ ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకురాలిని పనిగట్టుకుని లక్ష్యంగా చేసుకోవడం వెనుక వైసీపీ వికృత రాజకీయం దాగి ఉందన్నారు. వంగలపూడి అనిత కష్టపడే తత్వానికి, ధైర్యానికి, నిరంతర ప్రజాసేవకు నిదర్శనమని లోకేశ్ కొనియాడారు. వైసీపీ నాయకులు ఎంతగా దూషించినా, బాడీ షేమింగ్ చేసినా ఆమె సాధించిన విజయాలను అస్సలు తగ్గించలేరని, ఆమె గొంతును నొక్కలేరని స్పష్టం చేశారు. ఏపీ ప్రజలు ఇలాంటి ద్వేషపూరిత రాజకీయాలను ఎప్పుడో తిరస్కరించారని గుర్తుచేశారు. హోంమంత్రి అనితతో పాటు రాష్ట్రంలోని ప్రతి మహిళకు, ప్రతి దళితుడికి వైసీపీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## వితంతువులకు గుడ్ న్యూస్ చెప్పిన ఏపీ ప్రభుత్వం

మొదటిపేజి తరువాయి

చెప్పింది. రాష్ట్రంలో త్వరలోనే కొత్తగా 2.20 లక్షల మందికి వితంతు పింఛన్లను మంజూరు చేయనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. అర్హులైన మహిళలకు రాబోయే ఒకటి రెండు నెలల్లో ప్రతి నెలా రూ. 4 వేల చొప్పున పింఛను అందించేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఏపీలో ప్రస్తుతం 62.34 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు ఇస్తున్నామని, ఇందుకోసం ఏటా రూ. 33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దేశంలోనే అత్యధికంగా పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే అని స్పష్టం చేశారు. పింఛను తీసుకునే భర్త చనిపోతే, భార్యకు తక్షణమే 'స్పౌజ్ కేటగిరీ' కింద పెన్షన్ బదిలీ చేస్తున్నామని, దీనివల్ల ఇప్పటికే 2.45 లక్షల మందికి లబ్ధి చేకూరిందని చెప్పారు. పింఛన్ల తొలగింపుపై విపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 9.56 లక్షల పింఛన్లను తొలగిస్తే... తాము కేవలం నిబంధనల ప్రకారమే 7,856 అనర్హుల పింఛన్లను మాత్రమే తొలగించామని, దివ్యాంగులు, రోగుల పింఛన్లను ఎక్కడా రద్దు చేయలేదని మంత్రి తేల్చి చెప్పారు.

## నీట్ రీ-టెస్ట్ టెలిగ్రామ్‌పై నిషేధం..

మొదటిపేజి తరువాయి

నీట్-యూజీ రీటెస్ట్‌కు ముందు కేంద్ర ప్రభుత్వం విధించిన తాత్కాలిక నిషేధంపై మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ అంశంపై అత్యవసర విచారణ జరపాలని సంస్థ చేసిన విజ్ఞప్తిని కోర్టు అంగీకరించింది. నీట్ రీ-టెస్ట్ జూన్ 21న జరగనుంది. పరీక్షకు ముందు ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు సమాచార ప్రచారాన్ని అడ్డుకునేందుకు టెలిగ్రామ్‌పై 24 గంటల పాటు నిషేధం విధించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) సిఫారసు మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడే ముఠాలు, పరీక్షల్లో అక్రమాలకు సహకరించే నెట్‌వర్క్‌లను అడ్డుకోవడమే ఈ చర్యల లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. అదే సమయంలో జూన్ 30 వరకు టెలిగ్రామ్‌లో మెసేజ్ ఎడిట్ చేసే సదుపాయాన్ని కూడా నిలిపివేయాలని సంస్థను ఆదేశించారు. మెసేజ్‌లను తర్వాత సవరించే సదుపాయాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని ఎన్‌టీఏ ఆరోపిస్తోంది. పరీక్ష పూర్తైన తర్వాత ప్రశ్నపత్రాలను పాత సందేశాల్లో చేర్చి, అవి ముందుగానే లీకైనట్లు చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపింది. దీంతో పరీక్షల విశ్వసనీయతపై సందేహాలు తలెత్తుతున్నాయని పేర్కొంది. మరోవైపు టెలిగ్రామ్ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కొందరి తప్పిదాల కారణంగా కోట్లాది మంది సాధారణ వినియోగదారులను ఇబ్బందులకు గురిచేయడం సరైన విధానం కాదని వాదిస్తోంది. సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ పావెల్ దురోవ్ స్పందిస్తూ.. ప్రశ్నపత్రాల లీకేజీకి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి సాధారణ వినియోగదారులపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకోవడం సమస్యకు పరిష్కారం కాదన్నారు. ఇలాంటి ఆంక్షల వల్ల లీకేజీ లు ఆగిపోవని, అవి మరో వేదికకు మారే అవకాశమే ఎక్కువని వ్యాఖ్యానించారు.

# ఓటమి నాలో కసి పెంచింది..

## మంగళగిరి అభివృద్ధిపై లోకేష్ భావోద్వేగం

మొదటిపేజి తరువాయి

ఓడిపోయినప్పుడు కలిగిన బాధ, ఆవేదన తనలో కసి పెంచిందని లోకేష్ గుర్తుచేసుకున్నారు. ఆ కసితోనే ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నానని, 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రజలు తనకు కొండంత అండగా నిలిచారని పేర్కొన్నారు. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో సుమారు రూ.1200 కోట్ల అంచనా వ్యయంతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, భూగర్భ విద్యుత్ లైన్లు, తాగునీరు, గ్యాస్ పైప్ లైన్ సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వంద పడకల ఆసుపత్రి, పార్కులు, కమ్యూనిటీ భవనాలు, స్మశాన వాటికల అభివృద్ధి వంటి పనులు వేగంగా చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై లోకేష్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "పులివెందుల ఎమ్మెల్యే బెంగళూరులో కాకుండా ఏపీలో నివసిస్తే వాస్తవాలు తెలుస్తాయి. ఆయన వారంలో మూడు రోజులు బెంగళూరు, ఒకరోజు తాడేపల్లి, మరో మూడు రోజులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. అందుకే ఆయనను 'బెంతహై' (బెంగళూరు, తాడేపల్లి, హైదరాబాద్) అని పిలవాల్సి వస్తోంది" అని ఎద్దేవా చేశారు. విజనరీకి, ప్రిజనరీకి చాలా తేడా ఉంటుందని, ప్రిజనరీ ఆలోచనలు ఎప్పుడూ జైలు చుట్టూనే తిరుగుతాయని విమర్శించారు. హోంమంత్రి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలను ఖండించిన లోకేష్, "గొడ్డలి బ్యాచ్‌కు మహిళలను గౌరవించే సంస్కారం లేదు" అని మండిపడ్డారు. డీఎస్సీ నోటిఫికేషన్‌పై వైసీపీ చేస్తున్న ఆరోపణలను లోకేష్ తిప్పికొట్టారు. "జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీ ప్రక్రియను ఆపలేరు. కూటమి ప్రభుత్వం కేవలం 150 రోజుల్లోనే 16 వేల టీచర్ పోస్టులు భర్తీకి శ్రీకారం చుట్టింది. హారిజాంటల్ రిజర్వేషన్ గురించి అవగాహన లేని వైసీపీ నేతలే కోర్టుల్లో 240 కేసులు వేసి అడ్డుకుంటున్నారు. డీఎస్సీపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు నేను సిద్ధం" అని సవాల్ విసిరారు. నిడమర్రు ఆర్వోబీని 18 నెలల్లో పూర్తి చేస్తామని, మంగళగిరిని ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని లోకేష్ పునరుద్ఘాటించారు.

## బ్రాండింగ్‌లో బాబు-పవన్ తర్వాతే ఎవరైనా..! ఇలా ఎందుకు అంటున్నారంటే..?



రాజకీయాల్లో పొత్తులు పెట్టుకోవడం, ఎన్నికల్లో గెలవడం ఒక ఎత్తయితే.. గెలిచిన తర్వాత అదే సమన్వయాన్ని ప్రదర్శిస్తూ ప్రభుత్వాన్ని నడపడం, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడం మరో ఎత్తు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య కనిపిస్తున్న బంధం కేవలం రాజకీయ అవసరాల కోసం మాత్రమే కాకుండా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పడిన బలమైన పునాదిగా చెప్పుకుంటున్నారు. ఇందుకు తగ్గట్టే ఆ ఇద్దరు నేతలు నడుచుకుంటున్నారని జాతీయ స్థాయిలో రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. కూటమి కట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ఇద్దరు నేతలు 'ఒకే మాట.. ఒకే బాట.. ఒకటే బాణం' అన్నట్లుగా సాగుతున్నారని అంటున్నారు. వీరి మధ్య ఉన్న ఈ అద్భుతమైన బాండింగ్.. ఇప్పుడు రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో 'బ్రాండింగ్' తీసుకువస్తోందని అంటున్నారు.

**అరకు కాఫీకి బ్రాండ్ అంబాసిడర్లుగా బాబు, పవన్**

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒకే విధమైన ఆలోచన ధోరణితో నడుచుకుంటున్నారనే అభిప్రాయానికి తాజా ఉదాహరణ అరకు కాఫీ అంటున్నారు. ఉత్తరాంధ్ర మన్యం ప్రాంత గిరిజన రైతులు పండించే అరకు కాఫీ ఒకప్పుడు సరైన గుర్తింపు లేని ఉత్పత్తిగా మిగిలిపోయేది. కానీ, అరకు కాఫీ విశిష్టతను గతంలోనే గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, దానికి ప్రపంచవ్యాప్త ప్రాచుర్యం కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. ఏపీకి వచ్చే విదేశీ ప్రతినిధులకు, ప్రముఖులకు అరకు కాఫీని బహుమతిగా ఇస్తూ ఆయనే దానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారు.

ఇప్పుడు సరిగ్గా అదే బాటలో నడుస్తున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. రెండురోజుల క్రితం ఢిల్లీ పర్యటనకు వెళ్లిన పవన్.. తనతో పాటు ప్రత్యేకంగా అరకు కాఫీ పొడి ప్యాకెట్లను తీసుకెళ్లారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసినప్పుడు, వారిని సత్కరించి అరకు కాఫీని గిఫ్ట్‌గా అందించారు. పవన్ చేతిలో అరకు కాఫీని చూడగానే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సంభ్రమాశ్చర్యాలకు గురికావడం విశేషం. గతంలో చంద్రబాబు చేసిన బ్రాండింగ్‌ను, ఇప్పుడు పవన్ కల్యాణ్ అంతే స్థాయిలో ముందుకు తీసుకెళ్తుండడం వీరిద్దరి మధ్య ఉన్న ఆలోచనా విధానాల సమన్వయానికి అద్దం పడుతోందని అంటున్నారు.

**పొత్తు రాజకీయాల్లో సరికొత్త ఆదర్శం**

సాధారణంగా కూటమి ప్రభుత్వాల్లో భేదాభిప్రాయాలు, ఆధిపత్య పోరాటాలు ఎక్కడైనా సహజంగా కనిపిస్తుంటాయి. కానీ, ఏపీలో చంద్రబాబు అనుభవం, పవన్ కల్యాణ్ లక్ష్యం కలిసి ఒక అద్భుతమైన సమన్వయాన్ని సృష్టించాయని అంటున్నారు. ప్రభుత్వ పరంగా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా, ఏ వేదికపై మాట్లాడినా ఇద్దరి స్వరం ఒక్కటిగానే వినిపిస్తోందని చెబుతున్నారు. ఒకరు రాష్ట్రానికి సీనియర్ గైడ్‌గా దిశా నిర్దేశం చేస్తుంటే.. మరొకరు అంతే బాధ్యతగల నాయకుడిగా భారాన్ని భుజాన వేసుకుంటున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ పరస్పర గౌరవం, అవగాహన కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా పరిపాలనలోనూ స్పష్టంగా ప్రతిబింబిస్తోందని చెబుతున్నారు.

**రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రాజమార్గం**

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించాలన్నా, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నా, స్థానిక ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్ లభించాలన్నా.. పాలకులపై ప్రపంచానికి నమ్మకం కలగాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ అభిప్రాయంగా చెబుతున్నారు. ఈ ఆలోచనతోనే తమ మధ్య చక్కని సమన్వయం పాటిస్తూ దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తల్లో ఆ నమ్మకాన్ని రెట్టింపు చేస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక గిరిజన రైతుల సంక్షేమం కోసం అరకు కాఫీని ప్రమోట్ చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే వ్యూహాన్ని ఇద్దరూ సమానంగా అమలు చేయడం దీనికి ఒక నిదర్శనమని అంటున్నారు.

## తాడేపల్లి ప్యాలెస్ కు 200 మీటర్ల దూరంలోనే ఉన్నా.. మంత్రి లోకేశ్ మైండ్ బ్లోయింగ్ సవాల్

డీఎస్సీపై వైసీపీ విమర్శలకు మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో స్పందించారు. గత కొంతకాలంలో డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాల భర్తీలో అక్రమాలు జరిగియాంటూ విపక్షం విమర్శలు గుప్పిస్తోన్న విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వం అధికారుల స్థాయిలో సవివరంగా వివరణ ఇస్తున్నప్పటికీ ఆరోపణలు ఆపకపోవడంపై మంత్రి లోకేశ్ ఫైర్ అయ్యారు. ఈ విషయంపై తొలిసారిగా స్పందించిన మంత్రి లోకేశ్ నేరుగా విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిని టార్గెట్ చేశారు. జగన్ నివాసమైన తాడేపల్లి ప్యాలెస్ కు 200 మీటర్ల దూరంలోనే ఉన్నానని, డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్న ఎవరైనా సరే, దమ్ముంటే తనతో బహిరంగ చర్చకు రావాలి బహిరంగ సవాల్ విసిరారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని ఉద్దేశించి మంత్రి లోకేశ్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. మెగా డీఎస్సీపై వైసీపీ తీవ్ర విమర్శలు చేస్తుండటంతో వాటికి ఫుల్ స్టాప్ పెట్టే ఉద్దేశంతో మంత్రి లోకేశ్ నేరుగా రంగంలోకి దిగారని అంటున్నారు. బుధవారం మంగళగిరి నియోజకవర్గంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి లోకేశ్ డీఎస్సీ నియామకాలు పూర్తి పారదర్శకంగా జరిగినట్లు తెలిపారు.

డీఎస్సీ ప్రక్రియపై వైసీపీ చేస్తున్న ప్రచారాలపై మంత్రి నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా ఉపాధ్యాయ నియామకాలను చేపట్టిందని స్పష్టం చేశారు. విపక్ష నేత తన రాజకీయ స్వార్థం కోసం ఎన్ని కుట్రలు చేసినా, కోర్టుల చుట్టూ తిరిగినా, ఎన్ని జన్మలెత్తినా ఏపీలో డీఎస్సీ నియామకాలను ఆపలేరని తేల్చిచెప్పారు. ఇదే సమయంలో డీఎస్సీపై చర్చించేందుకు రమ్మంటూ సవాల్ విసిరారు. తాడేపల్లిలోని జగన్ నివాసానికి కేవలం 200 మీటర్ల దూరంలోనే తాను ఉన్నానని, చర్చకు తానే స్వయంగా వచ్చానని ప్రకటించి పొలిటికల్ హీట్ పెంచారు. "నేను మీ ఇంటికి కూతవేటు దూరంలోనే నిలబడి మాట్లాడుతున్నా.. డీఎస్సీపై మీకు ఎలాంటి అనుమానాలున్నా సమాధానం చెప్పేందుకు ఇక్కడే సిద్ధంగా ఉన్నా. సవాల్ స్వీకరించే ధైర్యం, దమ్ము ఉన్నవాళ్లు ఎవరైనా సరే నేరుగా చర్చకు రావాలి" అంటూ చాలెంజ్ చేశారు.



ఈ క్రమంలో మంత్రి లోకేశ్ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తాము గత పాలకుల్లాగా మోసపూరిత ప్రకటనలు చేయడం లేదన్నారు. "మేము 'సాక్షి' పేపర్‌లో వేసుకునే డమ్మీ క్యాలెండర్లు కాకుండా, నిరుద్యోగులకు మేలు చేసే నిజమైన జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తున్నాం.

అసలు మీ ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ అయినా సక్రమంగా నిర్వహించి ఉంటే కదా.. హారిజంటల్ రిజర్వేషన్లు అంటే ఏంటో, వర్టికల్ రిజర్వేషన్లు అంటే ఏంటో అర్థం కావడానికి" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి ఎక్కువ కాలం పొరుగు రాష్ట్రాలైన బెంగళూరు, హైదరాబాద్ ప్యాలెస్‌లకే పరిమితమవుతున్నారని లోకేశ్ ఎద్దేవా చేశారు. జగన్ ఇప్పటికైనా పొరుగు రాష్ట్రాల పర్యటనలు వీడి, ఆంధ్రప్రదేశ్ వైపు కళ్లు తెరిచి చూస్తే కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతోందో స్వయంగా కనిపిస్తుందని హితవు పలికారు. మొత్తానికి, డీఎస్సీపై పొలిటికల్ ఫైట్ మంత్రి లోకేశ్ స్పందనతో మరింత పీక్స్ కు వెళ్లిందని వ్యాఖ్యానిస్తున్నారు. మంత్రి ఓపెన్ డిబేట్‌కు రమ్మని పిలవడంపై వైసీపీ క్యాంప్ ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరంగా మారింది.

## నో ఎలక్షన్స్.. కాక్రోచ్ పార్టీ అసలు ప్లాన్ ఏంటి?



సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) రాబోయే రోజుల్లో ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయదని ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. సొంత రాష్ట్రం మహారాష్ట్రకు చేరుకున్న ఆయన నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టులో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో మీ పార్టీ తరఫున అభ్యర్థులను నిలబెడతారా? అని మీడియా ప్రశ్నించగా, రాబోయే రోజుల్లో ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేసే ఉద్దేశం తమకు లేదని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాస్వామ్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హక్కుల కోసం ఎన్నికల్లో పోటీ చేయాలనే రూల్ ఎక్కడైనా ఉందా? అంటూ ప్రశ్నించారు. ఎన్నికల్లో పోటీ చేయకుండానే ప్రజా సమస్యలపై పోరాడవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో తనపై జరిగిన భౌతిక దాడి ఘటనపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనపై జరిగిన దాడి వెనుక ఆర్‌ఎస్‌ఎస్ హస్తం ఉందని అభిజీత్ దీప్కే ఆరోపించారు. దేశంలో ప్రస్తుతం యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల నుండి, ముఖ్యంగా విద్యా వ్యవస్థలోని లోపాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇదంతా చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇలాంటి దాడులకు తాము భయపడేది లేదని, మహాత్మా గాంధీ, డా. బి.ఆర్.అంబేద్కర్ చూపిన బాటలో శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతానని స్పష్టం చేశారు. సమస్యలపై నిలదీస్తున్నందుకే తమను టార్గెట్ చేస్తున్నారని, భవిష్యత్తులో నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వ్యంగ్య రాజకీయ విప్లవంగా సోషల్ మీడియాలో మొదలైన కాక్రోచ్ జనతా పార్టీ ప్రస్తుతం దేశ రాజకీయాల్లో హాట్ టాపిక్ అవుతోంది. సమస్యలపై నిలదీసేందుకు సీనియర్ నేతలు సైతం తాము కాక్రోచులుగా మారతామంటూ వ్యాఖ్యానిస్తూ ఈ సెటైరికల్ ఉద్యమకారులకు మరింత క్రేజ్ పెంచేస్తున్నారని అంటున్నారు.

మరోవైపు ఈ ఉద్యమం వెనుక ప్రతిపక్షాల పాత్ర ఉందని ప్రభుత్వ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో అభిజిత్ దీప్కే చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని అంటున్నారు. ఎన్నికల్లో సీట్లు గెలవడం, అధికారంలోకి రావడం కంటే.. నిరుద్యోగం, విద్యా వ్యవస్థలోని అవినీతి, పేపర్ లీకేజీలు వంటి అంశాలపై యువత తరఫున గట్టి గొంతుకగా మారడమే ఈ 'కాక్రోచ్ జనతా పార్టీ' ముఖ్య ఉద్దేశమని అభిజిత్ దీప్కే చేసిన ప్రకటనతో రానున్న రోజుల్లో యువత సమస్యలపై మరిన్ని ఉద్యమాలకు ప్లాన్ చేస్తున్నట్లు ఉందని అంచనా వేస్తున్నారు.

## తెలంగాణలోని హన్మకొండలో పవన్ కల్యాణ్ పర్యటన

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణలోని హన్మకొండలో పర్యటించారు. స్థానిక హనుమాన్ నగర్‌కు చెందిన 15 ఏళ్ల నిరంజన్ అనే బాలుడు తీవ్రమైన నరాల సమస్యతో బాధపడుతున్నాడు. దురదృష్టవశాత్తూ వయసు 15 ఏళ్లయినా ఆ వ్యాధి కారణంగా కేవలం రెండు, మూడేళ్ల పిల్లాడిలాగే కనిపిస్తాడు, పైగా కాళ్లు కూడా పనిచేయవు. జీవితంతో పోరాడుతున్న ఆ చిన్నారికి తన అభిమాన హీరో పవన్ కల్యాణ్‌ను కలిసి, ఆయన సినిమా డైలాగ్‌ను ఆయన ముందే చెప్పాలనేది ఒకే ఒక్క చివరి కోరిక. ఈ విషయం తెలుసుకున్న పవన్ కల్యాణ్, నేరుగా ఆ బాలుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. నిరంజన్‌ను ప్రేమగా పలకరించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి బాలుడి ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ భావోద్వేగ భేటీ ముగిసిన తర్వాత పవన్ కల్యాణ్ హన్మకొండలోని ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారి ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకోనున్నారు. ఆ తర్వాత స్థానిక రిసార్ట్‌లో జనసేన కార్యకర్తలతో (జనసైనికులతో) ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారు. అక్కడే లంచ్ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం తిరిగి విజయవాడకు ప్రయాణమవుతారు. మరోవైపు, పవన్ కల్యాణ్ ను చూసేందుకు హన్మకొండలో అభిమానులు పోటెత్తారు.

## పాలన చూడండి.. పెట్టుబడులు పెట్టండి: రోడ్ షోలో చంద్రబాబు

మొదటిపేజి తరువాయి

కొనసాగించారు. పలువురు పెట్టుబడి దారులు, పారిశ్రామిక వేత్తలతో వరుస భేటీలు నిర్వహించారు. అనంతరం.. మంగళవారం సాయంత్రం.. సింగపూర్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ పారిశ్రామిక వేత్తలు, ఆవిష్కర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ బిజినెస్ రోడ్‌షోలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ప్రస్తుతం అనుమతులు వాయు వేగంతో ఇస్తున్నామన్నారు. ప్రత్యేకంగా డెస్కులు ఏర్పాటు చేశామని తెలిపారు. మరీ ముఖ్యంగా రాజధాని అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను చంద్రబాబు వివరించారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులను అమరావతికి ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ ఏడాదిలోనే క్వాంటం కంప్యూటింగ్ కార్యక్రమాలు ప్రారంభం అవుతున్నాయన్నారు. దీనిలో పెట్టుబడులు పెట్టేందుకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. ఇక, విశాఖ సమీపంలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు కాబోతోందని, సెమీకండెక్టర్ రంగంలో పెట్టుబడులకు అవకాశం ఉందని చంద్రబాబు తెలిపారు. అమరావతిలో ఆర్థిక నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు పేర్కొన్నారు. అదేసమయంలో ఆక్వా, వ్యవసా యం, నేచర్ ఫార్మింగ్, పర్యాటకం.. సహా అన్ని రంగాల్లోనూ అపారమైన పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ముందు పారిశ్రామిక వేత్తలు ఏపీకి రావాలని.. ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అమరావతికి వచ్చి.. పాలన తీరును, అనుమతులు ఇస్తున్న విధానాలను కూడా పరిశీలించాలని సూచించారు. అనంతరం.. పెట్టుబడులపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.

**ముగిసిన పర్యటన..** సీఎం చంద్రబాబు రెండు రోజుల పర్యటన మంగళవారంతో ముగిసింది. పెట్టుబడుల ఆకర్షణతో పాటు సింగపూర్ ప్రభుత్వంతో చర్చల నిమిత్తం అక్కడకు వెళ్లిన చంద్రబాబు.. సింగపూర్ ప్రతినిధులతోపాటు.. ప్రధానితోనూ భేటీ అయ్యారు. అమరావతి రాజధాని నిర్మాణంలో సహకారాన్ని కోరారు. ముఖ్యంగా అంతర్జాతీయ విమానాశ్రయాల నిర్మాణం, ఫార్మాల, ప్రకృతి సేద్యం, రహదారుల విస్తరణ, భవనాల నిర్మాణంలో సింగపూర్ ప్రణాళికలపై ఆయన చర్చించారు. చివరి రోజు.. మాత్రం పూర్తిగా పెట్టుబడులను ఆహ్వానించేందుకు శ్రమించారు.

## గుడివాడ అమర్‌నాథ్ క్షమాపణ చెప్పాలి

మొదటిపేజి తరువాయి

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హోంమంత్రి వంగలపూడి అనితను ఉద్దేశించి వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దావానలంలా మండుతున్నాయి. కూటమి ప్రభుత్వ నేతలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలు, తెలుగు మహిళా విభాగాలు అమర్‌నాథ్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. అనిత సైతం దీనిపై స్పందిస్తూ... రాజకీయ ముసుగు వేసుకుని మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచే వారిపై తాను కచ్చితంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఇలా మాట్లాడే ముందు తమ ఇళ్లలో కూడా మహిళలు ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిదని హితవు పలికారు. గుడివాడ అమర్‌నాథ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఇష్యూపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇవి కేవలం ఒక హోంమంత్రిని అన్న మాటలు కావని.. యావత్ మహిళా జాతిని, వారి ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని విమర్శించారు. మంత్రి నారా లోకేష్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ... ఒక దళిత మహిళ ఉన్నత పదవిలో ఉంటే ఓర్వలేక ఇలా కట్టు, బొట్టును టార్గెట్ చేస్తూ మాట్లాడటం.. వైసీపీ చేస్తున్న విషపూరిత, వికృత రాజకీయాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. వైసీపీ నేతలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయప్రతాప్ రెడ్డికి భద్రత కొనసాగింపు..

మొదటిపేజి తరువాయి

వాదనలను తోసిపుచ్చుతూ, ప్రస్తుత దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, ఫుడ్ కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న విజయప్రతాప్ రెడ్డికి కల్పించిన భద్రతను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించగా, విచారణ జరిపిన సింగిల్ జడ్జి ఆయనకు 1o1 భద్రతను వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. మంగళవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఈ అంశంలో లోతైన పరిశీలన అవసరమని అభిప్రాయపడింది. అందువల్ల, సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు లేదా వాటిని సవరించేందుకు న్యాయస్థానం అంగీకరించలేదు. డివిజన్ బెంచ్ నిర్ణయంతో ఫుడ్ కమిషన్ ఛైర్మన్‌కు ప్రస్తుతం 1o1 భద్రత కొనసాగనుంది. అనంతరం ఈ కేసు విచారణను ధర్మాసనం మూడు నెలలకు వాయిదా వేసింది. తదుపరి విచారణ సందర్భంగా ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి వాదనలు విననున్నట్లు కోర్టు వెల్లడించింది.

## ఇక బ్యాంకుల ఇష్టం చెల్లదు.. అవసరం లేని పాలసీలు, లోన్లు అంటగట్టొద్దు!: ఆర్‌బీఐ

మొదటిపేజి తరువాయి

వినియోగదారుడి సమ్మతికి కూడా కొత్త నిర్వచనం తీసుకొచ్చింది ఆర్‌బీఐ. ఒక ఉత్పత్తికి ఇచ్చిన అంగీకారాన్ని మరో ప్రొడక్ట్‌ను వర్తింపచేయకూడదు. రుణం తీసుకున్న వ్యక్తికి అదే ఆధారంగా బీమా, పెట్టుబడి పథకాలు లేదా ఇతర ఆఫర్లను పంపడం కుదరదు. ప్రతి ఉత్పత్తికి విడిగా స్పష్టమైన అనుమతి తీసుకోవాల్సిందే. డిజిటల్ వేదికల్లో బ్యాంకులు అనుసరిస్తున్న పలు పద్ధతులపై కూడా ఆర్‌బీఐ దృష్టి పెట్టింది. కస్టమర్లను మభ్యపెట్టేలా కౌంట్‌డౌన్ టైమర్లు చూపించడం, ముందుగానే టిక్ చేసిన ఆప్షన్స్ ఉంచడం, తిరస్కరించే బటన్‌ను గందరగోళంగా చూపించడం, మూసివేయాలనుకుంటే లోన్ పేజీకి తీసుకెళ్లే పాప్‌అప్‌లు చూపించడం వంటి పద్ధతులను నిషేధించింది. లోన్ దరఖాస్తు సమయంలో వినియోగదారుడికి తెలియకుండా బీమా పాలసీని జత చేయడం, చివరి దశలో అదనపు ఛార్జీలను చూపించడం, అత్యవసర హెచ్చరికలా కనిపించే ప్రకటనలు పంపించడం వంటి చర్యలు కూడా ఇక అనుమతించబోవడం లేదు. బ్యాంకుల తరఫున పనిచేసే డైరెక్ట్ సెల్లింగ్ ఏజెంట్లు, మార్కెటింగ్ ప్రతినిధులపైనా కొత్త నియంత్రణలు అమల్లోకి రానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల మధ్య మాత్రమే వినియోగదారులను సంప్రదించాలి. అనుమతి లేకుండా ఇంటికి లేదా కార్యాలయానికి వెళ్లకూడదు. తమను బ్యాంకు ఉద్యోగులుగా పరిచయం చేసుకోవడం కూడా నిషేధం.



## ట్రంప్ ఎదుటే నావికుల భద్రతపై గళమెత్తిన మోదీ

ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ-7 శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ నావికుల భద్రత అంశాన్ని బలంగా ప్రస్తావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన సందర్భంగా, ఇటీవలే అమెరికా జరిపిన సైనిక దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనను ఆయన పరోక్షంగా గుర్తుచేశారు. వేలాది మంది భారత నావికుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, వారికి తగిన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. పశ్చిమాసియాలో శాంతి స్థాపన దిశగా జరుగుతున్న ప్రయత్నాలను ప్రధాని స్వాగతిస్తూనే, అక్కడి ఉద్రిక్తతల కారణంగా భారత పౌరుల ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రపంచ వాణిజ్యం కోసం దేశాలను అనుసంధానించే నావికుల భద్రత మనందరి ఉమ్మడి బాధ్యత. సముద్ర వాణిజ్య మార్గాలు సురక్షితంగా ఉండేలా చూస్తూ, వారు ఎటువంటి భయాందోళనలు లేకుండా విధులు నిర్వహించే వాతావరణాన్ని కల్పించాలి" అని మోదీ ఉద్ఘాటించారు.


# కాకతీయ ప్రకాశం

3

17 బుధవారం జూన్ 2026


# సంపాదకీయం..

## ఇండో పేరు తీసేసి.. పాక్ లో కలిపేసి.. అమెరికాకు కండకావరం ఎక్కేసింది..

అమెరికా రక్షణ శాఖ తీసుకున్న ఒక తాజా నిర్ణయం అంతర్జాతీయ దౌత్య వర్గాలతో పాటు.. భారత సోషల్ మీడియాలోనూ తీవ్ర చర్చకు దారితీసింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు.. భారత్‌కు ఉన్న వ్యూహాత్మక ప్రాధాన్యతను గుర్తిస్తూ గతంలో మార్చిన అమెరికా అతిపెద్ద సైనిక కమాండ్ పేరును ఇప్పుడు మళ్లీ పాత పేరుకే మార్చడం గమనార్హం. అంతేకాదు ఈ సందర్భంగా విడుదల చేసిన అధికారిక మ్యాప్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)ను పాకిస్థాన్ భూభాగంగా చూపించడం భారత్‌లో తీవ్ర విమర్శలకు, ఆందోళనలకు కారణమవుతోంది.

**'ఇండో' తొలగింపు.. పాత పేరుకే మొగ్గు**

అమెరికా రక్షణశాఖ (పెంటగాన్) తాజాగా "యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్" పేరును మళ్లీ "యూఎస్ పసిఫిక్ కమాండ్" గా మారుస్తున్నట్లు ప్రకటించింది. చారిత్రక వారసత్వాన్ని గౌరవించడం, పసిఫిక్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న సైనికుల్లో స్ఫూర్తిని పెంపొందించడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా రక్షణ శాఖ వివరణ ఇచ్చింది.

రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో భద్రత, ప్రాంతీయ స్థిరత్వం కోసం 1947 జనవరి 1న అప్పటి అమెరికా అధ్యక్షుడు హ్యారీ ఎస్. ట్రుమన్ ఈ పసిఫిక్ కమాండ్‌ను ఏర్పాటు చేశారు. కొరియా, వియత్నాం యుద్ధాలతో పాటు అనేక మానవతా సహాయక కార్యక్రమాల్లో ఈ కమాండ్ కీలక పాత్ర పోషించింది.

**2018లో మార్పు.. ఇప్పుడు రివర్స్**

హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహాసముద్రాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక అనుసంధానాన్ని ప్రాంతీయ భద్రతలో భారత్ పాత్రను గుర్తిస్తూ 2018లో అప్పటి అమెరికా రక్షణ మంత్రి జేమ్స్ మ్యాటిస్ ఈ కమాండ్ పేరును "ఇండో-పసిఫిక్"గా మార్చారు. డొనాల్డ్ ట్రంప్ తొలి హయాంలో జరిగిన ఈ మార్పు భారత్-అమెరికా రక్షణ బంధంలో ఒక మైలురాయిగా నిలిచింది. అయితే ఇప్పుడు మళ్లీ ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలోనే ఎనిమిదేళ్ల తర్వాత ఆ పేరు నుండి 'ఇండో'ను తొలగించడం సరికొత్త వ్యూహాత్మక చర్చలకు దారితీసింది.

**మ్యాప్ వివాదం.. భారత్‌కు అమెరికా షాక్?**

పేరు మార్పు ఒక ఎత్తయితే ఈ కమాండ్ పరిధిని వివరిస్తూ అమెరికా విడుదల చేసిన అధికారిక మ్యాప్ దేశంలో తీవ్ర దుమారం రేపింది. ఈ మ్యాప్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) ను పాకిస్థాన్‌లో భాగంగా చూపించడం గమనార్హం. జమ్మూ-కశ్మీర్, లడఖ్ ప్రాంతాలు పూర్తిగా భారతదేశంలో అంతర్భాగమని, పీఓకే పై భారత్‌కు పూర్తి సార్వభౌమాధికారం ఉందని ఢిల్లీ ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తూనే ఉంది. ఇలాంటి తరుణంలో అమెరికా అధికారిక మ్యాప్‌లో పీఓకేని పాకిస్థాన్‌లో చూపించడం దౌత్యపరంగా భారత్‌కు గట్టి షాక్ అనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో నెటిజన్లు అమెరికా ద్వంద్వ నీతిని తీవ్రంగా తప్పుబడుతున్నారు.

**క్వాడ్ కూటమి అంతానికి సంకేతమా?**

ఈ పరిణామంపై రాజకీయ వర్గాల నుంచి కూడా తీవ్ర స్పందన వస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ దీనిపై స్పందిస్తూ ఇది "క్వాడ్ అంతానికి మరో మేకు" అంటూ ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. చైనా పెరుగుతున్న ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా కలిసి ఏర్పాటు చేసిన క్వాడ్ కూటమి భవిష్యత్తుపై ఈ నిర్ణయం ప్రతికూల ప్రభావం చూపుతుందా అనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**కేవలం పరిపాలనా పరమైన నిర్ణయమేనా?**

అమెరికా అధికారిక వర్గాలు మాత్రం ఇది కేవలం చారిత్రక పేరును పునరుద్ధరించే ఒక పరిపాలనా నిర్ణయమేనని.. భారత్‌తో ఉన్న వ్యూహాత్మక సంబంధాలకు దీనికి ఎలాంటి సంబంధం లేదని సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నాయి. అయినప్పటికీ భారత్-అమెరికా అగ్రనేతల భేటీకి ముందు ఈ పేరు మార్పు, పీఓకే మ్యాప్ వివాదం తెరపైకి రావడం అంతర్జాతీయ దౌత్య రంగంలో తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికా నిజంగానే తన వ్యూహాన్ని మార్చుకుందా లేదా అనేది ముున్ముందు తేలనుంది.

## సైబర్ నేరగాళ్లు సమాజానికి పరాన్నజీవులు: సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల సంపదను దోచుకునే 'పరాన్నజీవులు' అని, వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉందని సుప్రీంకోర్టు బుధవారం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒక సైబర్ మోసం కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. తనపై వివిధ రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కలిపి విచారించాలని కోరుతూ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టులను ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది."మీలాంటి వారు పరాన్నజీవులు. అమాయక మదుపరుల నుంచి సొమ్ము వసూలు చేసి వారిని వంచిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలో మేము అత్యంత కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది" అని విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఈ తరహా నేరగాళ్లు తమిళనాడు నుంచి జమ్మూకశ్మీర్ వరకు దేశవ్యాప్తంగా అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ధర్మాసనం ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి నేరస్థులను జైల్లోనే ఉంచడం సామాజిక ప్రయోజనాలకు శ్రేయస్కరమని ధర్మాసనం పేర్కొంది. దేశంలో "డిజిటల్ అరెస్ట్" వంటి స్కామ్‌లతో సహా ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# కులమతాలకతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం

## మార్కాపురం శాసనసభ్యులు శ్రీ కందుల నారాయణరెడ్డి

**మార్కాపురం, కాకతీయ:** బుధవారం నాడు మార్కాపురం పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో "రెండేళ్ల నమ్మకం- సంక్షేమం అభివృద్ధి" మార్కాపురం విజయోత్సవ సభ నిర్వహించారు. వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది.... జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గారి వెల్లడి.

ఎన్నికల ముందు చెప్పిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతుందని ఈ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గారు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజలను మోసం చేసి అనేక వాగ్దానాలు ఇచ్చారని కానీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేక పోయారని ఏద్దేవ చేశారు . తమ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి గారు చర్యలు తీసుకున్నారు అని వివరించారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన 905 కోట్ల రూపాయలను ప్రభుత్వ విడుదల చేసిందన్నారు. రాయలసీమ మాదిరిగా మార్కాపురం జిల్లాని ఆర్టికల్చర్ హబ్ గా తయారు చేయడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నా రన్నారు. శ్రీశైలం ఘాట్ రోడ్డును నాలుగు లైన్ల కారిడార్ గా అభివృద్ధి చేయడానికి ప్రధానమంత్రి ఆమోదం తెలిపారని చెప్పారు. రాష్ట్రంలో దేవాలయాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం 16.84 కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో 116 ఆలయాలకు దీప దూప నైవేద్యాలకు పదివేల రూపాయల చొప్పున 1.10 కోట్ల ను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గారు మాట్లాడుతూ జిల్లాలో వెలిగొండ పూర్తి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు జలవన శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గారు ప్రతి నెల ప్రాజెక్టును సందర్శించడం జరుగుతుందన్నారు. గత వైకాపా ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసి ఈ ప్రాంత ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. మార్కాపురం శాసనసభ్యులు శ్రీ కందుల నారాయణరెడ్డి గారు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో భూకబ్జాలు, ఇష్టానుసారంగా ఆన్లైన్లో చేసి జిల్లాను అధోగతి పాలు చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి గారు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లాని ప్రకటించారని దీంతో జిల్లా ప్రజల కల నెరవేరిందని తెలిపారు. జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు పరిశ్రమలను స్థాపించే దిశగా ముఖ్యమంత్రి గారి ఆలోచన చేస్తున్నారన్నారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి గారు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం ఐదు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.



మార్కాపురం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని వివరించారు. జిల్లా జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత గారు మాట్లాడుతూ జూలై చివరి నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అదే విధంగా జల ధార జలహారతి, ఎన్టీఆర్ భరోసా, స్త్రీ శక్తి పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందారని వివరించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి, గిద్దలూరు ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గారు , మత్తుముల అశోక్ రెడ్డిగారు ,రాష్ట్ర మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య గారు, ఎర్రగొండపాలెం తెదేపా ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు , భాజపా మీడియా అధికార ప్రతినిధి రామచంద్ర రెడ్డి , జిల్లా అధ్యక్షులు కృష్ణారావు గారు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాబోయే మూడేళ్లలో కందుకూరుకు మహర్దశ

## బీద రవిచంద్ర యాదవ్

- పోర్టు,కంపెనీల ఏర్పాటుతో వేలమందికి ఉపాధి
- ఎమ్మెల్యే ఇంటూరి పనితీరు భేష్
- అభివృద్ధి అజెండాగా 2029 ఎన్నికలకు వెళదాం
- వైసిపి కుట్రలను తిప్పికొట్టాలని నేతలకు రవిచంద్ర పిలుపు
- 450 కోట్లతో అభివృద్ధి- ఇదే నా చిత్తశుద్ధికి నిదర్శనం
- ఎమ్మెల్యే నాగేశ్వరరావు
- మర్యాదగా మాట్లాడటం నేర్చుకోవాలని బుర్రాకు హితవు
- మాలకొండ రెండు ఘాట్ రోడ్డుకు నెలలోపు శంకుస్థాపన.



**కంచుకూరు(కాకతీయ డివిజన్ ప్రతినిధి) జూన్ 17 :** అబద్ధపు ప్రచారాలు, తప్పుడు ఆరోపణలతో ప్రజల్లో గందరగోళం సృష్టించడమే వైసిపి పని అని,2024 ఎన్నికలకు ముందు జరిగిన కుట్రలే మళ్లీ చేసేందుకు జగన్ ప్లాన్ వేస్తున్నారని బీద రవి చంద్ర యాదవ్ అన్నారు.అందులో భాగంగానే సోషల్ మీడియాలో టిడిపి నేతలపై విషం కక్కుతున్నారన్నారు. కూటమి పార్టీల నేతలు అందరూ ఆ దాడులను తిప్పికొట్టాలని,కేవలం అభివృద్ధి అజెండాగా 2029 ఎన్నికలకు వెళ్లి,మళ్లీ కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టేలా సమిష్టిగా పని చేయాలని ఎమ్మెల్సీ,నెల్లూరు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు బీద రవిచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా... కందుకూరులోని ఎస్వీఎస్ కళ్యాణమండపంలో, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నేతృత్వంలో విజయోత్సవ సభ బుధవారం జరిగింది.నియోజకవర్గ నలుమూలల నుంచి వేల సంఖ్యలో మూడు పార్టీల నేతలు,కార్యకర్తలు తరలివచ్చారు.పామూరు రోడ్డు జంక్షన్ నుంచి కళ్యాణ మండపం వరకు జనం కిక్కిరిశారు. కళ్యాణ మండపంలో రెండు హాళ్లు నిండిపోగా,మండపం బయట ఎండ వేడిమిని తట్టుకుని ప్రభుత్వ విజయోత్సవ వేడుకల్లో పాలుపంచుకున్నారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీద రవిచంద్ర యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి, ఈ సారైనా గెలుస్తామన్న నమ్మకాన్ని వైసిపి నేతలు కోల్పోయారని అన్నారు.అందుకే ప్రతిరోజు ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.2019 ఎన్నికలకు ముందు పింక్ డైమండ్, వివేకా హత్య, ఒకే సామాజిక వర్గానికి డి.ఎస్.పి ప్రమోషన్లు అంటూ అనేక అబద్దాలు చెప్పి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చారని రవిచంద్ర విమర్శించారు. ఇప్పుడు కూడా డీఎస్సీపై ఆరోపణలు మొదలుపెట్టారని అన్నారు. చంద్రబాబు డేటా సెంటర్లు,పరిశ్రమలు, ఉద్యోగాలు అని కష్టపడుతుంటే జగన్మోహన్ రెడ్డి మాత్రం విధ్వంసం వైపు అడుగులు వేస్తున్నారని అన్నారు.చంద్రబాబు సహకారంతో కందుకూరు నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని బీద రవిచంద్ర తెలిపారు.ప్రజల కోసం నిరంతరం కష్టపడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు,పట్టుబట్టి నిధులు సాధిస్తున్నారని అన్నారు. కందుకూరు అభివృద్ధి గురించి ప్రజల్లో సూపర్ రెస్పాన్స్ ఉందని, రాబోయే మూడేళ్లలో ఊహించని స్థాయిలో పనులు జరుగుతాయన్నారు.ఎంపీ వేమిరెడ్డి సహకారంతో, గొట్టిపాటి కొండపనాయుడు కెనాల్ పనులు పూర్తి చేసి సోమశిల నుంచి రాళ్లపాడుకు జలాలు తీసుకొచ్చామని తెలిపారు.రామాయపట్నం పోర్టు, బిపిసిఎల్ కంపెనీల ఏర్పాటుతో కందుకూరు, కావలి నియోజకవర్గాలలో వేల మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఓటర్ల జాబితాలకు సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న సర్ కార్యక్రమంపై నేతలు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

**నేను చేసిన అభివృద్ధి ఇదే- ఎమ్మెల్యే ఇంటూరి**

ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ రెండేళ్లలో నియోజకవర్గంలో 450 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టగలిగానని సగర్వంగా ప్రకటించారు. ప్రధానంగా మున్సిపాలిటీలో రోడ్ల వెడల్పు, కొత్తగా సిసి రోడ్లు మరియు డ్రైనేజీ నిర్మాణాలు, శివారు ప్రాంతాలకు రామతీర్థం నీటి సరఫరా, మురికి నీటిని వాడుకునీటిగా మార్చి ప్లాంట్, పట్టణంలో పార్కులు మరియు కుంటల ఆధునికరణ, ఎంఐజి లేఅవుట్... తదితర పనులకు 110 కోట్లు ఖర్చు చేసామన్నారు. కందుకూరు మండలంలోని గ్రామాలకు రామతీర్థం తాగునీటిని అందించేందుకు 40 కోట్లు, 1800 ఎకరాల గర్భ కంద్రిక భూములకు మోక్షం, 12 ఎకరాల నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీ భూ సమస్యకు పరిష్కారం, 9 కోట్లతో మాలకొండ దేవస్థానం అభివృద్ధి, 11 కోట్లతో చెరువుల అభివృద్ధి, 28 కోట్లతో రామాయపట్నం వద్ద జెట్టి నిర్మాణం, 4 కోట్లతో రాళ్లపాడు రిజర్వాయర్ అభివృద్ధి పనులు... ఇలా చెప్పుకోవడానికి తనకే గర్వంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 10.5 కోట్ల రూపాయలను అత్యధికంగా కందుకూరు నియోజకవర్గానికి తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.నియోజకవర్గంలో ఈ రెండేళ్లలో తల్లికి వందనం పథకానికి 44.61 కోట్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు 403 కోట్లు, అన్నదాత సుఖీభవకు 62 కోట్లు, మత్స్యకార భరోసాకు 5.16 కోట్లు ఖర్చు చేశామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. స్త్రీ శక్తి పథకం ద్వారా 68 లక్షల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించారని వెల్లడించారు.ఇక వైసిపి ఇన్చార్జ్ బుర్రా మధుసూదన్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఆయన లాగా సంస్కారహీనంగా మాట్లాడే లక్షణం తనది కాదన్నారు. రాజకీయాలలో హుందాతనంగా మాట్లాడాలని,లేకుంటే ప్రజలు వాతలు పెట్టి కందుకూరు నుంచి తరిమేస్తారని మధుసూదన్ ను ఉద్దేశించి అన్నారు.నియోజకవర్గంలో గతంలో ఎంతోమంది నాయకులు రాజకీయం చేశారు కానీ, బుర్రా లాగా చిల్లర మాటలు మాట్లాడలేదన్నారు.కనిగిరి నియోజకవర్గంలో 2019-24 మధ్య సుమారు 250 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి మధుసూదన్ వెంచర్లు వేశారని ఎమ్మెల్యే విమర్శించారు. తరువాత అవి ప్రభుత్వ భూములని తెలుసుకొని, ప్లాట్లు కొన్నవారు ఇప్పటికీ అల్లాడిపోతున్నారని చెప్పారు. ఆ వ్యవహారంలో తహసీల్దారులు, వీఆర్వోలు సస్పెండ్ అయ్యారని చెప్పారు. ఇలాంటి అవినీతి పనులు మధుసూదన్ ఎన్నో చేశారని, అవన్నీ ఆధారాలతో సహా ఒక్కొక్కటిగా బయటపెడతానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు హెచ్చరించారు. ప్రజల అభిమానంతో రాబోయే ఎన్నికల్లో బుర్రాను ఓడించి, గతంలో కంటే రెట్టింపు మెజారిటీ సాధిస్తానని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు.ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండ పైకి, రెండవ ఘాట్ నిర్మాణ పనులు త్వరలో మొదలవుతాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రకటించారు.15 రోజుల్లో టెండర్లు పిలుస్తారని అన్నారు. అలాగే 1.75 కోట్ల రూపాయలతో, భక్తులందరూ ఒకేసారి అన్న ప్రసాదం స్వీకరించేలా అధునాతన భవనాన్ని నిర్మించబోతున్నట్లు తెలిపారు. మాజీ శాసనసభ్యులు దివి శివరాం మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పరిపాలన బ్రహ్మాండంగా ఉందన్నారు. కందుకూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభివృద్ధిపై బాగా దృష్టి పెడుతున్నారని చెప్పారు. రాబోయే మూడు సంవత్సరాల్లో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న విధానం బాగుందన్నారు.సభ ప్రారంభానికి ముందు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి బీద రవిచంద్ర, ఎమ్మెల్యే నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మహిళలు, యువకులు అధిక సంఖ్యలో విజయోత్సవ సభకు తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, నియోజకవర్గ బిజెపి కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, జనసేన నాయకులు కళ్యాణ్, నెల్లూరు పార్లమెంట్ కమిటీ నాయకులు షేక్ రూబీ, మద్దసాని మహేంద్ర, దార్ల ఎలమందమ్మ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, ఏపీ ఈడబ్ల్యుఐడీ కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, సీనియర్ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీను, బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, షేక్ సలాం, నాదెళ్ళ రమణయ్య, నరేంద్ర, అనుబంధ సంఘాల అధ్యక్షులు కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, అల్లం వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను, పొడపాటి మహేష్, షేక్ మున్నా, పూరిమిట్ల మాల్యాద్రి, రాయపాటి శ్రీనివాసరావు, మోదడుగు వెంకటేశ్వర్లు, ముచ్చు లక్ష్మీరాజ్యం, జనసేన నాయకులు కొణిదల శ్రీనివాసులు, అంగులూరి నరసింహారావు, గ్రామ మరియు వార్డు అధ్యక్షులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందేలపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

### 10 వేల 50 రూపాయల నగదు,మూడు కోళ్లు,5 సెల్ ఫోన్లు,3 మోటార్ సైకిళ్లు స్వాధీనం



**కందుకూరు(కాకతీయ ప్రతినిధి) జూన్ 17:** జిల్లా వ్యాప్తంగా అసాంఘిక మరియు జూద కార్యకలాపాలను అరికట్టే లక్ష్యంతో ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ మరియు పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్సై చెంచయ్య,ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా మరియు సిబ్బంది కలసి కందుకూరు రూరల్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో పలుకూరు గ్రామ పొలాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న కోడి పందేలపై దాడులు నిర్వహించారు.8 మందిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి మూడు కోళ్ళు, మూడు సెల్ ఫోన్లు,3 మోటర్ సైకిళ్లు,10 వేల 50 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.ప్రజలు ఇటువంటి అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని సూచించారు.పట్టుబడిన వ్యక్తులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.



**మార్కాపురం, కాకతీయ** పొదిలి మండలం వైసిపి పార్టీ మాజీ అధ్యక్షులు దుగ్గంపూడి శ్రీనివాస్ రెడ్డి (హనీమూన్ శ్రీనివాసరెడ్డి) వారి అనుచరులతో ఈరోజు మార్కాపురం పట్టణంలో మార్కాపురం శాసనసభ్యులు శ్రీ కందుల నారాయణ రెడ్డి గారి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి రాష్ట్ర విద్యుత్ శాఖ మాత్యులు శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు, జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారు, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాస రెడ్డి గారు , కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గారు, గిద్దలూరు శాసనసభ్యులు శ్రీ ముత్తుమల అశోక్ రెడ్డి గారు, ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జ్ శ్రీ గూడూరు ఎరిక్షన్ బాబు గారు, రాష్ట్ర మారీ టైం బోర్డ్ చైర్మన్ శ్రీ దామచర్ల సత్య గారు వారికి మెడలో తెలుగుదేశం పార్టీ కండవలు వేసి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు.



**మార్కాపురం, కాకతీయ:** మార్కాపురం పట్టణంలోని మార్కెట్ యార్డ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు అయిన సందర్భంగా పార్లమెంట్ పరిధిలో నిర్వహించిన విజయోత్సవ సభలో పాల్గొన్న జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి గారు, విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ గారు, కలెక్టర్ విజయసునీత, పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి గారు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి గారు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గారు మరియు యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు గారు.

## గిట్టుబాటు ధర కోసం పొగాకు రైతులు ఆందోళన



**కందుకూరు(కాకతీయ ప్రతినిధి) జూన్ 17:** పామూరు రోడ్ లోని 27వ పొగాకు వేలం కేంద్రం, మరియు కనిగిరి రోడ్డులోని 26 వ వేలం కేంద్రాలలో కొనుగోళ్లను రైతులు నిలిపివేశారు.బ్రైట్ పొగాకును కేజీ 160 నుండి 170 వరకు కొనుగోలు చేస్తుండడంతో ఆగ్రహించిన రైతులు వేలంను నిలుపుదల చేశారు.సరైన గిట్టుబాటు ధర ఇచ్చేంతవరకు వేలం జరగనివ్వబోమని నిరసన తెలిపారు.రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లను పెట్టి నిరసన వ్యక్తం చేయడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

# కాకతీయ అమరావతి

గురువారం జూన్ 18-6- 2026








# మంచి ప్రభుత్వాన్ని మనసారా ఆశీర్వదించండి

## నేడు గుంటూరు తూర్పులో రెండేళ్ల సుపరిపాలన సభ ...ఏర్పాట్లపై శ్రేణులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే నసీర్

రెండేళ్ల కూటమి పాలనలో గుంటూరు తూర్పు నియోజకవర్గం అభివృద్ధికి చిరునామాగా, సంక్షేమానికి నిలయంగా మారిందని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ తెలిపారు. కోట్లాది రూపాయల అభివృద్ధి పనులతో నియోజకవర్గ రూపురేఖలు మారాయని, సంక్షేమ ఫలాలు ప్రతి గడపకు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో మరింత ప్రగతి, మరింత ప్రజాహితం లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో సాగుతున్న రెండేళ్ల సుపరిపాలన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు.




గుంటూరు జూన్ 17 (కాకతీయ) తూర్పు రెండేళ్ళలో ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగింది. గతంలో ఎన్నడు లేని విధంగా కోట్లాది రుపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు గుంటూరు జూన్ 17 (కాకతీయ) రెండేళ్ల కిందట మొదలైన కూటమి ప్రభుత్వ పయనం ప్రజా సంక్షేమమే పరమావధిగా సాగిందని, ప్రతి గడపలో సంతోషాలు తీసుకొచ్చిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. కూటమి సుపరిపాలన రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో నేడు స్థానిక ఎన్ హెచ్ 16 పక్కన సత్యసాయి నగర్ గ్రౌండ్ లో ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బుధవారం స్థానిక తూర్పు కార్యాలయంలో కూటమి నాయకులతో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నవశకానికి నాంది పలికిందని తెలిపారు. హామీల అమలులో అడుగులు ముందుకు పడ్డాయని, చెప్పిన మాటను నిలబెట్టుకుంటూ పేదవాడి గుండెల్లో వెలుగులు నింపామని చెప్పారు. రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలను గుర్తు చేస్తూ ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమరావతి, క్వాంటమ్ వ్యాలీ, గూగుల్, సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాల్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. అవ్వాతాతల పెన్షన్ల పెంచామని, పరిశ్రమల స్థాపనతో యువతకు బంగారు బాట వేశామని చెప్పారు. అటు సంక్షేమ పథకాలను లబ్ధిదారులు ఇళ్ల వద్దకు చేరుస్తూనే అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేశామని తెలిపారు. తల్లికి వందనంతో తల్లిదండ్రులకు భరోసా కల్పించామని, స్త్రీశక్తి పథకం ద్వారా మహిళల ఉచిత ప్రయాణానికి నాంది పలికామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ తో పేదల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులందరూ కార్యక్రమానికి విచ్చేసి మంచి ప్రభుత్వాన్ని మనసారా ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ తో భద్రతేగానీ భయం లేదుఎస్ఐఆర్ తో ఓటర్లకు భద్రతేగానీ భయం లేదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించేందుకుగాను స్థానిక తూర్పు కార్యాలయంలో కూటమి నాయకులతో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్లందరికీ ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐఆర్ తో ఓట్లు తొలగిపోతాయనే అపోహ ఎవరూ పెట్టుకోవద్దని చెప్పారు. బీఎల్వోల వద్ద ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకుని కుటుంబ వివరాలను అందులో నమోదు చేయాలన్నారు. వీటిని బీఎల్వోలకు అందజేయాలని సూచించారు.

# అర్జీదారుల పట్ల నిర్లక్ష్యం సహించం

## మహిళ ఫిర్యాదుతో తహసీల్దార్ కార్యాలయానికి ఎమ్మెల్యే నసీర్ ఆకస్మిక తనిఖీ



గుంటూరు, జూన్ 17(కాకతీయ) : ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించే అధికారులను ఉపేక్షించబోమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ మహమ్మద్ నసీర్ హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ సమర్పించి వారాలు గడిచినా స్పందన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాత గుంటూరుకు చెందిన ఓ మహిళ తనను ఆశ్రయించడంతో ఎమ్మెల్యే నసీర్ వెంటనే స్పందించారు. మహిళ వినతిని స్వీకరించిన అనంతరం ఆయన స్వయంగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. సంబంధిత అర్జీ పరిష్కారంలో జాప్యం ఎందుకు జరిగిందో వివరణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సరైన కారణం లేకుండా ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదని, ఇలాంటి నిర్లక్ష్య ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. అర్జీదారుల సమస్యలను సకాలంలో పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే, మహిళ సమస్యను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇస్తోందని, అధికారులు కూడా అదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా లేదా ప్రభుత్వ కార్యాలయాల్లో స్పందన లభించకపోయినా తన కార్యాలయాన్ని నేరుగా సంప్రదించవచ్చని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

# మంగళగిరి మాట నెరవేర్చిన లోకేష్




గత ఎన్నికల సమయంలో మంగళగిరిలోని ప్రతి వీధిలోనూ పర్యటించిన నారా లోకేష్.. అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదే.. మురుగునీటి సమస్య. చిన్న చినుకుపడ్డా.. నియోజకవర్గంలోని ప్రధాన రహదారులు సహా.. అన్ని ప్రాంతాలు.. కాలువలను తలపిస్తాయి. ఇక, మురగునీరుతో ప్రాంతాలుదుర్గంధం వెదజల్లు తుంటాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు పడడమే కాకుండా.. అనారోగ్యాల పాలవుతున్నారు. రెండుసార్లు.. ఎమ్మెల్యేగా గెలిచిన ఆళ్ల రామకృష్ణారెడ్డి ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి కూడా దానిని అలానే వదిలేశారు. మంగళగిరి నియోజకవర్గం వ్యాప్తంగా బలమైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమే దీనికి కారణమని గుర్తించిన నారా లోకేష్.. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత.. మునిసిపల్ ఇంజనీర్లతో అధ్యయనం చేయించారు. భూగర్భ డ్రైనేజీని ఎక్కడ నుంచి ఎక్కడ వరకు నిర్మించాలన్న విషయంపై పక్కా ప్లాన్ తీసుకున్నారు. తాజాగా దీనికి సంబంధించి.. భూమి పూజ పనులు చేపట్టారు. ప్రస్తుత అంచనాల ప్రకారం.. మంగళగిరి నియోజకవర్గంలోని 70 శాతం ప్రాంతంలో.. ఈ భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కానుంది. తద్వారా.. స్థాని కంగా ఉత్పత్తి అయ్యే మురుగునీరుతోపాటు.. వర్షాల కారణంగా ఏర్పడే నీరు కూడా.. సులభంగా తరలి పోయేలా ఈ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. దీనికి తాజాగా భూమి పూజ చేసిన నారా లోకేష్.. మంగళగిరి వాసుల దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపించారు. ప్రాజెక్టు డైమన్షన్స్ ఇవీ..మొత్తం వ్యయం: 1167 కోట్ల రూపాయలు. ప్రాజెక్టు పరిధి: మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్. నిధుల ఖర్చు: కేంద్రం 60%, రాష్ట్రం 40%పని పూర్తి: 531 కిలో మీటర్ల పరిధిలో రెండు దశలలో ఈ పనులు పూర్తి చేయనున్నారు. మురుగునీటిని శుద్ధికి 20 కేంద్రాలు ఏర్పాటు. 18 లిఫ్ట్ స్టేషన్ల ఏర్పాటు.

# సాయికృష్ణ ఘటనపై చంద్రబాబు సీరియస్




గుంటూరు, జూన్ 17(కాకతీయ) విజయవాడలోని కృష్ణలంక ప్రాంతానికి చెందిన సాయికృష్ణ అనే యువకుడు లాకప్ డెత్ కు గురయ్యాడని తీవ్రస్థాయిలో ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. ఆ యువకుడిపై పలు కేసులున్నాయని, ఈ క్రమంలోనే మే 9వ తేదీన అతడిని పోలీసులు తీసుకుపోయారని ప్రచారం జరుగుతోంది. ఆ తర్వాత ఆ యువకుడు ఇంటికి రాలేదని, ఆ యువకుడు లాకప్ డెత్ కావడంతో పోలీసులే అతడి శవాన్ని తగులబెట్టారని కొందరు వైసీపీ నేతలు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. అంతేకాదు, ఆ యువకుడు జనసేన కార్యకర్త అని, ఈ వ్యవహారంపై ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించాలని మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే ఆ ఆరోపణలపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. ఆ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ ఆరోపణలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి నిష్పక్షపాతంగా నిజానిజాలు నిగ్గు తేల్చాలని ఆదేశాలు జారీ చేశారు. విచారణ తర్వాత తనకు సమగ్ర నివేదిక సమర్పించాలని కూడా ఆదేశించారు. ఈ ఆరోపణల నేపథ్యంలోనే కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న సీఐను వీఆర్ కు పంపామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు.

# పాఠశాలను తనిఖీ చేసిన మండల విద్యాశాఖాధికారి యండి ఖాసిం

పిగుగురాళ్ళ జూన్ 17 '(కాకతీయ) పిడుగురాళ్ల మండల విద్యాశాఖ అధికారి ఎండి ఖాసీం పిడుగురాళ్ల మండలంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాల, కోనంకి ని తనిఖీ చేశారు ఈ సందర్భంగా వారు ప్రధానోపాధ్యాయులకు మరియు ఉపాధ్యాయులకు పలు సూచనలుచేశారు ఎనిమిదో తరగతి వరకు ఉన్న పాఠశాలను గ్రామస్తులు మరియు తల్లిదండ్రుల సహకారంతో ఉన్నత పాఠశాల వరకు చేయటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం ఎటువంటి రాజీ పడవద్దని అన్నారు పాఠశాలలోని విద్యార్థులు అందరూసమయపాలన పాటించే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని అన్నారు పాఠశాలలోని విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు మరియు పాఠ్య పుస్తకాలు అందించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు


















# మామయ్య కోసం వచ్చి ప్రమాదంలో చిక్కుకున్న యువకులు

### ఒకరికి కాలు విరిగింది.. మరొకరికి తీవ్ర గాయాలు

**జూన్ 17.... చీరాల కాకతీయ:** బాపట్ల జిల్లా చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రమాద ఘటన చోటుచేసుకుంది. తిమ్మసముద్రానికి చెందిన చల్లా రవికుమార్, జడ వెంకట్రావు తమ మామయ్యను బస్టాండ్ నుంచి ఇంటికి తీసుకెళ్లేందుకు బులెట్ మోటార్‌సైకిల్‌పై వచ్చారు. ఈ క్రమంలో బస్టాండ్‌లోకి ప్రవేశిస్తున్న సమయంలో చీరాల--విజయవాడ మార్గంలో నడిచే హైర్ బస్సు (ఏపీ39 యూడబ్ల్యూ 0444) బులెట్‌ను ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి ఇద్దరూ కిందపడిపోగా, చల్లా రవికుమార్‌కు కాలు విరిగింది. జడ వెంకట్రావుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని 108 అంబులెన్స్ సహాయంతో క్షతగాత్రులను చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రైతు సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తాం

- మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్
- జిల్లా వైయస్ఆర్‌సీపీ రైతు విభాగం సమావేశం



రైతు సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని వైయస్ఆర్‌సీపీ నేతలు, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం సమావేశం బుధవారం ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సమావేశానికి ముందు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధర్మాన సోదరులు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో సుమారు 62 శాతం మంది వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. రైతును అన్నదాతగా గౌరవిస్తున్నామని చెబుతున్నప్పటికీ, నేడు రైతు నిజంగా సుఖంగా ఉన్నాడా అనే ప్రశ్న ప్రతి ఒక్కరూ వేసుకోవాలని అన్నారు. వ్యవసాయం కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, అది జీవన విధానమని పేర్కొన్నారు.

రైతు గళమే వైఎస్సార్‌సీపీ అజెండా: ధర్మాన రామ్ మనోహర్ నాయుడు

శ్రీకాకుళంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా రైతు విభాగం సమావేశంలో యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో అధిక శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నప్పటికీ రైతులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు.వ్యవసాయం కేవలం జీవనోపాధి మాత్రమే కాకుండా సమాజానికి జీవనాధారమని, రైతుల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. గిట్టుబాటు ధరలు, రైతు హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని, అవసరమైతే ఉద్యమాలకు సిద్ధమని ప్రకటించారు. మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర ప్రకటించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించినా, వినతిపత్రాలు అందజేసినా స్పందించాల్సిన ప్రభుత్వం, బదులుగా సోషల్ మీడియా కార్యకర్తలపై ఆంక్షలు విధిస్తూ అరెస్టులకు పాల్పడుతోందని విమర్శించారు. రైతుల ప్రయోజనాల కోసం వైయస్ఆర్‌సీపీ నిరంతరం పోరాటం చేస్తుందని, రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అన్ని వేదికలను వినియోగిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, పార్టీ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు జెన్నూరి రామారావు, ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, ఎచ్చెర్ల సమన్వయకర్త గొర్లె కిరణ్‌కుమార్, టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, జోనల్-1 రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గొండు రఘురామ్, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు, మండల రైతు విభాగం అధ్యక్షులు, శ్రీకాకుళం నియోజకవర్గంలోని మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంక్షోభం నుంచి సంక్షేమ రాష్ట్రం.. రెండేళ్ల పాలనపై ఎంజీఆర్ ధీమా

- 8 వేల మందితో భారీ విజయోత్సవ ర్యాలీ
- సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి
- ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు భారీ నిధులు
- రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- రూ.1,200 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి



కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గాడిలో పెట్టి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తోందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) అన్నారు. కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాతపట్నంలో నిర్వహించిన విజయోత్సవ సభకు నియోజకవర్గ కేంద్ర కార్యాలయం నుంచి సుమారు 8 వేల మంది నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువతతో భారీ ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉండేదని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాట పట్టించగలిగామని పేర్కొన్నారు. గత రెండేళ్లలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చామని చెప్పారు. 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ', మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 'స్త్రీశక్తి' వంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందన్నారు. విద్యా రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వ పాఠశాలల నాణ్యతను పెంచడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పారదర్శకంగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, తోటపల్లి, వంశధార, మద్దువలస సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటామన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో గత రెండేళ్లలో సుమారు రూ.1,200 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. విజయోత్సవ సభకు స్వచ్ఛందంగా హాజరైన కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు సుమారు 8 వేల మందికి భోజన వసతి కల్పించినట్లు పేర్కొన్నారు. సభ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు

# గ్రిడ్ కనెక్టివిటీ బదిలీకి కొత్త షరతులు



అమరావతి: రాష్ట్రంలో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల అభివృద్ధికి కీలకమైన గ్రిడ్ కనెక్టవిటీ బదిలీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) కొత్త షరతులు తెచ్చింది. ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్(ఏపీ ట్రాన్స్‌కో) విజ్ఞప్తి మేరకు ఏపీఈఆర్‌సీ ఇచి?చన స్పష్టీకరణలు.. పునరుత్పాదక విద్యుత్ రంగంలో సందిగ్ధ పరిస్థితులకు దారితీస్తున్నాయి. గ్రిడ్‌కు విద్యుత్‌ను సరఫరా చేయడానికి కనెక్టివిటీ అత్యంత కీలకం. ఒక సోలార్ లేదా విండ్ ప్రాజెక్టును ట్రాన్స్‌మిషన్ వ్యవస్థతో అనుసంధానం చేసేందుకు మంజూరయ్యే హక్కునే కనెక్టివిటీగా పరిగణిస్తారు.

ఈ హక్కును ఒక ప్రాజెక్టు నుంచి మరో ప్రాజెక్టుకు లేదా ఒక సంస్థ నుంచి మరో సంస్థకు బదిలీ చేయడాన్ని కనెక్టివిటీ బదిలీగా వ్యవహరిస్తారు. అయితే, కనెక్టివిటీ అనేది ప్రాజెక్టు నిర్దిష్ట హక్కు మాత్రమేనని, దాన్ని స్వేచ్ఛగా ఇతరులకు బదిలీ చేయలేముని ఏపీఈఆర్‌సీ తాజాగా స్పష్టం చేసింది. క్లస్టర్ విధానంలో మంజూరైన కనెక్టివిటీ కూడా అదే క్లస్టర్‌లోని ఇతర ప్రాజెక్టులకు ఆటోమేటిక్‌గా వర్తించదని తేల్చిచెప్పింది. కనెక్టివిటీ బదిలీ, విభజన లేదా కేటాయింపునకు సంబంధించిన ప్రతి ప్రతిపాదనను ఏపీ ట్రాన్స్‌కో.. కేసు వారీగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది.

రాష్ట్ర అంతర్గత ప్రసార వ్యవస్థలో కనెక్టివిటీ బదిలీకి ప్రస్తుతం ప్రత్యేక నిబంధనలు లేవు. కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (సీఈఆర్‌సీ) నిబంధనలు నేరుగా వర్తించవని.. వాటి సూత్రాలను మాత్రమే మార్గదర్శకంగా తీసుకోవచ్చని ఏపీఈఆర్‌సీ పేర్కొంది. దీంతో భవిష్యత్‌లో అనుమతుల ప్రక్రియలో స్పష్టత కంటే అధికారుల విచక్షణకు ఎక్కువ ప్రాధాన్యం లభించే పరిస్థితి ఏర్పడవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అలాగే ఇప్పటికే వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించి.. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు లేదా ఓపెన్ యాక్సెస్ కింద పనిచేస్తున్న ప్రాజెక్టులకు కనెక్టివిటీ బదిలీకి అవకాశం కల్పించినప్పటికీ.. అసలు కనెక్టివిటీ పొందిన డెవలపర్ సమ్మతి తప్పనిసరి అని తేల్చిచెప్పింది. దీంతో ప్రాజెక్టుల మధ్య వివాదాలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కనెక్టివిటీ బదిలీపై కఠిన నిబంధనల వల్ల పెట్టుబడిదారుల్లో అనిశ్చితి పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్పష్టమైన విధానాల కంటే కేసు వారీ పరిశీలనకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రాజెక్టుల అమలు ఆలస్యమయ్యే అవకాశముందని వారు చెబుతున్నారు. పునరుత్పాదక విద్యుత్ రంగాన్ని ప్రోత్సహించాలంటే కనెక్టివిటీ బదిలీపై స్పష్టమైన, పారదర్శక విధానాన్ని ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు రూపొందించాలని సూచిస్తున్నారు.

# వర్షం కురిపించని నైరుతి!



**ఢిల్లీ :** నైరుతి రుతుపవనాలు దేశంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నప్పటికీ కనీసం మరో వారం రోజులపాటు విస్తృతమైన వర్షపాతం తక్కువగానే ఉండే అవకాశం ఉంది. జూన్ 23 ప్రాంతంలో పరిస్థితులు మెరుగుపడటం ప్రారంభమయ్యే వరకు వర్షాలు అంతంత మాత్రంగానే ఉంటాయని వాతావరణ నమూనాలు సూచిస్తున్నాయి. భారత్‌లోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో రుతుపవనాల కదలిక సాంకేతికంగా కొనసాగుతున్నప్పటికీ వర్షాలను కురిపించే ఆ వ్యవస్థ అసాధారణంగా బలహీనంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. జూన్ 15 నుంచి జూన్ 21 మధ్య రుతు పవనాల కార్యకలాపాలు పెద్దగా చురుకుగా ఉండకపోవచ్చని అంచనా. దీనివల్ల దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పడిన వర్షపాత లోటు మరింత కొనసాగే అవకాశం ఉంది. రానున్న వారంలో విస్తృతమైన రుతుపవన వర్షాలకు బదులుగా ప్రధానంగా దక్షిణ భారతదేశంలో స్థానిక ఉరుములతో కూడిన వర్షాల ద్వారానే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దు ప్రాంతాలు, అలాగే తూర్పు కనుమల్లో తరచుగా ఉరుములతో కూడిన వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల అక్కడక్కడ మోస్తరు నుండి భారీ వర్షాలు, మెరుపులు, బలమైన గాలులు సంభవించే అవకాశం ఉంది.

**10 రాష్ట్రాలపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం..** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 9-10 రాష్ట్రాలపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని.. ఆ రాష్ట్రాల్లోని జిల్లా అధికారులు, వ్యవసాయ సంస్థలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదేశించారు. వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాల కోసం ముందస్తు అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేయటం, పత్తి, పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచటం, రైతులకు శాస్త్రీయ సలహాలు అందేలా చూడటంపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. ఖరీఫ్ 2026 సన్నాహకాలపై మంగళవారం సమీక్ష సమావేశానికి కేంద్ర మంత్రి చౌహాన్ అధ్యక్షత వహించారు. వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాల్లో ముందస్తు అత్యవసర ప్రణాళికల ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

# ప్రజలకు భరోసా.. అధికారులకు బాధ్యత



- ప్రజల గడపకే ప్రభుత్వం.. సమస్యల పరిష్కారంలో కూటమి స్పీడ్!
- వినతులు కాదు.. వెంటనే పరిష్కారమే మా లక్ష్యం: అచ్చెన్నాయుడు
- ప్రజల కష్టాలకు చెక్.. అధికారులకు ఆన్‌దస్పాట్ ఆదేశాలు
- ఫిర్యాదులు పేరుకుపోయే రోజులు పోయాయి.. పరిష్కారమే కూటమి ప్రభుత్వ విధానం!
- రైతు ఇబ్బంది అంటే ప్రభుత్వం ఊరుకోదు: అచ్చెన్నాయుడు హెచ్చరిక
- అమరావతిలో ప్రజా గ్రీవెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు

**అమరావతి: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి వారికి న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను నేరుగా స్వీకరించారు. వినతిదారుల సమస్యలను ఓపికగా ఆలకించిన మంత్రి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఫోన్‌లోనే ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వ్యవసాయ, పశుసంవర్ధక, అనుబంధ శాఖలకు సంబంధించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రజా వేదికకు వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.**





జూన్ 17, బాపట్ల కాకతీయ: ఉన్నత శిఖరాలు అధిరోహించాలి గత కొన్ని రోజుల క్రితం బాపట్ల కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన ఆర్మీ రవి నీ కాపు సంఘం నాయకులు ఇంటికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాపు సామాజిక వర్గంలో వ్యాపార రంగంలో ఉండి బ్యాంకు సెక్టార్ లో ఈ విధమైన పదవులు అధిరోహించడం ఎంతో అభినందనీయమని మీరు ఇంకా ఎన్నో ఉన్నత పదవులు అధిరోహిం చాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, కొటికలపూడి సురేష్, రంగారావు, తులసీదాస్ సాయి, భీమ కోటేశ్వరరావు, బాబ్జి, గోపాల వెంకటేశ్వరరావు, మారిశెట్టి, రామారావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభావంతుల ఎంపిక

### 180 మంది క్రీడాకారుల ప్రతిభ ప్రదర్శన.. జాతీయ స్థాయి పోటీలకు విజేతల ఎంపిక






**జూన్ 17.... చీరాల..కాకతీయ:** బాపట్ల జిల్లా చీరాల పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వెబ్‌సైట్ కన్వీనర్ పోలూరి కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 180 మంది చెస్ క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా పోలూరి కుమారస్వామి మాట్లాడుతూ, బాపట్ల జిల్లా ఆవిర్భావం తర్వాత నిర్వహించిన తొలి రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ ఇదేనని తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలను 2027 జనవరిలో హర్యానా రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి చెస్ పోటీలకు పంపించనున్నట్లు వెల్లడించారు. బాలబాలికల విభాగంలో ప్రతిభ కనబరిచిన ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికలు జాతీయ స్థాయి పోటీల కోసం ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించి, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో దేశానికి, రాష్ట్రానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. చెస్ వంటి మేధో క్రీడలు విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నిర్ణయాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. చిన్న వయసులోనే చెస్‌పై ఆసక్తి పెంపొందించుకోవడం ద్వారా బాలబాలికలు విద్యా రంగంతో పాటు క్రీడారంగంలోనూ ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.

ఈ విజేతలను ఆదర్శంగా తీసుకుని మరింత మంది విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు రావాలని, గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఇటువంటి ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం, సహకారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐ. బాబురావు, జాతీయ చెస్ క్రీడాకారుడు రామకృష్ణారెడ్డి, గోశాల సుధాకర్, గొట్టిపాటి ఎబినేజర్, బాపట్ల జిల్లా చెస్ అసోసియేషన్ (బీడీసీఏ) కార్యదర్శి అబ్దుల్ నబీ, ఖాకీ మోజెస్‌తో పాటు పలువురు క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు. పోటీల విజేతలను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఆక్వాఫీడ్ ధరలు తగ్గించాల్సిందే..

అమరావతి : ఆక్వాఫీడ్ ధరలు తగ్గించాల్సిందేనని లేదంటే ఆక్వా రైతులతో కలిసి ఉద్యమిస్తామని ఏపీలోని కూటమి ప్రభుత్వానికి మాజీ సీఎం వైఎస్ జగన్ హెచ్చరించారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయంలో జగన్‌తో ఆక్వా రైతులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో ఆక్వా రైతుల కోసం ఎంతో కృషి చేశామన్నారు. కానీ చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. నేడు రైతులు ఏపీలో దర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఆక్వాఫీడ్ ధరల్ని ఈ నెలాఖరులోగా తగ్గించాలని, లేదంటే రైతుల తరపున పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



# నగల వ్యాపారి కోసం బాధితుల ఎదురుచూపులు

### పాత బంగారం, నగదు అప్పగించిన కస్టమర్ల ఆందోళన.. ఫిర్యాదుల స్వీకరణలో పోలీసులు



**జూన్ 17.... చీరాల. కాకతీయ:** బాపట్ల జిల్లా చీరాల పట్టణంలోని సంతబజారులో భావన ఋషి స్వామి ఆలయం సమీపంలో "హర్ష జువెలర్స్ వర్క్స్" పేరుతో నగల వ్యాపారం నిర్వహిస్తున్న బిట్రా రాఘవేంద్రరావుకు సంబంధించిన వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నగల తయారీ, మరమ్మతులు, కొత్త నగల ఆర్డర్ల కోసం బంగారం, నగదు ఇచ్చిన పలువురు కస్టమర్లు ప్రస్తుతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేటపాలెంకు చెందిన బుద్ధి రాజ్యలక్ష్మి సహా పలువురు బాధితులు తమ వద్ద ఉన్న పాత బంగారాన్ని కొత్త నగల తయారీ కోసం అప్పగించగా, మరికొందరు కొత్త బంగారం కొనుగోలు చేసి నగలు తయారు చేయించుకునేందుకు ముందస్తుగా నగదు చెల్లించినట్లు తెలిపారు. అయితే వ్యాపారి గత కొన్ని రోజులుగా అందుబాటులో లేకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం, సంవత్సరాలుగా ఏర్పడిన నమ్మకంతో బంగారం, నగదు అప్పగించామని, ప్రస్తుతం వ్యాపారి అందుబాటులో లేకపోవడంతో తమకు నష్టం జరిగిందనే ఆందోళన వ్యక్తమవుతోందని చెబుతున్నారు. లక్షల రూపాయల విలువైన బంగారం, నగదు ఈ వ్యవహారంలో చిక్కుకున్నట్లు కొందరు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారి దుకాణం, నివాసానికి వెళ్లి ఆరా తీసిన బాధితులు ఇంటికి తాళాలు వేసి ఉండటాన్ని గమనించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మరిన్ని బాధితులు ఒక్కొక్కరుగా ముందుకు వస్తున్నట్లు సమాచారం. కొందరు పరువు ప్రతిష్ఠల కారణంగా, మరికొందరు బిడియంతో ఇప్పటికీ ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే అందుతున్న ఫిర్యాదులను పోలీసులు స్వీకరించి వివరాలు సేకరిస్తున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ కొనసాగుతోందని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

## నీట్ పరీక్ష కోసం టెలిగ్రామ్‌పై వేటు.. రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు



నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్‌ను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పరీక్షల్లో అక్రమాలను, చీటింగ్ నెట్ వర్క్‌లను నిరోధించే చర్యల్లో భాగంగా ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై దేశవ్యాప్తంగా తాత్కాలిక ఆంక్షలు విధించింది. జూన్ 21న పరీక్ష జరగనున్న నేపథ్యంలో, జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ల నుంచి టెలిగ్రామ్‌ను తొలగించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. “దొంగను పట్టుకోవడం చేతకాక, బాధితుడి ఇంటికి తాళం వేసినట్లుంది” అంటూ ‘ఎక్స్’ వేదికగా విమర్శలు గుప్పించారు. పేపర్ లీకేజీలను అరికట్టేందుకు మోదీ ప్రభుత్వం ఇదొక కొత్త ఉపాయాన్ని కనిపెట్టిందని ఆయన ఎద్దేవా చేశారు. అసలైన పేపర్ లీక్ మాఫియాను విడిచిపెట్టి, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అభిప్రాయపడ్డారు.

## తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న.. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ





**కాకతీయ వినుకొండ** పట్టణంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు అధ్యక్షతన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేసే లక్ష్యంతో రాబోయే నెల రోజుల కార్యాచరణపై సమగ్రంగా వివరించారు. గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ శ్రేణులు ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజల్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు స్థానిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, నిస్సంకర శ్రీనివాసరావు , వివిధ మండలాలు, నియోజకవర్గ స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## అగ్నిప్రమాద బాధితులకు సాయం అందించిన... ప్రభుత్వ చీఫ్ విప్ జీవి



**కాకతీయ బొల్లాపల్లి** గ్రామంలో ప్రమాదవశాత్తు రెండు ఇళ్లు అగ్నిప్రమాదానికి గురై సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన పాలపర్తి వెంకటేశ్వర్లు, పోలా శీను కుటుంబాల పరిస్థితిని తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు తక్షణమే స్పందించారు.బాధిత కుటుంబాలను శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ద్వారా నిత్యవసర సరుకులు, వంట సామాన్లు, దుప్పట్లతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే జీవీ కి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ మేనేజర్ ఫణి కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అనితకు అమర్నాథ్ క్షమాపణ చెప్పాలన్న..తెలుగు మహిళ నాయకురాలు



**కాకతీయ వినుకొండ** రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను ఉద్దేశించి వైసీపీ నాయకుడు,మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను వినుకొండ తెలుగు మహిళ నాయకురాలు బుధవారం తీవ్రంగా ఖండించారు. మహిళల పట్ల గౌరవం లేకుండా విమర్శించడం సరికాదన్నారు. మహిళలపై వ్యక్తిగత విమర్శలకు దిగటం వైసీపీ నాయకుల సంస్కృతికి నిదర్శనం అన్నారు. మహిళలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తుంటే వైసీపీ మాజీ మంత్రి అమర్నాథ్ మహిళలను కించపరిచే ఇలాంటి వ్యాఖ్యలు చేయటం దారుణమన్నారు. హోం మంత్రి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర్నాథ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షకీలా, ఆదిలక్ష్మి, షబీనా, తుమ్మ వెంకట కోటమ్మ పాల్గొన్నారు.

## శర్మ స్కూల్ లో యోగాపై ప్రత్యేక అవగాహన శిక్షణ తరగతులు..



**కాకతీయ వినుకొండ** పట్టణంలోనీ వెల్లటూరు రోడ్డులోని శర్మ పాఠశాల నందు విద్యార్థులకు యోగాపై ప్రత్యేక అవగాహన మరియు శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. యోగ తరపున నాగవరపు కోటేశ్వరరావు సహకారం తో విద్యార్థుల కు వారం పాటు యోగ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న పురపాలక సంఘ శానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచే యోగా యొక్క ప్రాముఖ్యతను తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ నిత్యజీవితంలో ఒక భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వివరించారు. నిత్యం యోగా సాధన చేయడం వల్ల నేటి కాలంలో విద్యార్థులను వేధిస్తున్న మానసిక ఒత్తిడి దూరమవుతుందని, వారిలో అంతర్గత శక్తి పెంపొంది ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. తద్వారా రేపటి రోజున ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ తోడ్పడిన వారవుతారని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా, వారిలోని ఇతర నైపుణ్యాలను (స్కిల్స్) పెంపొందించేందుకు వివిధ రకాల వినూత్న కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహించాలని ఆయన సూచించారు. అందులో భాగంగానే పాఠశాల స్థాయి నుంచే యోగాతో పాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, శారీరక పరిశుభ్రత మరియు సామాజిక బాధ్యత వంటి అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించి, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో పాఠశాల యాజమాన్యాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కూటమి ప్రభుత్వమే పొగాకు రైతులను తక్షణమే ఆదుకోవాలి.

## సీఎం చంద్రబాబుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య లేఖ



**అమరావతి జూన్ 17కాకతీయ.** ఆంధ్రప్రదేశ్‌లో కుప్పకూలుతున్న పొగాకు ధరలు, కొనుగోలు కంపెనీల సిండికేట్ రాజకీయం, పొగాకు బోర్డు అలసత్వం వల్ల తీవ్రంగా నష్టపోతున్న రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బుధవారం ఒక బహిరంగ లేఖ రాశారు. అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉన్న మన వర్జీనియా పొగాకు రైతులకు ప్రస్తుత 2025-26 సీజన్‌లో పెట్టుబడి ఖర్చులు కూడా లభించడం లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనత వల్ల రైతులు వేల కోట్ల రూపాయల నష్టాలను చవిచూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిసి , జిపిఐ, మహాలక్ష్మి వంటి దిగ్గజ కంపెనీలు గుత్తాధిపత్యంతో సిండికేట్‌గా మారి ఇష్టారాజ్యంగా ధరలను తగ్గించేస్తున్నాయని మండిపడ్డారు.

ప్రస్తుతం మార్కెట్‌లో ధరల కోత విపరీతంగా ఉందని, ఏలూరు జిల్లా ప్రాంతాల్లో నాణ్యమైన మొదటి గ్రేడ్ పొగాకును కిలో రూ. 265, లో-గ్రేడ్ పొగాకును రూ. 205 కే కొంటుండగా, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో మొదటి గ్రేడ్ కిలో రూ. 250, లో-గ్రేడ్ రూ. 190 లకే కొంటూ రైతులను వంచిస్తున్నారని ఈశ్వరయ్య పేర్కొన్నారు.

సాగు అనుమతించిన పరిమాణం కంటే 87 మిలియన్ల కిలోల ఉత్పత్తి పెరిగిందనే సాకుతో కంపెనీలు ధరలు తగ్గిస్తున్నాయని, నిజానికి నిబంధనల ప్రకారం మరో 15 శాతం అదనంగా కొనుగోలు చేసే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. వేలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా, కేవలం 10 శాతం లోపే కొనుగోలు చేశారని తెలిపారు. సిగరెట్ల వాడకం, కంపెనీల లాభాలు తగ్గకపోయినా... జీఎస్టీ పెరిగిందని, పశ్చిమాసియా యుద్ధాల వల్ల ఎగుమతులు తగ్గాయని బూటకపు సాకులు చెబుతూ కంపెనీలు ధరలపై కోత విధిస్తున్నాయని మండిపడ్డారు.

రాష్ట్రంలో పొగాకు పండించే వారిలో 90 శాతం మంది చిన్న, సన్నకారు, కౌలు రైతులే ఉన్నారని, విపరీతంగా పెరిగిన సాగు వ్యయం వారిని కోలుకోకుండా చేస్తోందని లేఖలో వివరించారు. ఏలూరు ఏరియాలో కిలో ఉత్పత్తి ఖర్చు రూ. 360 అవుతుండగా, రూ. 450 ఇస్తేనే గిట్టుబాటు అవుతుందని, అక్కడ ఎకరానికి కౌలు రూ. 50 వేల నుండి లక్ష వరకు ఉండటంతో 4 ఎకరాల ఒక బ్యారన్ ఖర్చు రూ. 14 లక్షలకు పైగా అవుతోందని పేర్కొన్నారు. అలాగే ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో కిలో ఉత్పత్తి ఖర్చు రూ. 300 దాటుతుండగా, కనీసం రూ. 350 ధర రావాలని, ఇక్కడ ఎకరానికి పెట్టుబడి, బ్యారన్ అద్దెలు కలిసి ఏడు ఎకరాల ఒక బ్యారన్ ఖర్చు రూ. 12.50 లక్షలవుతోందని గణాంకాలతో వివరించారు. మరోవైపు అధికారులు, కంపెనీలు చేతులు కలిపి వేలం కేంద్రాలలో నాణ్యమైన పొగాకును కూడా తిరస్కరిస్తూ రైతులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలు, టంగుటూరు, కొండేపి, వెల్లంపల్లి కేంద్రాల్లో ఏకంగా 47 శాతం బేలు, పొదిలి, కనిగిరి, కందుకూరు, కలికిరి, డీసీపల్లి కేంద్రాల్లో 40 శాతం బేలు తిరస్కరణకు గురవుతున్నాయన్నారు. ఏలూరు ఏరియా పరిధిలోని దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, కోయిలగూడెం, గోపాలపురంలో 43 శాతం బేళ్ళను నాణ్యత లేదంటూ పక్కన పెడుతున్నారని, ఇలా తిరస్కరించిన బేళ్ళను వెనక్కి తీసుకెళ్లడానికి రైతులకు అదనంగా బేలుకు రూ. 2,000 వరకు అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**కూటమి నిర్లక్ష్యం వల్ల అప్పులపాలైన రైతులు.**

గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, గత ఏడాది నల్లబర్లీ పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను గుర్తు చేశారు. 2023-24లో తక్కువ ధరకు అమ్ముకోవడం వల్ల రూ. 1,190 కోట్ల నష్టం రాగా, ప్రస్తుత 2025-26 సీజన్ ధరల పతనం మరియు పెట్టుబడి భారం వల్ల మరో రూ. 1,901 కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. మొత్తంగా రెండేళ్లలో పొగాకు రైతాంగం రూ. 3,100 కోట్లు నష్టపోతోందని నిపుణుల అంచనాలను ప్రస్తావించారు. ఇంత జరుగుతున్నా కేంద్ర పొగాకు బోర్డు రూ. 500 కోట్లు కేటాయించి కొనుగోలు చేయలేని అసహాయ స్థితిలో ఉండి కేవలం హామీలకే పరిమితమైందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా కేవలం కేంద్రానికి లేఖ రాసి చేతులు దులుపుకోవడం బాధాకరమన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కేవలం లేఖలతో కాలయాపన చేయకుండా, తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కనీసం రూ. 500 కోట్లతో “ధరల స్థిరీకరణ నిధి”ని ఏర్పాటు చేయాలని సిపిఐ తరపున గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ నిధి ద్వారా ప్రభుత్వ ఏజెన్సీలు నేరుగా వేలం కేంద్రాల్లో రంగంలోకి దిగి పొగాకును కొనుగోలు చేయాలని, దీనివల్ల మార్కెట్‌లో పోటీ పెరిగి కంపెనీల గుత్తాధిపత్యానికి అడ్డుకట్ట పడుతుందన్నారు. అలాగే ఏలూరు జిల్లా ఏరియా పొగాకుకు కిలోకు రూ. 450, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల పొగాకుకు కనీసం రూ. 350 గిట్టుబాటు ధర దక్కేలా కంపెనీలపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. వేలం కేంద్రాలలో అధికారులు, కంపెనీల సిండికేట్ వ్యవహారాలను అరికట్టి, నాణ్యమైన పొగాకు బేళ్ళ తిరస్కరణను తక్షణమే నిలిపివేయాలన్నారు. ఒకవైపు వాణిజ్య పంటలు వేయాలని హితబోధ చేస్తూ, మరోవైపు రేయింబవళ్లు కష్టపడి పంట పండించిన రైతులను ప్రైవేట్ కంపెనీల దోపిడీకి వదిలేయడం అత్యంత దుర్మార్గమని, పాలకులు తక్షణమే స్పందించి ఆంధ్రప్రదేశ్ పొగాకు రైతాంగాన్ని అప్పుల ఊబి నుండి, ఆత్మహత్యల ముప్పు నుండి కాపాడాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

# ఈ సీజన్‌లోనూ వ్యాప్తి చెందుతున్న డెంగ్యూ..



వర్షాకాలంలోనే ఎక్కువగా కనిపించే డెంగ్యూ ఇప్పుడు వేసవికాలంలోనూ నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా డెంగ్యూ అంటే వర్షాలు, నిల్వ నీరు గుర్తుకు వస్తాయి. అయితే మారుతున్న వాతావరణ పరిస్థితులు, తీవ్ర ఉష్ణోగ్రతలు, ఆకస్మిక వర్షాలు, పెరుగుతున్న తేమ కారణంగా డెంగ్యూ వ్యాప్తి కాలం విస్తరిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో వేసవిలో వచ్చే జ్వరం, శరీర నొప్పులను నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇటీవలి సంవత్సరాల్లో వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఎండలు తీవ్రరూపం దాల్చిన తర్వాత అకస్మాత్తుగా వర్షాలు కురవడం, ఆ తర్వాత తేమ పెరగడం వంటి పరిస్థితులు దోమల పెరుగుదలకు అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో చిన్నచిన్న నీటి నిల్వలు డెంగ్యూ వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఫలితంగా గతంలో తక్కువ ప్రమాద ప్రాంతాలుగా భావించిన ప్రాంతాల్లో కూడా డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి.

**ప్లేట్‌లెట్లు మాత్రమే కాదు..** డెంగ్యూ నిర్ధారణ అయినప్పుడు చాలా మంది ముందుగా ప్లేట్‌లెట్‌ల సంఖ్య తగ్గడంపైనే దృష్టి పెడతారు. అయితే వ్యాధి తీవ్రతను నిర్ణయించేది కేవలం ప్లేట్‌లెట్‌ల స్థాయే కాదు. రక్తనాళాల నుంచి ద్రవం లీక్ అవడం, అంతర్గత రక్తస్రావం, అవయవాల పనితీరు దెబ్బతినడం వంటి సమస్యలను తీవ్రమైన డెంగ్యూకు సంకేతాలుగా పరిగణిస్తారు. డెంగ్యూ ప్రమాదకరంగా మారే ముందు కొన్ని హెచ్చరిక సంకేతాలు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం తగ్గుతున్న సమయంలో ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. తీవ్రమైన కడుపు నొప్పి అలాంటి ముఖ్యమైన సంకేతాల్లో ఒకటి. సాధారణ అసౌకర్యం డెంగ్యూలో కనిపించినప్పటికీ, నిరంతరంగా పెరుగుతున్న కడుపు నొప్పి లేదా నీరు, ఆహారం తీసుకోలేని పరిస్థితి ఏర్పడితే అది తీవ్రమైన డెంగ్యూకు సూచనగా భావించాలి. రక్తనాళాల నుంచి ద్రవం బయటకు రావడం వల్ల పొత్తికడుపులో ద్రవం చేరి ఈ సమస్యలు తలెత్తుతాయి.

**చిగుళ్లు, ముక్కు నుంచి రక్తస్రావం..** చిగుళ్ల నుంచి, ముక్కు నుంచి రక్తస్రావం కావడం లేదా మూత్రం, మలంలో రక్తం కనిపించడం కూడా ప్రమాద సంకేతాలే. శరీరంలో రక్తం గడ్డకట్టే ప్రక్రియ దెబ్బతినడం, రక్తనాళాలు బలహీనపడటం వల్ల అంతర్గత రక్తస్రావం సంభవించే అవకాశం ఉంటుంది. చర్మం కింద గాయాల మాదిరిగా నల్లని మచ్చలు కనిపించినా జాగ్రత్త అవసరం. శ్వాస వేగంగా తీసుకోవడం లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటం కూడా తీవ్రమైన పరిస్థితికి సంకేతం అవుతాయి. రక్తనాళాల నుంచి లీక్ అయిన ద్రవం ఊపిరితిత్తుల్లో చేరితే శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి. డెంగ్యూ బాధితుడికి శ్వాసలో ఇబ్బంది కనిపిస్తే అత్యవసర వైద్యసహాయం అవసరం. తరచూ వాంతులు కావడం, విరేచనాలు అవడం కూడా నిర్లక్ష్యం చేయకూడని లక్షణాలు. రోజులో మూడు లేదా అంతకంటే ఎక్కువసార్లు వాంతులు అవుతు న్నట్లయితే శరీరం ఇన్‌ఫెక్షన్‌ను తట్టుకోలేకపోతోందనే సంకేతంగా భావించాలి. వెంటనే వైద్య సలహా తీసుకోవడం మంచిది.

**అకస్మాత్తుగా ఇలా జరిగితే..** కొంతమంది రోగుల్లో జ్వరం తగ్గిన తర్వాత ఆరోగ్యం మెరుగుపడినట్లు అనిపించినా అకస్మాత్తుగా తీవ్రమైన బలహీనత, అలసట, ఆందోళన లేదా చిరాకు కనిపిస్తాయి. ఇది నిజమైన కోలుకోవడం కాదు. ఇలాంటి పరిస్థితిని డెంగ్యూ తీవ్ర దశకు చేరుతున్న సంకేతంగా పరిగణించాలి. వేసవిలో జ్వరం వస్తే సాధారణ వైరల్ ఫీవర్‌గా భావించి నిర్లక్ష్యం చేయకుండా, పై హెచ్చరిక లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చు.

# డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే సిరప్ విక్రయాలు



ఢిల్లీ : దగ్గు మందులతోసహా సిరప్ ఆధారిత మందుల ఓవర్-ది-కౌంటర్(వైద్యుని ప్రిస్క్రిప్షన్‌ను లేకుండా నేరుగా కొనుగోలు చేసే) అమ్మకాలను నిలిపివేయడానికి కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం ఔషధ నియంత్రణ నిబంధనలను సవరించింది. వీటి కొనుగోలుకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. జూన్ 9న ఆరోగ్య మంత్రిత్వశాఖ నోటిఫై చేసిన డ్రగ్స్ రూల్స్, 1945 సవరణ ద్వారా అమల్లోకి తెచ్చిన డ్రగ్స్(ఐదవ సవరణ) నిబంధనలు 2026 కింద ఈ మార్పు జరిగింది. డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ చట్టం, 1940 నిబంధనల నుంచి మినహాయింపు పొందిన ఔషధాల క్యాటగిరీల్లో పేర్కొన్న షెడ్యూల్ కే నుంచి సిరప్‌లు అనే పదాన్ని సవరించిన నిబంధనల కింద తొలగించారు.

దీని ఫలితంగా సిరప్ తయారీ ఇక మినహాయింపులకు నోచుకోదు. ఔషధ నియంత్రణ నిబంధనలకు లోబడి ఉండాల్సి ఉంటుంది. గతంలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నేరుగా మెడికల్ దుకాణాల్లో వినియోగదారులకు అందు బాటులో ఉన్న దగ్గు మందు సహా ఇతర సిరప్‌లు ఇక లభిం చవు. వాటి కొనుగోలుకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఇక తప్పనిసరి. ఔషధ నియంత్రణకు సంబంధించి దేశంలో అత్యున్నత సాంకేతిక సంస్థ డ్రగ్స్ టెక్నికల్ సలహా బోర్డుతో సంప్రదించిన తర్వాతే ఈ సవరణ చేసినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది.

## తెలంగాణలో ఆగని వడగాల్పులు..

## జూన్ 20 తర్వాతే రుతుపవనాల విస్తరణ

తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ, ఎండల తీవ్రత నుంచి ప్రజలకు ఇప్పుడిప్పుడే ఉపశమనం లభించే సూచనలు కనిపించడం లేదు. జూన్ 20వ తేదీ వరకు రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో పొడి వాతావరణమే నెలకొంటుందని, రానున్న మూడు రోజుల పాటు ఉత్తర, తూర్పు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా నివేదికల ఆధారంగా ఈ హెచ్చరికలు జారీ అయ్యాయి. బుధవారం ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు నమోదయ్యాయి. ఈ క్రమంలో జూన్ 17, 18, 19 తేదీల్లో ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. గడిచిన 24 గంటల్లో సూర్యాపేట జిల్లా మోతేలో అత్యధికంగా 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఖమ్మం జిల్లా ఏడుపాలెంలో 43.5 డిగ్రీలు, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటు హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు హైదరాబాద్, భద్రాచలం మీదుగా ప్రయాణిస్తున్నాయి.

## కారంపూడిలో అనుమతులు లేని.. వెంచర్లు...

### చోద్యం చూస్తున్న అధికారులు

**ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరికి వారే వెంచర్లు వేస్తున్న వైనం**



**(కారంపూడి కాకతీయ న్యూస్ :- 17):** కారంపూడి మండలంలో అనుమతి లేని వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి అమాయ కులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. వాటిని కొనుగోలు చేసిన ప్రజలు అనుమతులు లేకుండా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.వాటిని కొనుగోలు చేసిన ప్రజలు రిజిస్ట్రేషన్, ఇంటి నిర్మాణ అనుమతులు, బ్యాంకు లోన్ పొందే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ భూములను ప్లాట్లుగా విక్రయించాలంటే నాలా కన్వర్షన్ ద్వారా ఆర్డీవో నుంచి ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది. వెంచర్‌లో పది శాతం స్థానిక సంస్థలకు రిజిస్ట్రేషన్ చేయాలి. వెంచర్‌కు అప్రోచ్ రోడ్లు 60 ఫీట్లు, లోపల 40 ఫీట్ల రోడ్లు, 33 ఫీట్ల వెడల్పు రోడ్లు ఏర్పాటు చేయాలి. పాఠశాల, పార్కు, గుడి, కమ్యూనిటీ హాలు, హెల్త్ సెంటర్, ఓవర్ హెడ్ ట్యాంకు అవసరాలకు స్థలం కేటాయించాలి. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్‌లైన్‌లు వంటి అభివృద్ధి పనులు, రియల్‌ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ అనుమతి పొందాల్సి ఉంటుంది. ఇవేవీ లేకుండానే ఇరుకు రోడ్లతో వెంచర్లు వెలుస్తున్నాయి. ఏజెంట్లు ప్రభుత్వానికి ఫీజులు, అనుమతుల రూపంలో వచ్చే ఆదాయానికి గండి కొడుతూ నిబంధనలు పాటించకుండా ప్లాట్లను విక్రయించి చేతులు దులుపుకుంటున్నారు. వాటిని కొనుగోలు చేసిన ప్రజలు క్రమబద్దీకరణ, ఇంటి నిర్మాణానికి అనుమతులకు ఫీజులు, పెనాల్టీలు చెల్లించాల్సి వస్తుంది. అనంతరం నష్టపోయిన తర్వాత ప్రజలు ఆలోచిస్తే లాభం లేదు..

## ఉచిత నేత్ర వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన







**(కారంపూడి కాకతీయ న్యూస్ :- 17):** శ్రీ సిమెంట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత లో భాగంగా శ్రీ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా విజయవాడ, శ్రీ ఐ కేర్ హాస్పిటల్ బాగస్వామ్యంతో ఇనుపరాజుపల్లి (16-06-2026), కాచవరం (17-06-2026) గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ప్రజల కంటి ఆరోగ్య పరిరక్షణ మరియు నేత్ర వ్యాధుల నివారణ లక్ష్యంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో ఇనుపరాజుపల్లి, కాచవరం లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ కంటి ఆరోగ్యాన్ని పరీక్షించుకున్నారు. శిబిరంలో అనుభవజ్ఞులైన నేత్ర వైద్యులు మరియు వైద్య సిబ్బంది ఆధునిక పరికరాల సహాయంతో కంటి పరీక్షలు నిర్వహించారు. ఇనుపరాజుపల్లి లో 145 మంది లబ్ధిదారులకు , కాచవరం లో 150 మంది లబ్ధిదారులకు ఉచితంగా కంటి చూపు పరీక్షలు, క్యాటరాక్ట్, గ్లాకోమా, మధుమేహం వల్ల కలిగే రెటీనా సమస్యలు తదితర నేత్ర వ్యాధులకు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు శ్రీ ఐ కేర్ కంటి వైద్య నిపుణులు డా.రవిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి వైద్య సలహాలు, మందుల వినియోగంపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా శ్రీ సిమెంట్ లిమిటెడ్ జీఎం-హెచ్ఆర్ శ్రీ కె. శ్రీనివాసరావు గారు మాట్లాడుతు “కంటి చూపు మన జీవితంలో అత్యంత విలువైన సంపద. ప్రారంభ దశలోనే నేత్ర సమస్యలను గుర్తించడం ద్వారా అనేక సమస్యలను నివారించవచ్చు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో ఇటువంటి వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నాము” అని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తున్న శ్రీ సిమెంట్ లిమిటెడ్, భవిష్యత్తులో కూడా మరిన్ని ఉచిత ఆరోగ్య మరియు నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు మరియు గ్రామ పెద్దలు పాల్గొని శిబిరం విజయవంతం కావడంలో సహకరించారు

## కాటూరి వైద్యకళాశాల చేస్తున్న కృషి వెలకట్టలేనిది : మాజీమంత్రి ప్రత్తిపాటి.



**చిలకలూరిపేట జూన్ 17 కాకతీయ:** ప్రజల ఆరోగ్యరక్షణ కోసం కాటూరి వైద్య కళాశాల పనిచేస్తోందని, వైద్యసిబ్బంది నేరుగా మొబైల్ ల్యాబ్ ద్వారా తమ ఇళ్లవద్దకు వచ్చి అందిస్తున్న వైద్యసేవల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. నాదెండ్ల మండలం తుబాడు గ్రామంలో కాటూరి వైద్య కళాశాల వారు ఎమ్మెల్యే ప్రత్తిపాటి సహాయసహాకారంతో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపుని మాజీమంత్రి ప్రత్తిపాటి ప్రారంభించారు. తమ అనారోగ్య సమస్యలకోసం, ఎక్కడికో వెళ్లి ఇబ్బందులు పడే అవసరం లేకుండా, గ్రామాల్లో ఇళ్లవద్దనే లభించే వైద్యసేవల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు.

## వెంకీ-కళ్యాణ్ రామ్ కాంబో మూవీ.. ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్ చేసిన అనిల్ రావిపూడి




విక్టరీ వెంకటేష్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ సంక్రాంతి ఎంటర్‌టైనర్ ఎప్పుడెప్పుడు పట్టాలెక్కుతుందా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాలో నందమూరి కళ్యాణ్ రామ్ మరో హీరోగా నటిస్తుండటంతో వెంకీ-కళ్యాణ్ రామ్ కాంబినేషన్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి కథతో రాబోతున్నారా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, ఈ ప్రెస్టీజియస్ సినిమాను అధికారికంగా పట్టాలెక్కించేందుకు రంగం సిద్ధమైంది. ఈ క్రేజీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్ యొక్క గ్రాండ్ పూజా కార్యక్రమం రేపు(జూన్ 18న) ఉదయం 9 గంటల నుండి ఘనంగా జరగనుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా అధికారిక ప్రకటన చేశారు. వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబోలో గతంలో వచ్చిన 'ఎఫ్2', 'ఎఫ్3', 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలు బాక్సాఫీస్ వద్ద నవ్వుల పండగను సృష్టించగా.. ఇప్పుడు కళ్యాణ్ రామ్ కూడా తోడవడంతో ఈ సంక్రాంతి ఎంటర్‌టైనర్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండబోతోందని స్పష్టమవుతోంది.




## ప్రాణాపాయ స్థితిలోనూ ఆ చిన్నారి ధైర్యం ఎంతో గొప్పది: అభిమానిని కలిసి చలించిపోయిన పవన్

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక చిన్నారి వీడియో పవన్ కళ్యాణ్ హృదయాన్ని కదిలించింది. అరుదైన వ్యాధితో పోరాడుతూనే, తన అభిమాన నాయకుడిని ఒక్కసారైనా చూడాలని ఆశపడ్డాడు వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్. ఆ చిన్నారి కోరికను మన్నించిన పవన్.. ఏకంగా అతని ఇంటికే వెళ్లి సర్ప్రైజ్ చేశారు. ప్రస్తుతం ఈ కలయికకు సంబంధించిన ఎమోషనల్ దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. మంచంపై ఉన్న ఆ చిన్నారి చేయి పట్టుకుని పవన్ ఆప్యాయంగా పలకరించిన తీరు చూస్తుంటే ఎవరికైనా కంటతడి రాక మానదు. తన పర్యటన గురించి పవన్ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ షేర్ చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నా నిరంజన్ చూపిస్తున్న అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం తనను ఎంతగానో స్ఫూర్తినిచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఇంతటి కష్టకాలంలోనూ ఆ చిన్నారి ముఖంలో చిరునవ్వు చెదరలేదని, అతని మనోధైర్యం ప్రశంసనీయమని కొనియాడారు. నిరంజన్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ కలియుగ



ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామితో పాటు, భద్రకాళి అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. "ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాల కంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో చూడాలని కోరుకుంటున్నాను" అంటూ పవన్ రాసుకొచ్చారు. ఇదే సమయంలో తన హనుమకొండ పర్యటనకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సహకరించిన తెలంగాణ ప్రభుత్వానికి పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పోలీసు ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి కానిస్టేబుల్ వరకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు చెప్పారు. తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలను జీవితాంతం గుండెల్లో దాచుకుంటానని పవన్ ఉద్వేగానికి లోనయ్యారు. ఒక స్టార్ హీరో, తన అభిమాని కోసం ఇంతలా పరితపించడం అభిమానులనే కాదు, సామాన్యులను సైతం ఆకట్టుకుంటోంది.

## విజయ్ దేవరకొండ రేర్ ఫీట్.. ఒకరు కాదు ఇద్దరు..!




రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నాడు. ఆయన కెరీర్‌లో ఒక రేర్ ఫీట్ సాధించి ప్రస్తుతం టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారాడు. ఒకరు కాదు ఇద్దరు గ్లోబల్ స్టార్స్‌తో నటించే అరుదైన రికార్డు విజయ్ దేవరకొండ దక్కించుకున్నాడు. గతంలో 'లైగర్' చిత్రంలో బాక్సింగ్ లెజెండ్ మైక్ టైసన్‌ను ఇండియన్ సినిమాకు పరిచయం చేస్తూ, ఆయనతో కలిసి నటించే ఛాన్స్ దక్కించుకున్నాడు విజయ్. ఇక ఇప్పుడు ఆయన నటిస్తున్న 'రణబాలి' చిత్రంలో మరో ఇంటర్నేషనల్ స్టార్ ఆర్నాల్డ్ వోస్లూతో కలిసి నటించే అరుదైన అవకాశం దక్కించుకున్నాడు. 'ది మమ్మీ' సినిమాతో గ్లోబల్ స్థాయిలో మెప్పించిన ఆర్నాల్డ్ వోస్లూని ఇప్పుడు రణబాలి చిత్రంతో ఇండియన్ సినిమాకు పరిచయం చేస్తున్నాడు. ఇలా ఒకరు కాదు.. ఏకంగా ఇద్దరు గ్లోబల్ స్టార్స్‌తో నటించే అవకాశం దక్కించుకున్న హీరోగా విజయ్ సరికొత్త రికార్డ్ క్రియేట్ చేశాడు. ఇక రణబాలి సినిమాను దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ డైరెక్ట్ చేస్తుండగా రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తోంది.

## పెద్ది : కొత్త సీన్స్ పై అభిమానుల్లో అయోమయం..!



రామ్ చరణ్ బ్లాక్‌బస్టర్ హిట్ 'పెద్ది' ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా వసూలు చేసి థియేటర్లలో విజయవంతంగా నడుస్తోంది. అయితే, బుధవారం (ఈరోజు) నుండి సినిమాకు కొన్ని కొత్త సీన్లు జోడిస్తున్నట్లు ఇటీవల ఒక ఈవెంట్‌లో దర్శకుడు బుచ్చిబాబు సానా ప్రకటించారు. ఈ అదనపు ఫుటేజ్‌ను థియేటర్లలో చూసేందుకు అభిమానులు ఎంతో ఉత్సాహం చూపిస్తున్నారు. కానీ, డైరెక్టర్ ప్రకటన చేసినప్పటికీ నిర్మాణ సంస్థ (వృద్ధి సినిమాస్) నుండి ఎలాంటి అధికారిక సోషల్ మీడియా పోస్ట్ రాలేదు. దీంతో ఆ సీన్లు నిజంగానే యాడ్ అయ్యాయా లేదా వాయిదా పడ్డాయా అనే విషయంలో అభిమానుల్లో అయోమయం నెలకొంది. ప్రస్తుతానికి ఈరోజు మార్నింగ్ షోలు చూసిన ప్రేక్షకుల టాక్ లేదా మేకర్స్ ఇచ్చే అప్‌డేట్ కోసమే అందరూ ఎదురుచూస్తున్నారు.

## సమంత మునుపటి కన్నా ఇప్పుడు హ్యాపీగా ఉందా?



స్టార్ హీరోయిన్ సమంత మరోసారి తన యాక్టివ్ నెస్ తో అభిమానుల దృష్టి ఆకర్షిస్తున్నారు. కొంతకాలంగా ఆరోగ్య సమస్యల కారణంగా సినిమాలకు, పబ్లిక్ ఈవెంట్స్ కు దూరంగా కనిపించిన ఆమె.. ఇప్పుడు మాత్రం పూర్తి జోష్ తో ప్రేక్షకుల ముందుకు వస్తుండటం హాట్ టాపిక్ గా మారింది. ఆమె నటించిన లేటెస్ట్ మూవీ మా ఇంటి బంగారం ప్రమోషన్లలో చూపిస్తున్న యాక్టివ్ నెస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి సమంత ఆ ప్రాజెక్ట్ కు సంబంధించిన ప్రతి ప్రమోషనల్ ఈవెంట్ లో చురుగ్గా పాల్గొంటున్నారు. రీసెంట్ గా ప్రమోషన్లలో భాగంగా ఒక్క రోజులో దాదాపు 40 నుంచి 50 ఇంటర్వ్యూలు ఇవ్వడం ఆమె కమిట్మెంట్ కు బెస్ట్ ఎగ్జాంపుల్ గా చెప్పాలి. ప్రతి ఇంటర్వ్యూలోనూ చాలా సరదాగా మాట్లాడటం, సినిమా విషయాలను అభిమానులతో పంచుకోవడం గమనార్హం. కొన్ని నెలల క్రితం సమంత మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ డిసీజ్ తో ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆమె ఆరోగ్యంపై అభిమానుల్లో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. చికిత్స కోసం సినిమాలకు బ్రేక్ ఇచ్చిన సమంత, విదేశాల్లో కూడా ట్రీట్మెంట్ తీసుకున్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ పరిస్థితుల కారణంగా ఆమె పబ్లిక్ ఈవెంట్లలో చాలా అరుదుగా కనిపించేవారు. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారినట్లు కనిపిస్తోంది. మా ఇంటి బంగారం ప్రమోషన్లలో ఆమె చూపిస్తున్న ఎనర్జీ, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ అభిమానులకు కొత్త హోప్స్ కలిగిస్తోంది. దీంతో కెరీర్ పరంగా సమంత సెకండ్ ఇన్నింగ్స్ ను మంచి జోష్ తో స్టార్ట్ చేశారని సినీ ప్రియులు చెబుతున్నారు. అదే సమయంలో ఆమె భర్త రాజ్ నిడిమోరు సపోర్ట్ కోసం కూడా మాట్లాడుకుంటున్నారు. మా ఇంటి బంగారం మూవీకి ఆయన రైటర్ గా, కో ప్రొడ్యూసర్ గా వర్క్ చేస్తున్నారు. ఇప్పుడు ప్రమోషన్స్ లో కూడా చురుగ్గా పాల్గొంటున్నారు. ఇంటర్వ్యూల్లో తోడుగా ఉంటూ.. సినిమా విషయాలను కూడా పంచుకుంటున్నారు.

## శర్వా సినిమాలో ప్రీతి ముకుందన్.. జోడీ అదిరిపోవాల్సిందే..!



ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ ప్రస్తుతం సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'భోగి' చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ సినిమాను ఆగస్టు 28న థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. 'భోగి' షూటింగ్ పూర్తి కాగానే, శర్వానంద్ డైరెక్టర్ శ్రీను వైట్ల దర్శకత్వంలో ఒక అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను పట్టాలెక్కించనున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకోగా, ఈ ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌కు 'జార్జ్ క్రిష్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో శర్వానంద్ సరసన నటించేందుకు యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్‌ను హీరోయిన్‌గా సెలెక్ట్ చేసినట్లు తెలుస్తోంది. గతంలో మంచు విష్ణు హీరోగా నటించిన 'కన్నప్ప' చిత్రంతో తెలుగు ఇండస్ట్రీలోకి ప్రీతి అడుగుపెట్టింది. రీసెంట్‌గా 'బ్లాస్ట్' చిత్రంతో బాక్సాఫీస్ దగ్గర సందడి చేసిన ఈ బ్యూటీ ఇప్పుడు శర్వా సరసన నటిస్తుందనే వార్త సినీ సర్కిల్స్‌లో జోరుగా చక్కర్లు కొడుతోంది. ఇక ఈ చిత్రాన్ని అనిల్ సుంకర నిర్మించనుండగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆగస్టు నెలలో ప్రారంభం కానుంది. శర్వానంద్-శ్రీను వైట్ల కాంబినేషన్‌లో వస్తున్న ఈ ఎంటర్‌టైనర్‌ను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## వెంకటేష్-అనిల్ రావిపూడి మూవీకి ఇంట్రెస్టింగ్ టైటిల్ ఫిక్స్..?



టాలీవుడ్ లో పక్కా స్క్రిప్ట్, ప్లానింగ్‌తో వరుస విజయాలు అందుకుంటున్న దర్శకుడు అనిల్ రావిపూడి, ఇప్పుడు 'సంక్రాంతి 2027' లక్ష్యంగా తన నెక్స్ట్ చిత్రాన్ని సిద్ధం చేస్తున్నారు. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్‌రామ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ మల్టీస్టారర్ చిత్రం జూన్ 18న గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. జూన్ 22 నుండి షూటింగ్ ప్రారంభించి, అక్టోబర్ లేదా నవంబర్ నాటికల్లా పూర్తి చేయాలని దర్శకుడు ప్లాన్ చేస్తున్నాడు. ఈ చిత్రంలో కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్స్ గా నటిస్తుండగా, వెంకటేష్ జూలై నుండి విరామం లేకుండా షూటింగ్‌లో పాల్గొననున్నాడు. సాహు గారపాటి నిర్మాణంలో రానున్న ఈ సినిమాకు జి.వి. ప్రకాష్ కుమార్ ఇప్పటికే మూడు ట్యూన్స్ సిద్ధం చేశాడట. ఇక ఈ చిత్రానికి 'జనవరి 13 విడుదల' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీంతో మరోసారి అనిల్ రావిపూడి తన స్పెషాలిటీ నిరూపించుకుంటున్నాడు.

## రాజమౌళి సెంటిమెంట్‌కు అనిల్ రావిపూడి విరుగుడు.. మహేష్ బాబు స్మార్ట్ ప్లాన్!



సూపర్ స్టార్ మహేష్ బాబు, టాలీవుడ్ జక్కన్న ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రాబోతున్న భారీ అడ్వెంచర్ సినిమా వారణాసి గురించి ఓ క్రేజీ న్యూస్ నెట్టింట వైరల్ అవుతోంది. అయితే ఈ సినిమా తర్వాత మహేష్ నెక్స్ట్ ఎవరితో చేయబోతున్నారనే దానిపై ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. మహేష్, రాజమౌళి సినిమా తర్వాత వచ్చే నెగెటివ్ సెంటిమెంట్‌ను బ్రేక్ చేయడానికి, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తో పని చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు ఫిలింనగర్‌లో టాక్ వినిపిస్తోంది. ఆ వివరాలు చూద్దాం..

**'వారణాసి' తర్వాత ముగ్గురు దర్శకుల రేస్:** రాజమౌళి సినిమా అంటేనే ఏళ్ల తరబడి షూటింగ్ జరుగుతుంది. అందుకే ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే మహేష్ బాబు తన తదుపరి ప్రాజెక్ట్ కోసం ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రస్తుతానికి మహేష్ బాబు నెక్స్ట్ సినిమా రేసులో ముగ్గురు క్రేజీ దర్శకుల పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. వారిలో బుచ్చిబాబు, సందీప్ రెడ్డి వంగా, అనిల్ రావిపూడి ఉన్నారు. అయితే వీరిలో ఒకరి వైపే మహేష్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

**సందీప్ వంగా బిజీ.. అనిల్‌కే ఛాన్స్:** నిజానికి ఏషియన్ సినిమాస్ బ్యానర్‌లో సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో మహేష్ సినిమా చేయాల్సి ఉంది. కానీ సందీప్ ప్రస్తుతం ప్రభాస్ స్పిరిట్, రణబీర్ కపూర్ యానిమల్ పార్క్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇక దీంతో ఇప్పట్లో ఈ కాంబినేషన్ కుదిరేలా లేదు. అందుకే రాజమౌళి భారీ యాక్షన్ సినిమా తర్వాత కాస్త తేలికపాటి ఎంటర్‌టైనర్ చేయాలని భావిస్తున్న మహేష్.. అనిల్ రావిపూడి చెప్పిన కథకు ఓకే అనేలా ఉన్నారట.

**మహేష్ బాబు 'కోచ్' అవతారం?:** అనిల్ రావిపూడి ఆల్రెడీ మహేష్ బాబుకు ఒక ఇంట్రెస్టింగ్ లైన్ వినిపించారట. అది ఒక ఫ్యామిలీ ఓరియెంటెడ్ 'స్పోర్ట్స్ డ్రామా' కథ అని సమాచారం. ఇందులో మహేష్ బాబు ఒక పవర్‌ఫుల్ 'కోచ్' పాత్రలో సరికొత్తగా కనిపించబోతున్నారనే క్రేజీ టాక్ నడుస్తోంది. ఇక గతంలో వీరి కాంబోలో వచ్చిన 'సరిలేరు నీకెవ్వరు' బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు ఇప్పుడే పెరిగిపోతున్నాయి.

**అనిల్ రావిపూడి హిట్ ఫార్ములా:** ఇండస్ట్రీలో అనిల్ రావిపూడి సినిమా తీస్తే హిట్ గ్యారెంటీ అనే ఒక బలమైన నమ్మకం ఉంది. గతేడాది వెంకటేష్ తో తో సూపర్ హిట్ కొట్టిన అనిల్, ఈ ఏడాది మన శంకర్ వరప్రసాద్ మూవీతో ఇండస్ట్రీని షేక్ చేసి బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకున్నారు. ఇక వచ్చే ఏడాది వెంకటేష్, కళ్యాణ్ రామ్‌లతో ఒక క్రేజీ మల్టీస్టార్ మూవీతో రానున్నారు. ఇలా వరుస హిట్లతో ఉన్న అనిల్ ఫార్ములా మహేష్‌కు బాగా ప్లస్ కానుంది.

**రాజమౌళి శాపానికి విరుగుడు:** టాలీవుడ్‌లో ఒక విచిత్రమైన సెంటిమెంట్ ఉంది. రాజమౌళితో సినిమా చేసిన తర్వాత ఏ హీరోకైనా సరే నెక్స్ట్ సినిమా ఫ్లాప్ అవుతుంది. ఇక రామ్ చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్.. ఇలా అందరికీ ఈ నెగెటివ్ సెంటిమెంట్ తగిలింది. అయితే 100% సక్సెస్ ట్రాక్ రికార్డ్ ఉన్న అనిల్ రావిపూడితో సినిమా చేస్తే ఆ 'రాజమౌళి సెంటిమెంట్'ను ఈజీగా బ్రేక్ చేయవచ్చని మహేష్ బాబు స్మార్ట్‌గా ప్లాన్ చేస్తున్నారట. భారీ బడ్జెట్, హై వోల్టేజ్ అడ్వెంచర్ సినిమాగా రాబోతున్న 'వారణాసి' తర్వాత మహేష్ బాబుకు ఒక కంప్లీట్ ఫ్యామిలీ అండ్ స్పోర్ట్స్ ఎంటర్‌టైనర్ పక్కాగా సెట్ అవుతుంది. అనిల్ రావిపూడి మార్క్ కామెడీ, ఎమోషన్స్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట ఖాయం.

## 'నాగబంధం' ట్రైలర్ లాంచ్‌కు వేదిక ఫిక్స్.. ఎక్కడంటే..?

టాలీవుడ్‌లో తెరకెక్కుతన్న ప్రెస్టీజియస్ మైథలాజికల్ ఫాంటసీ థ్రిల్లర్ చిత్రం 'నాగబంధం' ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని అభిషేక్ నామా డైరెక్ట్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని జూలై 3న వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్ లాంచ్ చేయనున్నారు. ఈ క్రమంలో చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్‌ను హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పీసీఎక్స్ స్క్రీన్‌లో జూన్ 19న లాంచ్ చేయనున్నారు. ఇప్పటికే టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ అవ్వగా, ఈ ట్రైలర్‌తో సినిమాపై హైప్ మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ సినిమాలో జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, అనసూయ, మురళీ శర్మ వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. మరి హైదరాబాద్‌లోనే పెద్ద స్క్రీన్ అయిన ప్రసాద్స్ పీసీఎక్స్‌లో నాగబంధం అద్భుతమైన విజువల్స్ ఇంకెంత గ్రాండ్‌గా కనిపిస్తాయో చూడాలి.




## ఫేడౌట్ అనుకుంటే బౌన్స్ బ్యాక్.. నివేదా క్రేజీ లైనప్



టాలీవుడ్ లో హీరోయిన్ల కెరీర్ గ్రాఫ్ ఎప్పుడు ఎలా మారుతుందో అంచనా వేయడం చాలా కష్టం. ఒకట్రెండు ఫ్లాపులు పడినా లేదా కాస్త గ్యాప్ వచ్చినా ఇక ఫేడౌట్ అయిపోయారని ఈజీగా డిసైడ్ చేసేస్తారు. టాలెంటెడ్ బ్యూటీ నివేదా పేతురాజ్ విషయంలో కూడా రీసెంట్ గా ఇలాంటి కామెంట్స్ గట్టిగానే వినిపించాయి. తెలుగులో ఆమెకు అవకాశాలు దాదాపు తగ్గిపోయాయనే టాక్ నడుస్తున్న టైమ్ లో.. సడెన్ గా రెండు భారీ ప్రాజెక్ట్స్ లైన్ లో పెట్టి ఇండస్ట్రీకి పెద్ద షాక్ ఇచ్చింది. గతంలో మెంటల్ మదిలో, చిత్రలహరి, బ్రోచేవారెవరురా, అల వైకుంఠపురములో లాంటి సక్సెస్ ఫుల్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజ్ కు ఆ తర్వాత ఆశించిన స్థాయిలో సరైన బ్రేక్ రాలేదు. ఆమె కెరీర్ పూర్తిగా స్లో అయిపోయినట్లే అనిపించింది. రీసెంట్ గా వచ్చిన సింగ్ గీతం సినిమాలో కూడా ఆమె కేవలం ఒక చిన్న క్యామియో రోల్ కే పరిమితం అయింది. దీంతో ఆల్మోస్ట్ ఆమె కెరీర్ గ్రాఫ్ పడిపోయిందా అనేలా కామెంట్స్ వచ్చాయి. కానీ ఆమె ప్లానింగ్ వేరేలా ఉంది. విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో రాబోతున్న ఆదర్శ కుటుంబం సినిమాలో నివేదా ఒక క్రేజీ ఛాన్స్ దక్కించుకుని అందరి దృష్టి తనవైపు తిప్పుకుంది. త్రివిక్రమ్ సినిమాల్లో లేడీ క్యారెక్టర్స్ కు ఎంత ఇంపార్టెన్స్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ ప్రాజెక్ట్ లో ఆమె రోల్ చాలా పవర్ ఫుల్ గా, సెకండ్ హాఫ్ లో కథను మలుపు తిప్పేలా ఉండబోతోందని ఇండస్ట్రీ సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది.

**ఈ సినిమా ఆఫర్ ఆమె కెరీర్ కు ఒక పెద్ద బూస్ట్ లాంటిది.**

వెంకటేష్ సినిమా ఛాన్స్ తోనే ఫ్యాన్స్ కు సర్ ప్రైజ్ ఇచ్చిన నివేదా.. ఇప్పుడు ఏకంగా మరో మెగా ఆఫర్ కూడా తన ఖాతాలో వేసుకున్నట్లు తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న మెగా158 ప్రాజెక్ట్ లో ఒక ముఖ్యమైన పాత్రకు ఎంపికైనట్లు తెలుస్తోంది. చిరంజీవి, యంగ్ హీరోయిన్ అనస్వర రాజన్ తండ్రీకూతుళ్లుగా నటిస్తున్న ఈ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాలో నివేదాకు ఒక మంచి రోల్ దొరకడం నిజంగా ఆమె లక్ అనే చెప్పాలి. ఒకప్పుడు ఆఫర్స్ తగ్గినప్పుడు ఏది పడితే అది చేసుకుంటూ పోకుండా కాస్త గ్యాప్ తీసుకుని మంచి కంటెంట్ ఉన్న సినిమాల కోసం వెయిట్ చేయడం నివేదాకు ఇప్పుడు బాగా కలిసొచ్చింది. అనవసరమైన హడావుడి లేకుండా సైలెంట్ గా తన యాక్టింగ్ టాలెంట్ నే నమ్ముకుని ముందుకు వెళ్తోంది. మేకర్స్ కూడా ఆమె స్కిల్స్ మీద ఉన్న నమ్మకంతోనే ఇలాంటి బడా ప్రాజెక్ట్స్ లో కీలకమైన రోల్స్ కు ఆమె పేరును ఫైనల్ చేస్తూ అవకాశం ఇస్తున్నారు. ఇదొక పాజిటివ్ సైన్ అని చెప్పవచ్చు. ఈ రెండు భారీ ప్రాజెక్ట్స్ తో నివేదా పేతురాజ్ మార్కెట్ వాల్యూ కూడా టాలీవుడ్ లో అమాంతం పెరిగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఒక పక్క త్రివిక్రమ్ మార్క్ కమర్షియల్ ఎంటర్టైనర్, మరో పక్క చిరంజీవి లాంటి బిగ్గెస్ట్ స్టార్ హీరో సినిమా.. ఈ రెండు థియేటర్లలో హిట్ అయితే ఆమె కెరీర్ కంప్లీట్ గా టర్న్ తీసుకుంటుంది.

## నెట్టింట ప్రగ్యా క్రేజ్.. ఆఫర్స్ తెచ్చిపెట్టేనా?



కంచె సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ ఆ తరువాత జెట్ స్పీడ్ లోనే మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ని సంపాదించుకుంది. క్యూట్ లుక్స్ తో మెప్పించిన ఈ భామ ప్రస్తుతం ట్విట్టర్ లో గట్టిగా ట్రెండ్ అవుతోంది. తన లేటెస్ట్ ఫిట్నెస్ తో కుర్రకారును ఫిదా చేస్తోంది. 35 నుంచి 40 ఏళ్ల వయసున్న హీరోయిన్లలో బెస్ట్ ఫిట్నెస్ మెయింటైన్ చేస్తున్న నటిగా నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. చాలా రోజుల తర్వాత ఆమె పేరు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో ఈ రేంజ్ లో వినిపిస్తోంది. సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఆమెను ఏకంగా శ్రద్ధా కపూర్, పూజా హెగ్డే, తాప్సీ లాంటి స్టార్ హీరోయిన్లతో పోలుస్తూ రకరకాల పోస్టులు పెడుతున్నారు. ఆ రేంజ్ స్టార్స్ తో కాంపిటీషన్ ఇస్తూ ఫిట్నెస్ విషయంలో ప్రగ్యా వాళ్లందరినీ ఈజీగా డామినేట్ చేస్తోందనే కామెంట్స్ గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ బజ్ ను పర్ఫెక్ట్ గా వాడుకునే పనిలో పడిన ఈ భామ.. తన అకౌంట్స్ లో మరిన్ని గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ ఫాలోవర్స్ అటెన్షన్ ను ఎక్కడా తగ్గకుండా చూసుకుంటోంది. ఇక్కడి వరకు అంతా బాగానే ఉన్నా అసలు పాయింట్ దగ్గరే ఒక పెద్ద క్వశ్చన్ మార్క్ కనిపిస్తోంది. ఇంటర్నెట్ లో నెటిజన్ల నుంచి ఇంత క్రేజ్ వస్తున్నా ఇదంతా సినిమా ఆఫర్స్ గా ఎందుకు మారడం లేదు అన్నదే అసలు లాజిక్. డిజిటల్ వరల్డ్ లో ఎంత హడావుడి ఉన్నా దాన్ని బిగ్ స్క్రీన్ మీదకు తీసుకెళ్లే సరైన ప్రాజెక్ట్స్ చేతిలో లేకపోతే ఆ క్రేజ్ కు పెద్దగా వాల్యూ ఉండదు. వర్క్ లోకి మారనంత వరకు ఈ ట్రెండింగ్స్ అన్నీ టెంపరరీగానే మిగిలిపోతాయి. జనరల్ గా సినిమా ఇండస్ట్రీలో నటీమణులకు అవకాశాలు రావాలంటే కేవలం పర్ఫెక్ట్ ఫిజిక్, గ్లామర్ ఒక్కటే ఉంటే సరిపోదు. వాళ్ల లక్, టైమింగ్, కరెక్ట్ కాంటాక్ట్స్ కూడా పక్కాగా వర్కౌట్ అవ్వాలి. ప్రగ్యా కెరీర్ గ్రాఫ్ చూస్తే ఇవన్నీ కొంచెం స్లో అయినట్లే అనిపిస్తోంది. కెరీర్ స్టార్టింగ్ లో వచ్చిన హిట్స్ ను సరైన విధంగా వాడుకుని నెక్స్ట్ లెవెల్ కు వెళ్లడంలో ఆమె కాస్త వెనుకబడిందనే టాక్ ఇండస్ట్రీలో ఉంది. టాలెంట్ ఉన్నా టైమ్ కలిసిరాకపోవడమే ఆమెకు పెద్ద మైనస్. ఇలాంటి గడ్డు కాలంలో కేవలం ఫోటోషూట్స్ కే పరిమితం కాకుండా తన యాక్టింగ్ స్కిల్స్ కు స్కోప్ ఉన్న స్ట్రాంగ్ కంటెంట్ వైపు ఆమె అడుగులు వేయాలి. సోషల్ మీడియాలో వచ్చిన ఈ ఫ్రెష్ అటెన్షన్ ను ఎవరైనా మేకర్స్ కరెక్ట్ గా నోటీస్ చేసి ఒక మంచి క్యారెక్టర్ ఆఫర్ ఇస్తే తప్ప ఆమె కెరీర్ మళ్లీ ఫామ్ లోకి రాదు. గ్లామర్ పాత్రలతో పాటు పెర్ఫార్మన్స్ ఓరియెంటెడ్ కథలు ఎంచుకోవడం ఇలాంటి టైమ్ లో చాలా ముఖ్యం. ఇక ప్రగ్యా జైస్వాల్ తన మైండ్ బ్లోయింగ్ ఫిట్నెస్ తో ఒక సెన్సేషన్ అయితే క్రియేట్ చేసింది. ఆడియన్స్ ఫోకస్ మొత్తం తన వైపు తిప్పుకోవడంలో పక్కాగా సక్సెస్ అయింది. అయితే ఈ ఆన్ లైన్ ట్రెండ్స్ రియల్ లైఫ్ ఆఫర్స్ గా ఎప్పుడు మారుతాయో చూడాలి. ఏదైనా మంచి బ్యానర్ లో సరైన ప్రాజెక్ట్ పడితే మాత్రం ఈ బ్యూటీ మళ్లీ టాలీవుడ్ లో బిజీ అవ్వడం గ్యారెంటీ అని ఆమె ఫ్యాన్స్ బలంగా నమ్ముతున్నారు.

## యూనిఫాం నుంచి గ్లామర్ వరకూ.. ఎయిర్‌హోస్టెస్‌లుగా చేసి హీరోయిన్ గా గుర్తింపు..



ఆకాశంలో విమానాల్లో ప్రయాణికులకు సేవలు అందించే ఎయిర్‌హోస్టెస్ ఉద్యోగాన్ని వదిలేసి, వెండితెరపై హీరోయిన్లుగా మెరిసిపోవడం అంటే మామూలు విషయం కాదు. తాజాగా వడ్డే నవీన్ 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరోయిన్ రాశీ సింగ్ ఎయిర్‌హోస్టెస్ స్టైల్‌లో స్పీచ్ ఇచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. నటి కాకముందు ఆమె ఎయిర్‌హోస్టెస్‌గా పనిచేశారు. ఆమెలాగే గ్లామర్ ప్రపంచంలోకి ఎంట్రీ ఇచ్చి సక్సెస్ అయిన మరికొందరు ముద్దుగుమ్మల క్రేజీ జర్నీ మీకోసం..

**ఎయిర్‌హోస్టెస్ టు హీరోయిన్.. రాశీ సింగ్:** రాయ్‌పూర్‌కు చెందిన రాశీ సింగ్ నటి అవ్వకముందు ప్రముఖ 'ఇండిగో' ఎయిర్‌లైన్స్‌లో ఎయిర్‌హోస్టెస్‌గా వర్క్ చేశారు. ఆ తర్వాత 2019లో 'జెమ్' అనే సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమయ్యారు. తాజాగా జరిగిన తన కొత్త సినిమా ఈవెంట్‌లో ఆమె ఎయిర్‌హోస్టెస్ స్టైల్‌లో అనౌన్స్‌మెంట్ చేస్తూ స్పీచ్ ఇచ్చి అందరిని అలరించారు.

**కింగ్‌ఫిషర్ నుంచి టాలీవుడ్ దాకా.. వాణీ భోజన్:** సౌత్ ఇండియాలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి వాణీ భోజన్ కూడా ఒకప్పుడు ఎయిర్‌హోస్టెస్‌గా చేశారు. ఆమె 'కింగ్‌ఫిషర్', 'ఇండిగో' లాంటి టాప్ ఎయిర్‌లైన్స్‌లో పనిచేశారు. ఆ తర్వాత ఆ జాబ్ వదిలేసి మోడలింగ్‌లోకి వచ్చారు. ఇక తెలుగులో విజయ్ దేవరకొండ ప్రొడక్షన్‌లో వచ్చిన 'మీకు మాత్రమే చెప్తా' సినిమాతో పాటు తమిళంలో 'ఓ మై కడవులే' లాంటి సూపర్ హిట్ సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. షారుఖ్ ఖాన్ మూవీ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన విద్యా మాల్వాడే, సినిమాల్లోకి రాకముందు ఎయిర్‌హోస్టెస్‌గా పనిచేశారు. తర్వాత మోడలింగ్‌పై ఆసక్తితో గ్లామర్ రంగంలోకి అడుగుపెట్టారు. షారుక్ నటించిన చక్ దే ఇండియా హాకీ టీమ్ కెప్టెన్‌గా నటించి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం పలు బాలీవుడ్ సినిమాల్లో నటించారు.

**పంజాబీ ఇండస్ట్రీ క్వీన్.. సోనమ్ బజ్వా:** ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న సోనమ్ బజ్వా కూడా మొదట్లో ఎయిర్‌హోస్టెస్‌గా కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత మోడలింగ్ వైపు అడుగులు వేసి హీరోయిన్‌గా మారారు. పంజాబీ సినీ ఇండస్ట్రీలో 'పంజాబ్ ఎల్ఓఎల్', 'అర్దబ్ ముతియారన్' వంటి సినిమాలతో టాప్ స్టార్‌గా ఎదిగారు. టాలీవుడ్‌లో కూడా 'ఆటాడుకుందాం రా' సినిమాలో ఒక స్పెషల్ సాంగ్‌లో మెరిశారు.

## ఉద్యోగ అవకాశాలు

గుంటూరు జిల్లా పరిధిలో బ్యాంక్ మరియు ఫైనాన్స్ కంపెనీల లోన్ రికవరీల కై గుంటూరు అడ్వకేట్ ఆఫీసు తో పనిచేయుటకు టెలీ కాలర్స్ మరియు ఫీల్డ్ ఆఫీసర్స్ (టార్గెట్ బేసిస్) కావలెను.

**పెద్ది విజయ్ భాస్కర్**

**న్యాయవాది**



**జిల్లా కోర్టు ఎదురు,**
**కన్నా లక్ష్మి నారాయణ గారి ఇంటి పక్కన.**
**కన్నా వారి తోట.**
**గుంటూరు**
**సెల్.**
**8008592163**

Printed, Published & Owned by **Mandalapu Benarji Naddh** and Printed at Raghava Printers, N.T.R. journalist Colony, Near Dakshnya, J.K.C. College Road,GUNTUR,and Published at N.T.R. journalist Colony, Near Dakshnya, J.K.C. College Road,GUNTUR, Editor.: Mandalapu Benarji Naddh

## కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌కు కొత్త దిశానిర్దేశం

**అశ్వరావుపేట(కాకతీయ జిల్లా ప్రతినిధి)జూన్ 17:**
పాలేరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ (ప్రత్యేక శిక్షణా కార్యక్రమం)కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం,భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై ఉద్యమాల నిర్వహణ తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని శిక్షణా సదస్సులో చురుకుగా పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి సమావేశంలో హాజరై నాయకత్వ సూచనలను స్వీకరించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధిలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సేవలను ప్రజలకు వివరించాలని సూచించారు.శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని నాయకులు అభిప్రాయపడ్డారు.బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యలపై ఉద్యమాలను ఉధృతం చేయాలనే సంకల్పంతో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## రోడ్ల గుంతలకు చెక్

**... ప్రజా సమస్యలే లక్ష్యంగా ఉప సర్పంచ్ శ్రీనివాసరావు !**

**దమ్మపేట(కాకతీయ జిల్లా ప్రతినిధి)జూన్ 17:**
గ్రామ ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని దమ్మపేట ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం దమ్మపేట గ్రామంలోని 4, 6, 7 వార్డుల్లో స్థానిక వార్డు సభ్యులతో కలిసి పర్యటించి పలు సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టారు.వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన గుంతలను గుర్తించి వాటిలో మట్టి పోయించి తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు. ఈ గుంతల వల్ల వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్తగా చర్యలు చేపట్టామని ఉప సర్పంచ్ తెలిపారు. అదేవిధంగా వార్డుల్లోని వీధుల ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను తొలగించి, పెరిగిన పిచ్చి మొక్కలను సిబ్బందితో శుభ్రం చేయించారు. గ్రామ పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు



మరింత చేరువయ్యేలా పెన్షన్ దరఖాస్తులను నేరుగా ప్రజల వద్దకే వెళ్లి స్వీకరించడం విశేషంగా నిలిచింది. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించడం ద్వారా స్థానిక సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఉప సర్పంచ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, రూపా రాంబాబు, సిబ్బంది పగడాల గోపి తదితరులు పాల్గొన్నారు.

## పోడి విధానం లో వరి సాగు మేలు :డాక్టర్ భరత్

**చర్ల (కాకతీయ జిల్లా ప్రతినిధి)జూన్ 17:**
పోడి విధానంలో వరి సాగు చేయడం ఎంతో మేలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి భారత్ పిలుపునిచ్చారు. చర్ల మండలం ఉప్పరగూడెం లో బుధవారం నేరుగా వరి వెదజల్లే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా పంటలకు సరిపడా మోతాదులోని ఎరువులను వినియోగించాలని సూచించారు.



పంటల్లో మోతాదుకు మించిన ఎరువులు వాడకం ద్వారా భూసారం తగ్గిపోతుందన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను వినియోగించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు విడుదల చేసిన డబ్ల్యు జి ఎల్ 44 (సిద్ది ), కేఎన్ఎం 1638 రకాలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు ఉద్యాన శాస్త్రవేత్త శివ మాట్లాడారు. కృషి విజ్ఞాన కేంద్రం రైతుల కొరకు చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులు, రైతులకు పరిచయం చేయడం, శిక్షణా కార్యక్రమం నిర్వహించడం, వాతావరణ సమాచారం, పంటల యాజమాన్యం, చీడపీడల నివారణ వంటి అంశాలు కెవికె ఆధ్వర్యంలో నడుస్తున్నాయన్నారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి ఉద్యాన పంటలు ప్రధానంగా ఆయిల్ ఫామ్,మునగ సాగు, పందిరిలో తీగజాతి కూరగాయల సాగు చేపట్టడం ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చు అన్నారు. ఆత్మ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, సర్పంచి సోయం నాగ లక్ష్మీ, ఏఈ ఓ అఫ్రీద్, రామకృష్ణ, మైరాడ అగ్రోనామిస్ట్ షణ్ముఖ సాయి, నవీన్,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## గిరిజన గుండెల్లో గౌరీ ప్రసాద్ ముద్ర..!

**- సేవలతో అవార్డు సాధించిన మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రి**

**- ప్రజా సేవలో అంకితభావం.. పారదర్శక పాలనలో ఆదర్శం..!**

**- గిరిజన ఉత్తమ సేవ అవార్డుతో జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు..!**

**మణుగూరు(కాకతీయ జిల్లా ప్రతినిధి)జూన్ 17:**
ఏజెన్సీ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అంకితభావంతో పనిచేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రి మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. ప్రజా సేవ, పారదర్శక నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చూపుతున్న ప్రతిభకు గుర్తింపుగా ఆసుపత్రి ఇటీవల "గిరిజన ఉత్తమ సేవ అవార్డు" అందుకోవడం విశేషం.ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్ నాయకత్వంలో వైద్య సేవలు కొత్త దిశగా పయనిస్తున్నాయని ప్రజలు ప్రశంసిస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్యం, పరిశుభ్రమైన వాతావరణం, ఆధునిక వైద్య పరికరాల వినియోగం, అత్యవసర సేవల బలోపేతం వంటి అంశాల్లో ఆసుపత్రి విశేష పురోగతి సాధించింది.ప్రత్యేకించి మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు సులభంగా వైద్య సేవలు





అందించేందుకు ఆసుపత్రి యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోంది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.సిబ్బందితో సమన్వయమే విజయ రహస్యం అనే భావనతో ముందుకు సాగుతున్న డాక్టర్ గౌరీ ప్రసాద్, క్రమశిక్షణ, నిబద్ధత, సేవా దృక్పథంతో ఆసుపత్రిని ఆదర్శవంతమైన వైద్య కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని పలువురు కొనియాడుతున్నారు.అభివృద్ధి కార్యక్రమాల అమలు, రోగులకు మౌలిక వసతుల కల్పన, ప్రజలకు అందుబాటులో వైద్య సేవల విస్తరణలో మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రి ముందంజలో నిలవడం గర్వకారణమని ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.ప్రజా సేవనే పరమావధిగా భావించి పనిచేస్తున్న డాక్టర్ గౌరీ ప్రసాద్



నాయకత్వంలో మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రి జిల్లాలోనే కాకుండా ఏజెన్సీ ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తోందని ప్రజలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.అవార్డు గెలిచింది ఆసుపత్రి కాదు... గిరిజనుల నమ్మకం!ఆ నమ్మకాన్ని నిలబెట్టిన పేరు డాక్టర్ గౌరీ ప్రసాద్.

## ఉమ్మడి ఖమ్మం వ్యవసాయ రంగానికి గేమ్‌చేంజర్

**- బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్‌తో తుమ్మల మాస్టర్ ప్లాన్!**

**- రైతు పంటకు విలువ**

**- యువతకు ఉద్యోగం**

**- ఖమ్మం జిల్లాకు పరిశ్రమల హబ్‌గా బుగ్గపాడు!**

**సత్తుపల్లి(కాకతీయ జిల్లా ప్రతినిధి)జూన్ 17:**
ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా, పౌల్ట్రీ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు నాంది పలికే బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ త్వరలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ఒకప్పుడు కేవలం ఆలోచనగా ఉన్న ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేసి, వ్యూహాత్మక స్థలాన్ని ఎంపిక చేసిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దూరదృష్టి ఇప్పుడు ఫలితాల దిశగా అడుగులు వేస్తోంది.2016లో కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పీఎంకేఎస్‌వై పథకం కింద సత్తుపల్లి మండలం బుగ్గపాడులో మెగా ఫుడ్ పార్క్‌కు ఆమోదం లభించింది. 60 ఎకరాల విస్తీర్ణంలో రూ.109 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఈ పార్క్‌లో రూ.99 కోట్ల మేర మౌలిక వసతుల నిర్మాణం చేపట్టగా, కేంద్ర ప్రభుత్వం రూ.28 కోట్ల గ్రాంట్‌ను అందించింది.

**గతంలో నిలిచిపోయిన ప్రాజెక్ట్‌కు కొత్త ఊపు...**
2016లో ఘనంగా శంకుస్థాపన జరిగినప్పటికీ, దాదాపు తొమ్మిదేళ్ల పాటు ఫుడ్ పార్క్ ఆశించిన వేగంతో ముందుకు సాగలేదు. అయితే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రాజెక్టు పురోగతిపై దృష్టి సారించారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పలుమార్లు సమీక్షలు నిర్వహించి, అనుమతుల ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**స్ట్రాటజిక్ లొకేషన్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు...**
బుగ్గపాడు ఎంపిక వెనుక మంత్రి తుమ్మల వ్యూహాత్మక ఆలోచన స్పష్టంగా కనిపిస్తోంది. 150 కిలోమీటర్ల పరిధిలో వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా, పౌల్ట్రీ ఉత్పత్తులు విస్తారంగా లభించే ప్రాంతంగా ఉండటమే కాకుండా జాతీయ రహదారులు, రైల్వే మార్గాలు, విమానాశ్రయాలు, సముద్ర ఓడరేవులకు సమీపంలో ఉండటం ఈ ప్రాజెక్టుకు ప్రధాన బలం.నేషనల్ హైవేలు, నాగపూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్, కొత్తగూడెం-ఖమ్మం రైల్వే కనెక్టివిటీ, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, కాకినాడ మరియు మచిలీపట్నం పోర్టుల సమీపం వల్ల ఎగుమతులకు కూడా అనుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి.




**పరిశ్రమలకు వేదిక.. వేలాది మందికి ఉపాధి...**
ఇప్పటికే ఫుడ్ పార్క్‌లోని 26 ఎకరాల్లో 26 పారిశ్రామిక ప్లాట్లను పలు కంపెనీలకు కేటాయించారు. గోర్లాస్ గ్రీన్ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్ఫినిటీ ఇండస్ట్రీస్‌తో పాటు తాజాగా దీపక్ నెక్స్ జెన్ ఆక్వా ప్రాజెక్ట్‌కు కూడా స్థలం కేటాయించారు.దీపక్ నెక్స్ జెన్ సంస్థ ఒక్కటే రూ.615 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం విశేషం. ఈ సంస్థ ద్వారా సుమారు 3,200 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అంచనా వేస్తున్నారు.

**రైతు పొలం నుంచి ప్రపంచ మార్కెట్ వరకు...**
ఫుడ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (జూజ), ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్లు (ప్రాజ), కలెక్షన్ సెంటర్లు (జజ) ద్వారా రైతులు పండించే ఉత్పత్తులకు విలువ ఆధారిత ప్రాసెసింగ్ జరిగి మెరుగైన ధరలు లభించే అవకాశం ఉంది. పంటలు నేరుగా మార్కెట్‌కు వెళ్లకుండా ప్రాసెసింగ్ ద్వారా అదనపు ఆదాయం పొందే మార్గం సుగమం కానుంది.

**తుమ్మల దూరదృష్టికి రైతుల ప్రశంసలు...**
ఆయిల్ పామ్ సాగు విస్తరణ నుంచి వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ప్రోత్సాహం వరకు రైతు సంక్షేమాన్ని కేంద్రంగా పెట్టుకుని ముందుకు సాగుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను వ్యవసాయ ప్రాసెసింగ్ రంగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలపాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు.
బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, ఎన్టీఆర్, ఏలూరు తదితర పరిసర జిల్లాల రైతులకు కూడా భారీగా ప్రయోజనం చేకూరనుంది. రైతు పంటకు గిట్టుబాటు ధర, యువతకు ఉపాధి, జిల్లాకు పారిశ్రామిక అభివృద్ధి అనే మూడు లక్ష్యాలను ఒకేసారి సాధించే ప్రాజెక్టుగా బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ నిలవనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.పొలం నుంచి ప్రపంచ మార్కెట్ వరకు... బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్‌తో ఖమ్మం రైతాంగానికి సువర్ణ యుగం అని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే జారె ఆదినారాయణ





**- ములకలపల్లిలో అభివృద్ధి జోరు**

**- రూ.1.60 కోట్లకు పైగా పనులకు శ్రీకారం**

**-47 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**

**- గ్రామాభివృద్ధి, విద్య, మౌలిక వసతులకే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యం**

**ములకలపల్లి(కాకతీయ జిల్లా ప్రతినిధి)జూన్ 17 :**
అశ్వరావుపేట నియోజకవర్గంలో గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. బుధవారం ములకలపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.మొదటగా కొత్తగంగారం గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం వద్ద వర్షాకాలంలో వరద నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.31.60 లక్షల వ్యయంతో నిర్మించనున్న గైడ్‌వాల్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ గైడ్‌వాల్ నిర్మాణంతో ఇళ్ల సముదాయం సురక్షితంగా ఉండటంతో పాటు నివాసితులకు ఇబ్బందులు తొలగనున్నాయని తెలిపారు. అనంతరం జగన్నాథపురం గ్రామపంచాయతీ



పరిధిలో స్వయం సహాయక సంఘాల మహిళల కోసం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు వీవో భవనాలకు శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఉపాధి అవకాశాల విస్తరణకు ఈ భవనాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.తదుపరి జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వ పాఠశాలలను విద్యాభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా మూకమామిడి -- ఎర్రప్పగుంపు -- రంగాపురం గ్రామాలను కలుపుతూ రూ.1 కోటి వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు వేగవంతమవడంతో పాటు రైతులు, విద్యార్థులు, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.అనంతరం చవిటిగూడెం, పొగడ్లపల్లి, తాళ్లపాయి గ్రామాలకు చెందిన 47 మంది అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.తర్వాత రింగురెడ్డిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ పనులకు శంకుస్థాపన చేశారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు.చివరిగా ములకలపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అశ్వరావుపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేరేలా రహదారులు, విద్య, ఇందిరమ్మ గృహాలు, మహిళా సంక్షేమం, మౌలిక సదుపాయాల రంగాల్లో నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు.గ్రామీణ మౌలిక వసతులు, విద్యాభివృద్ధి, మహిళా సాధికారత, గృహ వసతి కల్పన వంటి నాలుగు కీలక రంగాల్లో ఒకేరోజు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం ములకలపల్లి మండల అభివృద్ధికి కొత్త ఊపునిచ్చిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## కోటి రూపాయల బీటీ రోడ్డుకు శ్రీకారం

**ములకలపల్లి(కాకతీయ జిల్లా ప్రతినిధి)జూన్ 17:**
ములకలపల్లి మండలంలోని మూకమామిడి గ్రామ పంచాయతీ పరిధిలో మూకమామిడి నుంచి ఎర్రప్పగుంపు గ్రామం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం ఘనంగా శంకుస్థాపన చేశారు. కోటి రూపాయల వ్యయంతో చేపట్టనున్న ఈ రహదారి నిర్మాణంతో మూకమామిడి, ఎర్రప్పగుంపు, రంగాపురం గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ..గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం మూకమామిడి, చెవిటిగూడెం పంచాయతీలను ములకలపల్లి మండల కేంద్రంతో అనుసంధానిస్తూ బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. దీనివల్ల రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు మరియు సాధారణ ప్రజలకు రవాణా పరంగా ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.అంతేకాకుండా, త్వరలోనే మూకమామిడి ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తానని వెల్లడించారు. గ్రామాల్లో మిగిలిన సీసీ రోడ్ల నిర్మాణానికి కూడా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి గ్రామంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.శంకుస్థాపన కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. శంకుస్థాపన ప్రాంగణాన్ని



పూలతో, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేరడంతో ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తిమ్మంపేట సర్పంచ్ తుర్రం శ్రీనివాసరావు, జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్, ఎంపీడీవో రామారావు, ఎమ్మార్వో బిందు, ఏఈ సురేష్, పీఆర్ఏఈటీ శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యుఏఈ వరప్రసాద్, ఎంపీవో రమేష్‌బాబు, హౌసింగ్ ఏఈ సాహిత్యతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది మరియు భారీ సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కాకతీయ ప్రకాశం

## నేడు ఒంగోలులోని ఎస్ జివిఎస్ ఫంక్షన్ హాలులో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై విజయోత్సవ సభ

ఒంగోలు (కాకతీయ ప్రతినిధి) జూన్ 17: ఒంగోలులోని ఎస్ జివిఎస్ ఫంక్షన్ హాలులో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై విజయోత్సవ సభ 18న గురువారం ఉదయం 10.00 గంటలకు ఒంగోలు నగరంలోని ఎస్ జివిఎస్ ఫంక్షన్ హాలులో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు ఆధ్వర్యంలో ఒంగోలు నియోజకవర్గం, ప్రకాశం జిల్లా విజయోత్సవ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఒంగోలు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది బుధవారం ఓ ప్రకటన తెలియజేశారు.

ఈ రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సుపరిపాలనకు గుర్తింపుగా నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేయడానికి నియోజకవర్గం లోని తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ నాయకులు, ఒంగోలు నగర కమిటీ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, డివిజన్ కమిటీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, వివిధ అనుబంధ కమిటీలలోని సభ్యులు, తెలుగు మహిళ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయవాల్సిందిగా కోరారు.

# వంగపాడులో చిన్నారులకు 'అక్షరాభ్యాసం'

కనిగిరి (కాకతీయ ప్రతినిధి) జూన్ 17:



కనిగిరి మహిళా ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "అంగన్వాడీ పిలుస్తుంది" కార్యక్రమంలో భాగంగా బుధవారం కనిగిరి మండలం వంగపాడు అంగన్వాడీ కేంద్రములో ప్రీ స్కూల్లో చేరిన చిన్నారులకు "అక్షరాభ్యాసం" కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం వి ఎస్ పార్వతి చిన్నారులకు తల్లుల సమక్షంలో అక్షరాభ్యాసం చేయించి ఆశీస్సులు అందజేశారు. అనంతరం ప్రీస్కూల్ పూర్తి చేసుకున్న పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే జరిపి సర్టిఫికెట్లను పంపిణీ చేసి, వారిని ప్రాథమిక పాఠశాలలో



చేర్పించడ మైనది. ఈసందర్భంగా పార్వతి మాట్లాడుతూ మూడు సంవత్సరములు నిండిన చిన్నారులను అంగన్వాడీలో చేర్పించాలని ,ప్రీస్కూల్ విద్య, పౌష్టికాహారం ,ఆరోగ్య సేవలను అందించే అంగన్వాడీలను గురించి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అంగన్వాడీ పిలుస్తుంది అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ .తిరుపతి, జి .కేశవ కుమారి అంగన్వాడీ కార్యకర్తలు విజయ కుమారి, శైలజ ,రాధ,రాజేశ్వరి గ్రామంలో తల్లిదండ్రులు, కిశోర బాలికలు, పిల్లలు పాల్గొన్నారు.

# లిపుట్టావారిపాలెం జంక్షన్‌లో భారీ ట్రాఫిక్ జామ్

సంతమాగులూరు(కాకతీయ ప్రతినిధి)జూన్ 17:



సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం జంక్షన్‌లో బుధవారం ఉదయం భారీ ట్రాఫిక్ సమస్య నెలకొంది. గుంటూరు--కర్నూలు, నార్కట్‌పల్లి--అద్దంకి ప్రధాన రహదారుల కూడలి కావడంతో గంటకు పైగా వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభం కావడం, వ్యాపార కార్యకలాపాలు మొదలవడం, వివిధ శుభకార్యాలకు బుధవారం మంచి రోజు కావడంతో ఒకేసారి పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి రావడం ట్రాఫిక్ రద్దీకి ప్రధాన కారణంగా కనిపించింది. లారీలు, బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర



వాహనాలు భారీగా రావడంతో జంక్షన్ నాలుగు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. కొన్ని మార్గాల్లో రెండు కిలోమీటర్లకు పైగా వాహనాల క్యూలు కనిపించాయి.



ట్రాఫిక్ నియంత్రణలో సిబ్బంది కొరత

పుట్టావారిపాలెం జంక్షన్‌కు సమీపంలో సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ ట్రాఫిక్ నియంత్రణకు తగిన సిబ్బంది అందుబాటులో లేకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రస్తుతం పోలీసు సిబ్బంది ఇతర విధుల్లో నిమగ్నమవుతున్నందున ప్రత్యేక ట్రాఫిక్ డ్యూటీలకు సిబ్బంది కొరత ఉందని తెలుస్తోంది.

శాశ్వత పరిష్కారంపై ప్రజల డిమాండ్

పుట్టావారిపాలెం జంక్షన్ జిల్లాలో అత్యంత రద్దీ కూడళ్లలో ఒకటిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రహదారుల విస్తరణతో పాటు ఆధునిక ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, రద్దీ సమయాల్లో ప్రత్యేక ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో తక్షణ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

సత్వర స్పందనతో ట్రాఫిక్ క్లియర్

పుట్టావారిపాలెం జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్ విషయం తెలుసుకున్న సంతమాగులూరు సీఐ శేషగిరిరావు తక్షణమే పోలీసు సిబ్బందిని ట్రాఫిక్ నియంత్రణ విధులకు పంపించారు. సిబ్బంది రంగంలోకి దిగి వాహనాలను క్రమబద్ధీకరించడంతో కొద్ది సేపట్లోనే ట్రాఫిక్ జామ్ పూర్తిగా క్లియర్ అయింది. గంటకు పైగా ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడిన ప్రయాణికులు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. సమస్యను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టిన సీఐ శేషగిరిరావు, ఎస్సై పట్టాభిరామయ్యలను స్థానికులు, ప్రయాణికులు అభినందించారు.

ప్రమాదాలకు కూడా కారణమవుతున్న రద్దీ

ఈ కూడలిలో తరచూ ట్రాఫిక్ నిలిచిపోవడంతో పాటు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, వృద్ధులు రోడ్డు దాటే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ట్రాఫిక్ నిర్వహణకు శాశ్వత ప్రణాళిక అవసరమని కోరుతున్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే కూటమి ప్రభుత్వ ఆశయం

## - మంత్రి ఆనం రామనారాయణరెడ్డి





కనిగిరి (కాకతీయ ప్రతినిధి) జూన్ 17:

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే కూటమి ప్రభుత్వ ఆశయమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం కనిగిరి మున్సిపాలిటీలోని 11వ వార్డు దేవాంగనగర్‌లో నేషనల్ హెల్త్ మిషన్ గ్రాంట్ 1 కోటి 18 లక్షలరూపాయలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ ను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. అనంతరం మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమని, పేదలు నివసించే దేవాంగ నగర్, కాశిరెడ్డి నగర్ తదితర ప్రాంతాలలో అర్బన్ సెంటర్ ను ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. అనంతరం దేవాంగనగర్‌లో 15వ ఆర్థిక సంఘం రూ. 32.72 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ లను ప్రారంభించారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని, పేదల సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలకు విచ్చేసిన మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డిలకు కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డా. ముక్కు



ఉగ్ర నరసింహారెడ్డి నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, రోషన్ సందాని, నంబుల వెంకటేశ్వర్లు, తులసి, దొరసాని, తదితరులు పాల్గొన్నారు.

# రాయితీ పై పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ

వెలిగండ్ల(కాకతీయ ప్రతినిధి )జూన్ 17:



వెలిగండ్ల మండలంలోని పలు గ్రామాలలోని రైతు సేవ కేంద్రాలలో బుధవారం రైతులకు 50శాంతం రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి టి. శిల్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని నగదు చెల్లింపులు పూర్తి చేసిన రైతులు రైతుసేవా కేంద్రాల పరిధిలో గల గ్రామాల రైతులకు రైతు సేవ కేంద్ర సిబ్బంది విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. పచ్చిరొట్ట పైర్ల సాగు వల్ల భూమిలో




సేంద్రీయ కర్బన శాతం పెరగడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం మెరుగు పడుతుందని తెలిపారు. సమస్యాత్మక భూములలో జీలుగా విత్తనాలు చల్లిన తరువాత పూత దశలో కలియదున్నడం వలన చౌడు సమస్య తగ్గుతుందని తెలిపారు. విత్తనాలు అవసరం ఉన్న రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి రాయితీపై విత్తనాలను పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పుల్లయ్య, వీఏఏ షేక్. అజారుద్దీన్, టిడిపి నాయకులు కర్నాటి భాస్కర్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేసి దొంగతనాలు అరికట్టాలి -చల్లా కృష్ణారావు

సంతమాగులూరు(కాకతీయ ప్రతినిధి)జూన్ 17:

సంతమాగులూరు మండలంలోని గ్రామాల్లో వరుసగా దొంగతనాలు, దొంగతన యత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో తగిన వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రజల భద్రతకు చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి చల్ల కృష్ణారావు సంబంధిత అధికారులను కోరారు. ఇటీవలె కామేపల్లి గ్రామంలోని శివాలయం బజార్ ప్రాంతంలో దొంగలు దొంగతనానికి ప్రయత్నించిన ఘటన చోటుచేసుకోగా, అడివిపాలెం గ్రామంలో రాత్రి సమయంలో జరిగిన దొంగతనంలో బంగారం, నగదు అపహరణకు గురైనట్లు ఆయన పేర్కొన్నారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నప్పటికీ, అనేక ప్రాంతాల్లో వీధిలైట్లు లేకపోవడం వల్ల దొంగలకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు.



**వీధిలైట్లు లేకపోవడం ప్రధాన సమస్య**

కామేపల్లి గ్రామంలో శివాలయం బజార్ పరిసర ప్రాంతాల్లో ఎన్నో సంవత్సరాలుగా ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేసినప్పటికీ, వాటిపై ఇప్పటికీ వీధిలైట్లు అమర్చలేదని జనసేన పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి చల్లా కృష్ణారావు తెలిపారు. దీంతో ఆ ప్రాంతంలోని ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు సంచరించే అవకాశాలు పెరిగాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో తక్షణమే వీధిలైట్లు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి వేళల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు. గ్రామ ప్రజల భద్రత దృష్ట్యా అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని జనసేన బృందం పేర్కొంది.

# ఒక కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసిన మద్య వ్యసనం

## - అమ్మ జైలులో.. నాన్న లేడు..

## - ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న నలుగురు చిన్నారులు

యాడికి,(కాకతీయ ప్రతినిధి)జూన్ 17:

ఒకవైపు తండ్రి మరణం.. మరోవైపు తల్లి జైలు జీవితం. వీరిద్దరి మధ్య జరిగిన విషాదానికి బలైన వారు మాత్రం అభం శుభం తెలియని నలుగురు చిన్నారులు. కుటుంబ కలహాలు, మద్య వ్యసనం, వేధింపుల పరంపర చివరకు ఓ కుటుంబా న్ని ఛిన్నాభిన్నం చేసి,నలుగురు చిన్నారుల ను



అనాథలుగా మార్చింది. యాడికి మండలంలోని పెద్దపేట గ్రామానికి చెందిన పల్లా శివప్రసాద్ చేనేత కార్మికుడు. అయితే మద్యానికి బానిసైన అతడు కుటుంబ పోషణను విస్మరించి, భార్య హేమావతిని తరచూ వేధింపులకు గురిచేసే వాడని గ్రామస్థులు చెబుతున్నారు.నిత్యం మద్యం మత్తులో ఇంటికి వచ్చి గొడవలు పెట్టడం, చిత్రహింసలకు గురిచేయడం వల్ల హేమావతి తీవ్ర మనోవేదనకు గురయ్యింది. ఈ నెల 12న జరిగిన ఘర్షణలో భర్త వేధింపులను తట్టుకోలేక, తనను తాను రక్షించుకునే క్రమంలో క్షణికావేశానికి లోనైన హేమావతి భర్తపై దాడి చేయగా, శివప్రసాద్ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఈ నెల 15న హేమావతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో తండ్రిని కోల్పోయిన, తల్లి జైలుకు వెళ్లిన నలుగురు చిన్నారులు ఒక్కసారిగా దిక్కులేని స్థితిలో మిగిలి పోయారు. కన్నవారిని కోల్పోయి,ఏమీ ఎరుగని వయసులో వారి రోదనలు ప్రతి ఒక్కరినీ కలచివేస్తున్నాయి. ప్రస్తుతం యాడికి మండల కేంద్రంలోని అగాపే ఆశ్రమం ఫౌండర్ బత్తుల ప్రసాద్ చిన్నారు లకు ఆశ్రయం కల్పించి అండగా నిలిచారు. అయితే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో, మానవత్వంతో సమాజంలోని దాతలు,స్వచ్ఛంద సంస్థలు,ప్రభుత్వ యంత్రాంగం ముందుకు వచ్చి ఈ చిన్నారులకు అండగా నిలవాలని పలువురు కోరుతున్నారు.

# నాగులకట్ట వీధిలో డ్రైనేజీల శుభ్రపరిచిన పంచాయతీ సిబ్బంది

యాడికి(కాకతీయ ప్రతినిధి) జూన్ 17 :

యాడికి మండల కేంద్రంలోని హైస్కూల్ గ్రౌండ్ సమీపంలో ఉన్న నాగులకట్ట వీధిలో పంచాయతీ అభివృద్ధి అధికారి సాయి అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు పంచాయతీ మేస్త్రి రహంతుల్లా ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదా రాలను బుదవారం తొలగించి శుభ్రపరిచారు.దీంతో నీటి నిల్వలు తగ్గి పరిసరాలు పరిశుభ్రంగా మారాయి.ఈ సందర్భం గా స్థానికులు పంచాయతీ సిబ్బంది చేపడుతున్న పారిశుధ్య నిర్వహణపై సంతోషం వ్యక్తం చేస్తూ, ఇలాంటి శుభ్రత కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణకు సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు.



# పెద్దపేట సమీపంలో ప్రమాదకర గుంతలకు తాత్కాలిక పరిష్కారం

## - సామాజిక బాధ్యతతో ముందుకొచ్చిన పాత్రికేయుడు

యాడికి,(కాకతీయ ప్రతినిధి) జూన్ 17: యాడికి మండలంలోని పెద్దపేట గ్రామ సమీపంలో కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురై ఏర్పడిన గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో బుధవారం ఆంధ్రప్రభ విలేకరి సారెడ్డి రామచంద్రా రెడ్డి స్వచ్ఛందంగా ముందుకొచ్చి మట్టి వేసి గుంతలను పూడ్చారు.గతంలో తిప్పా రెడ్డిపల్లె రోడ్డుపై ఏర్పడిన గుంతలను కూడా ఆయన స్వయంగా పూడ్చి ప్రజల ప్రశంసలు పొందారు. ప్రజా సమస్యలపై వార్తలు రాయడంతో పాటు వాటి పరిష్కా రానికి తనవంతు కృషి చేస్తున్న సారెడ్డి సేవలను స్థానికులు అభినందించారు. అధికారులు వెంటనే రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.



కాకతీయ
ప్రాంతీయం
5
18 గురువారం
జూన్
2026

## ధర్ గ్యాంగ్ తో అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై అనిల్ కుమార్ ప్రజలకు హెచ్చరిక

తెనాలి (కాకతీయ ప్రతినిధి) జూన్ 17: ధర్ గ్యాంగ్ తో బాపట్ల జిల్లా మరియు చుండూరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చుండూరు ఎస్సై టి. అనిల్ కుమార్ హెచ్చరించారు. బుధవారం బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు మధ్యప్రదేశ్ లోని ధర్ జిల్లా కు చెందిన ధర్ గ్యాంగ్ సభ్యులు ఏలూరులోని పెద్ద రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఈ గ్యాంగ్ కు చెందిన ముగ్గురు సభ్యులు కదలికలు సీసీ కెమెరాలు రికార్డు అయినట్లు అధికారులు గుర్తించారని. ఈ గ్యాంగ్ దొంగతనాలు, దోపిడీలకు పాల్పడే అవకాశం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100 లేదా 112 ఎమర్జెన్సీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని ఎస్సై అనిల్ కుమార్ సోషల్ మీడియా ద్వారా సూచించారు.




## మెట్ట గౌడ పాలెం లో పాఠశాలను పున: ప్రారంభించిన విద్యాశాఖ అధికారులు

చెరుకుపల్లి. ( కాకతీయ ప్రతినిధి). మండలంలోని బలుసులపాలెం పంచాయతీ పరిధిలోని మెట్ట గౌడ పాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ను మండల విద్యాశాఖ అధికారులు తురిమెళ్ళ నవీన్ కుమార్ పులి లాజర్ లు బుధవారం పున : ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ గ్రామ పెద్దలు విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి మళ్లీ పాఠశాలను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను




తూచా తప్పకుండా టైం కు పాఠశాలకు పంపించాలన్నారు. ఎక్కువ మంది పిల్లలు పాఠశాలకు వచ్చే విధంగా గ్రామ పెద్దలు చొరవ చూపాలన్నారు. టిడిపి మండల బీసీ సెల్ ఉపాధ్యక్షులు పేరం శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు లేక రెండు సంవత్సరాల క్రితం మూతపడిన పాఠశాలను తిరిగి ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పాఠశాల తిరిగి ప్రారంభించడానికి చొరవ చూపిన మంత్రివర్యులు అనగాని సత్య ప్రసాద్ కు మరియు అనగాని శివప్రసాద్ కు గ్రామస్తులందరి తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతరం కాటూరి నరసింహారావు విద్యార్థులకు పాలకులు పుస్తకాలు తన సొంత నిధులతో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తుళ్లూరు శరత్ బాబు దాసరి వెంకటరామయ్య కాటూరి బసవయ్య దాసరి కాళిదాసు కాటూరి శ్రీనివాసరావు కాటూరి శివ మాతయ్య కాటూరి శివ నాంచారయ్య దాసరి నాగ వీర బ్రహ్మం ఉప్పాల సత్యనారాయణ పాగోలు తిరుపతయ్య కాటూరి శ్రీనివాసరావు ఉసిరికాయల శ్రీనివాసరావు కాటూరు శ్రావణ్ కుమార్ షేక్ మస్తాన్ వలి షేక్ జున్ను బుడ షేక్ ఇమ్రాన్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ ఫైర్.. పొంగులేటిపై అవినీతి బాంబులు!

### రేవంత్ దొంగ అయితే.. పొంగులేటి గజదొంగ
### -- పాలేరు సభలో సంచలన వ్యాఖ్యలు

పాలేరు(కాకతీయ జిల్లా ప్రతినిధి) జూన్ 17:

ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం రాజకీయంగా వేడెక్కింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో అవినీతి, భూదందాలు, ఇసుక మాఫియా,అధికార దుర్వినియోగం పెరిగిపోయాయని ఆరోపిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు.రాష్ట్ర రెవెన్యూ ఆదాయం పడిపోతున్నప్పటికీ రెవెన్యూ మంత్రి పొంగులేటి అవినీతి సామ్రాజ్యం మాత్రం వందల రెట్లు పెరిగిందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతున్నా, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కమీషన్ దందాలు మాత్రం జోరుగా సాగుతున్నాయని విమర్శించారు. పొంగులేటి సంపాదించిన అక్రమ ఆస్తులను లెక్కించడానికి నోట్లు లెక్కపెట్టే యంత్రాలే అలసిపోతున్నాయని ఎద్దేవా



చేశారు.రెండు సంవత్సరాల క్రితం ఈడీ నిర్వహించిన దాడుల్లో వందల కోట్ల రూపాయలు బయటపడ్డాయని, అయినప్పటికీ ఆ వ్యవహారంపై బీజేపీ కానీ కాంగ్రెస్ కానీ ఇప్పటి వరకు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. బీజేపీతో ఉన్న రహస్య ఒప్పందాల కారణంగానే పొంగులేటిపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.తెలంగాణలో కోటి ఎకరాల భూములను వివాదాస్పద జాబితాలో చేర్చి రైతులను భయపెట్టి సెటిల్‌మెంట్లు



చేయించుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. భూములపై ఆంక్షలు విధించి వాటిని దోచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి దొంగ అయితే పొంగులేటి గజదొంగ అంటూ చేసిన వ్యాఖ్యలు సభలో చర్చనీయాంశంగా మారాయి.
మంత్రివర్గంలో కూడా పొంగులేటి అహంకార ధోరణితో వ్యవహరిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. బీసీ మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరిల పట్ల అవమానకరంగా ప్రవర్తించారని ఆరోపించారు.



అధికారులను కూడా "సెన్స్ ఉందా?" అంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు.వట్టినాగులపల్లి భూముల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, పొంగులేటి కుమారుడి పేరుతో భూకబ్జాలు, దాడులు జరిగాయని ఆరోపించారు. ఆ ఘటనలపై నమోదైన కేసులను ప్రభావితం చేసి అధికారులను బదిలీ చేయించారని పేర్కొన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన తీర్పు ఇస్తారని హెచ్చరించారు.హౌసింగ్ మంత్రి హోదాలో 20 లక్షల ఇండ్లు నిర్మించిన తర్వాతే ఓట్లు అడుగుతానన్న పొంగులేటి మాట ఏమైందని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రభుత్వ కాలంలో సగం పూర్తయిందని, కనీసం 10 లక్షల ఇండ్లు అయినా నిర్మించారా అని నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఎన్ని ఇళ్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.రైతులపై భూమి శిస్తు మళ్లీ విధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం తొలగించిన భూమి శిస్తును మళ్లీ తీసుకురావాలని కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని, రైతుల జేబులను ఖాళీ చేసే ప్రయత్నాలను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు.

## ప్రతి రైతుకు ఏపిఏఐఎంఎస్ యాప్ ద్వారానే యూరియా, డిఏపి ఎరువులు




గుంటూరు ప్రతినిధి: వాతావరణ మార్పులు నేపథ్యంలో ఎల్ ని నో ప్రభావం రైతుల పై పడకుండా ముందస్తు ప్రణాళికతో పని చేయాల్సిన అవసరం ఎంతో ఉందని గుంటూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎన్ మోహన్ రావు అన్నారు. బుధవారం. ప్రత్తిపాడు మండలంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతులకు ఏపిఏఐఎంఎస్ 2.వా యాప్ ద్వారా ఎరువుల సరఫరాపై మండల స్థాయి, గ్రామ స్థాయి టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్ ను దృష్టిలో ఉంచుకొని రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామని సూచించారు.ఎరువులు నిల్వలు పంపిణీ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షిస్తూ అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నం పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు . యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ఎరువులు అందలేదని ఏ ఒక్క రైతు నుండి ఫిర్యాదు వచ్చిన సంబంధిత గ్రామస్థాయి సిబ్బంది పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, నీటి వినియోగ సామర్థ్య పెంపు, రైతులకు సాంకేతిక సలహాలు అందించే చర్యలను వేగవంతం చేయాలన్నారు.అదేవిధంగా ప్రకృతి వ్యవసాయం చేపట్టడం వలన వాతావరణ ప్రభావానికి తట్టుకునే అవకాశం ఉంటుందని తెలియజేశారు. పంట పెట్టుబడి ఖర్చు తగ్గించి, రైతు ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు ఆచార్య యన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేయడానికి కృషి చేస్తామన్నారు.సంప్రదాయ పంటలతో పాటు అధిక లాభదాయక పంటలు,విలువ ఆధారిత వ్యవసాయ విధానాలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కె. శివపార్వతి, ఏఓ. షేక్ సుగుణ బేగం, ఎస్ఐ నరహరి, మండలం లోని ఫర్టిలైజర్ డీలర్లు, వి.ఆర్. ఓ లు, మహిళా పోలీసులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు..

## నకిలీ విత్తనాలతో... మోసపోవద్దూ....

గురజాల,కాకతీయ ప్రతినిధి, జూన్ 17

రైతులారా ప్రత్తి, మిర్చి విత్తనాలు కొనుగోలు చేసే ముందు రైతులు జర జాగ్రత్తగా ఉండాలి. పల్నాడు ప్రాంతమైన గురజాల, రెంటచింతల, కారంపూడి లో ఎక్కువ శాతం రైతులు ప్రతి మిర్చి పంటలను సాగు చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో రైతులు విత్తనాలు కొనుగోలు చేసేందుకు సిద్ధపడుతున్న వేళ విత్తనాలలో అసలు, నకిలీ వేవో తెలియని పరిస్థితుల్లో కొంతమంది రైతులు ఉన్నారు. కొన్ని షాపులకు నకిలీ విత్తనాలు ముందుగానే వచ్చేసాయి... రైతులారా..ప్రత్తి, మిర్చి విత్తనాలు కొనేటప్పుడు .. ఆలోచించి విత్తనాలు కొనండి. వ్యాపారస్తుల మాటల నమ్మి.. అధిక దిగుబడి వస్తాయని ఆశ చూపించడంతో, నమ్మి మోసపోద్దు. వ్యాపారస్తులు రైతులను నమ్మించి.. నకిలీ విత్తనాలను కట్ట పెడతారు. ఆరు కాలం కష్టపడి.. లక్షల్లో పెట్టుబడి పెట్టి అప్పుల పాలై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని కుటుంబాలను రోడ్డు పాలు చేయొద్దు. గురజాల రెంటచింతల,కారంపూడి విత్తనాలు దుకాణం లో రెండు తెలుగు రాష్ట్రాల్లో నుండి వచ్చి.. రైతులు మరి విత్తనాలు కొంటారు. ప్రతి ఏట ఎంతోమంది రైతులు నకిలీ విత్తనాలు కొని.. మోసపోయిన సంఘటనలు మరెన్నో ఉన్నాయి. రుతుపవనాలు సమీపిస్తున్న తరుణంలో వర్షాలు పడుతున్న వేళ రైతులు పొలాలను బాగు చేసుకుంటూ విత్తనాలు విత్తెందుకు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలో విత్తనాల షాపులపై అధికారులు తనిఖీలు చేయవలసిన అవసరము ఉన్నది. విత్తనాలు షాపులపై అధికారుల తనిఖీలు శూన్యం అనే విమర్శలు కూడా వచ్చి పడుతున్నాయి.కొన్ని విత్తనాల షాపులు యాజమాన్యాలు అధికారులకు తాయిలాలు ఇచ్చినట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది.. గతం లో బొల్లాపల్లి మండలానికి చెందిన పలువురు రైతులు ఈ మండలాలలో కొని షాపుల్లో నకిలీ విత్తనాలు కొని .మోసపోయిన సంఘటనలు కూడా జరిగాయి. కేవలం అమాయకులైన రైతులనే.. టార్గెట్ గా చేసుకొని నకిలీ విత్తనాలు కట్టబెడుతున్నారని.. ప్రచారం జరుగుతుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని కొత్త మిరప విత్తనాలు రకాలు కూడా ... రెంటచింతల కారంపూడి, లో దొరుకుతాయి. కాబట్టి రైతులందరూ పత్తి,మిరప విత్తనాలు కొనేటప్పుడు.. ఆలోచించి ప్యాకెట్లపై లాట్ నెంబర్, క్రమసంఖ్య, బార్ కోడ్,ఐఎస్ఐ మార్క్, కంపెనీ యొక్క వివరాలు, చూసుకుని.. అడిగి తెలుసుకుని విత్తనాలు కొనుగోలు చెయ్యాలి అదేవిధంగా మార్కెట్లో నకిలీ విత్తనాలు అరికట్టేందుకు సంబంధిత శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి నకిలీ విత్తనాలను రాకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుచున్నారు.

## గుడివాడ అమర్నాథ్ మహిళలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని

### - తెలుగుదేశం మహిళా నాయకులు డిమాండ్



తెనాలి (కాకతీయ ప్రతినిధి) జూన్ 17: రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితపై వైకాపా నాయకుడు గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని. మహిళలందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ అధికార ప్రతినిధి పరుచూరి రమ్య డిమాండ్ చేశారు. వైసీపీ నేత అమర్నాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మహిళా నేతలు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరుచూరి రమ్య మాట్లాడుతూ వైసీపీలో మహిళలకు ఏ మాత్రం విలువ ఇవ్వరు అనేది గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యలను బట్టి అర్థమవుతుందని, తక్షణమే మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో రాష్ట్ర మహిళలు అమర్నాద్ ని బయట తిరగనివ్వరని హెచ్చరించారు. కార్యక్రమంలో కిలారి అనిత, దేవినేని రమాదేవి,యనమల అనిత, గుమ్మడి భావన, దివి అనిత, కామేశ్వరి, వాసిరెడ్డి సులోచన, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ప్రైవేటు స్కూలు నిర్వహిస్తే ప్రభుత్వ పరమైన చర్యలు తప్పవు

పిడుగురాళ్ల (కాకతీయ ప్రతినిధి) జూన్ 17



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలంలోని అన్నిప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ గుర్తింపులేకుండా నిర్వహించరాదని అంతేకాకుండా ఏ తరగతి వరకు అనుమతి పొందారో ఆ తరగతి వరకే విద్యార్థులను తమ తమ పాఠశాలలో చేర్చుకోవాలనిఉదాహరణకు మాంటిసోరి స్కూల్ 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు అనుమతి తీసుకొని ఉన్నారు 8వ తరగతి వరకే అడ్మిషన్ తీసుకోవాలి, వేద పబ్లిక్ స్కూల్, విద్యార్థి గ్లోబల్ మరియు విజయశ్రీ స్కూల్స్ ఒకటి నుండి ఏడో తరగతి వరకే మాత్రమేగుర్తింపు కలిగి ఉన్నారు . ఆ తరగతల వరకు మాత్రమే విద్యార్థులను తమ తమ పాఠశాలలో నమోదు చేసుకోవాలి ఆ తరగతులకు మించి నిబంధనలకు విరుద్ధముగా తరగతు నిర్వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగునని పిడుగురాళ్ల మండల విద్యాశాఖాధికారులు శ్రీ ఎండి ఖాసీం మరియు వై శ్రీనివాసరావు తెలియజేశారు తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించే క్రమంలో ప్రభుత్వ నిబంధన మేరకు ఆ పాఠశాల గుర్తింపుఉన్నదో లేదో, ఏ తరగతి వరకు ప్రభుత్వ గుర్తింపు ఉన్నదో తెలుసుకొని తమ పిల్లలను ఆ పాఠశాలలో చేర్పించాలని ఈ విషయంలో ఏమైనా తేడా ఉంటే మీరే బాధ్యులని వారు అన్నారు .ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని వారు అన్నారు.

## రైతులు సేంద్రియ ఎరువులు వాడండి

చెరుకుపల్లి. ( కాకతీయ ప్రతినిధి). జూన్ 17

భూమిలోని పోషకాల సమతుల్యతను కాపాడుకోవడానికి సేంద్రియ ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్ అన్నారు. బుధవారం మండలంలోని కనగాల గ్రామంలో కేత్



బచావో అభయాన్ - పొలం సంరక్షణ ప్రచార కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆత్మ గుంటూరు వారి సహకారంతో నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట జీవన ఎరువులు వినియోగించడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చున్నారు. భూసార పరీక్షల ద్వారా అధిక దిగుబడి సాధించుకోవచ్చు అన్నారు. కౌలు రైతులు అందరూ కౌలు రైతు కార్డులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ కె. అచ్యుత రాజు వ్యవసాయ విస్తీర్ణ అధికారి బిడి రామకృష్ణ టి అఖిల వి ఏ ఏ సిహెచ్ సుమ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మాచవరంలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి సమీక్ష

### డోర్ టు డోర్ వెరిఫికేషన్ వేగవంతం చేయాలని ఎమ్మార్వో నాగమల్లేశ్వరరావు సూచన

మాచవరం, జూన్ 17 (కాకతీయ ప్రతినిధి):

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR-Special Intensive Revision) కార్యక్రమాన్ని నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మాచవరం మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) నాగమల్లేశ్వరరావు సూచించారు. బుధవారం మండలంలో నిర్వహిస్తున్న ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం పురోగతిని ఆయన సమీక్షించారు.
మాచవరం మండల పరిధిలో ఇప్పటివరకు డోర్ టు డోర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా మొత్తం 1,512 ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, 29 ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు తెలిపారు.
ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ, బూత్ లెవల్ అధికారులు తమ పరిధిలోని బూత్ లెవల్ ఏజెంట్లు తో సమన్వయం చేసుకుని భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.
ప్రతి కుటుంబాన్ని తప్పనిసరిగా సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరించాలని, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిస్థాయిలో నింపేలా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు.
అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి వారి వివరాలను సరిచూడడంలో దీూాల సహకారం తీసుకోవాలని, పూర్తయిన ఫారాలను వెంటనే డిజిటైజేషన్‌కు పంపించి ప్రతిరోజూ పురోగతి నివేదికలు సమర్పించాలని తెలిపారు.
ఎన్నికల కార్యక్రమం అత్యంత ప్రాధాన్యత కలిగినదని, నిర్దేశిత గడువులోగా 100 శాతం వెరిఫికేషన్ మరియు డిజిటైజేషన్ పూర్తి చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మార్వో నాగమల్లేశ్వరరావు ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా దీూాలు, దీూాలు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కాకతీయ
కడప

## కడప జిల్లా మైదుకూరు స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గా డాక్టర్ పసుపులేటి శంకర్

నందలూరు (కాకతీయ ప్రతినిధి) జూన్ 17: కడప జిల్లా మైదుకూరు స్పెషల్ జుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గా డాక్టర్ పసుపులేటి శంకర్.ను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ఆదేశాలు జారిచేసింది. ప్రభుత్వము జారీ చేసిన ప్రభుత్వ ఆదేశము 781 సంఖ్య ప్రకారం కడప 1 స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గా నాగరాజు కడప రైల్వేస్ మేజిస్ట్రేట్ గా శ్రీనివాసులుగుప్త,జమ్మలమడుగు మేజిస్ట్రేట్ గాశ్రీనివాసులు, రాజంపేట మేజిస్ట్రేట్ గా వీర వరప్రసాద్, ప్రొద్దుటూరు మేజిస్ట్రేట్ గా లక్ష్మయ్య లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ పసుపులేటి శంకర్ గతంలో రాజంపేట స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గా పని చేశారు.



# ఏలూరు జిల్లాలో భారీగా గంజాయి పట్టివేత

**ఏలూరులో 32 కిలోల గంజాయి స్వాధీనం -- నలుగురు అరెస్ట్**

**ఒడిశా నుంచి శ్రీకాళహస్తికి గంజాయి రవాణా భగ్నం**

**పోలీసుల తనిఖీల్లో భారీ పట్టివేత -- కారు, బైక్ స్వాధీనం**

**గంజాయి అక్రమ రవాణాపై ఏలూరు పోలీసుల ఉక్కుపాదం**

**EAGLE బృందం సంయుక్త ఆపరేషన్ విజయవంతం**




ఏలూరు, (కాకతీయ ప్రతినిధి) జూన్ 17:
ఏలూరు జిల్లాలో పోలీసులు నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీలలో భారీగా గంజాయి పట్టుబడింది. ఏలూరు III టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, జూూ+జూ బృందం సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో 32 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బుధవారం ఉదయం ఏలూరు--విజయవాడ జాతీయ రహదారిపై సీతాపురం గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా వెళ్తున్న AP40 BR 9084 నంబరు గల మారుతి బాలెనో కారును, దానికి ఎస్కార్ట్‌గా వెళ్తున్న AP39 DW 6944 నంబరు గల హీరో గ్లామర్ మోటార్ సైకిల్‌ను ఆపి తనిఖీ చేశారు. తనిఖీల్లో కారులోని డిక్కీలో 18 ప్యాకెట్లలో మొత్తం 32 కిలోల గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు, మోటార్ సైకిల్‌పై ఉన్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు ఒడిశా రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేసి, చింతపల్లి--రాజమహేంద్రవరం మార్గం ద్వారా శ్రీకాళహస్తికి తరలిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు.
అరెస్టు చేసిన వారిలో బోనంగి నానాజీ, మర్లపూడి దుర్గాప్రసాద్, మురుకుట్టి ఈశ్వర సాయి సతీష్, బోనంగి సత్యనారాయణ ఉన్నారు. నిందితుల వద్ద నుంచి 32 కిలోల గంజాయి, ఒక మారుతి బాలెనో కారు, ఒక హీరో గ్లామర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.
పోలీసుల విచారణలో కొందరు నిందితులపై గతంలో కూడా NDPS చట్టం కింద కేసులు నమోదైనట్లు వెలుగులోకి వచ్చింది. ముఖ్యంగా మురుకుట్టి ఈశ్వర సాయి సతీష్‌పై అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో మూడు గంజాయి అక్రమ రవాణా కేసులు నమోదై ఉన్నట్లు అధికారులు తెలిపారు.
నిందితుల పూర్తి నేర చరిత్ర, గంజాయి సరఫరా నెట్‌వర్క్, కొనుగోలు--విక్రయాలకు సంబంధించిన ఇతర వ్యక్తుల ప్రమేయంపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు చేపడతామని హెచ్చరించారు.
గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు లేదా EAGLE బృందానికి సమాచారం అందించాలని ఏలూరు జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సహాయం

**- ఆపద అంటే ఆదుకునే అపన్న హస్తంలిసామాజిక సేవలో తనదైన ముద్ర వేస్తున్న సేవామూర్తి ఎంపి మేడా రఘునాథ రెడ్డి**

నందలూరు(కాకతీయ ప్రతినిధి)జూన్ 17:



మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రేగల లక్ష్మికి రెండు కిడ్నీలు పాడైపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. భర్త రేగల చంద్ర కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి క్షీణించడంతో మండల కన్వీనర్ సిద్ధవరం గోపిరెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి ఈ విషయాన్ని రాజ్యసభ సభ్యులు (ఎంపీ) మేడా రఘునాథరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో సమస్యను విన్న రాజ్యసభ సభ్యులు రేగల లక్ష్మికి ప్రతి నెల పెన్షన్ వచ్చే విధంగా ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. పెన్షన్ వచ్చేంత వరకు ప్రతి నెల 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం తన సొంత నిధుల నుంచి ఏర్పాటు చేస్తానని తెలిపారు. అందుకు ముందుగానే 30 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. దీంతో ఆ దంపతులు మేడ రఘునాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఇటీవల బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నందలూరు గ్రామానికి చెందిన యువకుడు బోనాసి వంశి పరిస్థితి విషమించడంతో రాజ్యసభ సభ్యులు ఎం.పి మేడా రఘునాథ రెడ్డి .లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని బెంగళూరు లోని మణిపాల్ హాస్పిటల్ కు అందించి తన గొప్ప మనసును చాటుకున్నారు. దీంతో బోనాసి వంశీ తండ్రి బోనాసి కిషోర్ ఎంపీ మేడా రఘునాథరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ సిద్ధవరం గోపిరెడ్డి, గుండు మల్లికార్జున రెడ్డి లు మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ, పేదలకు అండగా నిలుస్తూ, విద్య , వైద్యం, దేవాలయాలు , సామాజిక సేవలో తనదైన ముద్ర వేస్తున్న సేవామూర్తి మన ఎంపి మేడా రఘునాథ రెడ్డి అని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లయిన కిడ్నీ బాధితురాలు పెన్షన్ కోసం అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిడ్నీ బాధితురాలకి పెన్షన్ వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు.

## నందలూరులో సర్ ఏన్యూమరేషన్ పారాల పంపిణీ

నందలూరు ( కాకతీయ ప్రతినిధి )జూన్ 17:



నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పోలింగ్ స్టేషన్ 97, 98 బూత్ పరిధిలోని ఎన్యుమరేషన్ ఫారం ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిఎల్ఏ విశ్వనాథరెడ్డి. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ బిఎల్ఏ ఉమ్మడిశెట్టి సుధాకర్ ,పల్లె గ్రీష్మంత్ రెడ్డి ,అనుదీప్ జై సింహ, నడి వీధి. సుధాకర్ లు పాల్గొన్నారు.

## ఏలూరు జిల్లాలో ఘనంగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదిన వేడుకలు




ఏలూరు జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో కార్మిక శాఖ మంత్రి నాాఖీ వ్యవస్థాపకులువాసంశెట్టి సుభాష్ గారి జన్మదిన వేడుకలు ప్రతి నియోజకవర్గంలో శెట్టిబలిజ కుటుంబ సభ్యులు నాయకులు కార్యకర్తలు అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పెన్నులు పుస్తకాలు పంపిణీ, వృద్ధాశ్రమాల్లో భోజన ఏర్పాట్లు, రక్తదాన శిబిరాలు ఇలాంటి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. శెట్టిబలిజ నాయకులు దొమ్మేటి సత్యనారాయణ మాట్లాడుతూ ఈరోజు శెట్టిబలిజ కుటుంబ సభ్యులకు నేనున్నా అంటూ నాాఖీ అనే టీం ని ఏర్పాటు చేసి అనేక మందికి ప్రాణదాతగా





నిలిచి అనేకమందికి లక్షల రూపాయలు ఆపదలో ఆదుకున్న వ్యక్తి మన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అత్యంత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం, ముప్పినవారిగూడెం, చింతలపూడి, పోలవరం, కొయ్యలగూడెం ఇలా ఏలూరు జిల్లాలో ప్రతి మండలంలో నియోజకవర్గంలో వేలాదిమంది నాయకులు కార్యకర్తలు పాల్గొని అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు.

## ఎరువులు పంపిణీ



నందలూరు (కాకతీయ ప్రతినిధి)జూన్ 17: కడపఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం. ఆధ్వర్యంలో నందలూరు మండలం పొత్తపి గ్రామంలో బుధవారం కేత్ బచావో అభియాన్ కార్యక్రమంనిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిబిటి బయోటెక్ కిసాన్ హబ్ ద్వారా జీవన ఎరువులు పంపిణీ చేయడం జరిగింది. డి.డి.ఏ రమేష్ మాట్లాడుతు విచక్షన రహిత ఎరువుల వినియోగం వల్ల భూకాలుష్యశ్ జరగడమే కాకుండా నేల చౌడుబారి ఉత్పాదక శక్తి తగ్గి పోతుందని ఆలాగే పంట ఖర్చు పెరిగి పోతుందని అయన తెలిపారు. కాంప్లెక్స్ ఎరువులను ఆఖరి దుక్కిలో వేసుకోవాలని, యూరియా సిఫరాస్సు చెసినదశలలో వేయలని అయన తెలిపారు. మండల వ్యవసాయ అధికారి మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రస్తుతం పరిస్థితుల్లో ఉన్న ఎరువుల కొరత గురించి అలాగే ప్రభుత్వం ద్వారా రైతులకుఅందజేయనున్న ఎరువుల గురించి, వివిధ ప్రభుత్వ పథకాల గురించి , ఏపీ ఏఐఎంఎస్ ఆప్ గురించి తెలియజేశారు., ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ కృష్ణ



ప్రియమాట్లాడుతూ విచక్షణాయుతంగా రసాయనక ఎరువులను వాడడం వల్ల భూసమతుల్యత దెబ్బతిని పంట ఉత్పాదకత తగ్గిపోతుంది అని, కేవలం రసాయన ఎరువుల ద్వారా పంటను పండిస్తున్న రైతులు నేల పంట ఉత్పాదకపై హానికరమైన ప్రభావాన్ని చూపుతూ పోషకాల సమతుల్యతలోపించడం జరుగుతున్నది. ప్రస్తుత సేంద్రియ , ప్రకృతి వ్యవసాయంలో వాడే వివిధ సేంద్రియ ఎరువులలో జీవన ఎరువులు వాడకం ద్వారా తక్కువ ఖర్చుతో భూమి సారవంతం చేయవచ్చునని తెలిపారు. ఉద్యాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ .మానస మాట్లాడుతూ జీవన ఎరువుల ఆవశ్యకత , వినియోగం పై అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారిశ్రీమతి సుచిత్ర, జిల్లా వనరుల కేంద్రం, కడప వారు భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టాలని తెలియజేశారు అలాగే మట్టి నమూనా సేకరణ పద్ధతుల గురించి నమూనా విశ్లేషణ పత్రంలో పొందుపరిచే అంశాల గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం దీవీ . ఆత్మ. భరత్ గ్రామ 40 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

## నాగిరెడ్డి పల్లెలో ఎస్ ఐ ఆర్ ఏన్యూమరేషన్ పారాల ప్రక్రియ

నందలూరు( కాకతీయ ప్రతినిధి) జూన్ 17



నందలూరుమండలంలోని నాగిరెడ్డి పల్లె గ్రామపంచాయతీ పరిధిలో గల డీఎంసీరోడ్డుబూత్ నెంబర్ 100 లో ఎన్యుమరేషన్ పారాల తనిఖీ కార్యక్రమ నిర్వహించారు ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ రోజా నందలూరు రైల్వే కన్సల్టేటివ్ మెంబర్ రాచూరి మురళి, ఎం.పి రావు, జయ కుమార్, ఏలుమలై, జుల్ఫికర్, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది

**- ప్రధాన రహదారిపై ఘనంగా స్వచ్ఛ పథం కార్యక్రమం**

నల్లమాడ( కాకతీయ ప్రతినిధి )జూన్ 17



మండలంలో ప్రధాన దారిపై ఉన్న బిసి బాలుర వసతి గృహం సమీపంలో బుధవారం స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి అంజినప్ప, నల్లమాడ ప్రత్యేక అధికారి మునాఫ్ , హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ నాగభూషణం నాయుడు, పంచాయతీ కార్యదర్శి దాదా సాహెబ్ పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బలమైన పునాది అని, ప్రతి పౌరుడు స్వచ్ఛతను తన బాధ్యతగా భావించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.స్వచ్ఛ పథం కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్ మైలే శంకర్, పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛంద కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రధాన రహదారిపై చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రపరిచారు. ప్రజలందరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.

## విలేఖరి బశెట్టి గంగులప్పకు ఘన సన్మానం

**- సత్యసాయి జిల్లా సూర్య దినపత్రిక ఇంచార్జ్ గా బశెట్టి గంగులప్ప........సన్మానించిన టిడిపి నాయకులు**
**- బశెట్టి గంగులప్ప రాజీలేని పోరాటమే ఇంచార్జ్ కావడానికి తొలిమెట్టు..... హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు**

నల్లమాడ (కాకతీయ ప్రతినిధి )జూన్ 17 : నల్లమాడ మండల కేంద్రం లో సూర్య దినపత్రిక విలేఖరి గా విధులు నిర్వహిస్తున్న బశెట్టి గంగులప్ప శ్రీ సత్య సాయి జిల్లా సూర్య దినపత్రిక ఇన్చార్జిగా నియమించడంతో తెలుగుదేశం నాయకులు, తన నివాసం లో తెలుగుదేశం నాయకులు సూర్య విలేఖరి బశెట్టి గంగులప్ప ను పూలమాలలు వేసి ,శాలవాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు మాట్లాడుతూ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి ప్రాంతానికి చెందిన నేటి దినపత్రిక



"సూర్య" ఇన్‌చార్జిగా శ్రీ బసెట్టి గంగులప్ప ను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామనీ. జర్నలిజం రంగంలో వారి అనుభవం, నిబద్ధత, సేవాభావం దృష్ట్యా ఈ బాధ్యతలకు వారు పూర్తిస్థాయిలో సంస్థ కు న్యాయం చేస్తారని విశ్వసిస్తూ పుట్టపర్తి ప్రాంత ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజలకు ఉపయోగపడే వార్తలను అందిస్తూ, సూర్య దినపత్రిక అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నామని, నూతన బాధ్యతలు చేపట్టిన శ్రీ బసెట్టి గంగులప్ప హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారి పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామనీ వారు ఈ సందర్భంగా తెలియజేసారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి పుట్ల రవీంద్ర, అరవింద్ బాబు, డైరెక్టర్ నాగే నాయక్, ఎక్స్ డైరెక్టర్ ఎన్ నరసింహులు, మైలే రామచంద్ర,డీలర్ వై నరసింహులు, జనసేన మండల కన్వీనర్ మహేష్, పాల నరసింహులు, ఆటో భాష, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛరథం ప్రారంభించిన ఎమ్మెల్యే

ఉప్పలగుప్తం (కాకతీయ ప్రతినిధి) జూన్ 17:
ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారంస్వచ్ఛ రథం లను అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు ప్రారంభించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని దృఢ సంకల్పంతో ప్రభుత్వం పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు



## అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం:ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం (కాకతీయ జిల్లా ప్రతినిధి)
గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పొలిటికల్ అరాచకాలకు, ఉన్మాద చర్యలకు బలైన అమాయక బాలుడు అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు స్పష్టం చేశారు. అమలాపురం పట్టణంలో మంగళవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే , కూటమి నాయకులు కలిసి సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్ఆర్సీపీ అరాచకాలకు వ్యతిరేకంగా, అమర్నాథ్ గౌడ్‌కు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ చేతుల్లో కొవ్వొత్తులు పట్టుకుని భారీ నిరసన



కార్యక్రమం చేపట్టారు. నాడు తన సోదరి వేధింపుల నుండి కాపాడుకోబోయిన చిన్నారి అమర్నాథ్ గౌడ్‌ను వైఎస్ఆర్సీపీకి చెందిన అసాంఘిక శక్తులు అత్యంత అమానుషంగా దహనం చేసిన ఉదంతాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్నా, నేడు అధికారంలో ఉన్నా బాధితులకు త్వరితగతిన పూర్తి న్యాయం చేయడమే తమ ప్రధాన ధ్యేయమని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ ఐదేళ్ల హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, నాటి అధికార పార్టీ నేతల అండ చూసుకుని కొందరు ఉన్మాదుల్లా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమర్నాథ్ గౌడ్ లాంటి ఎంతోమంది అమాయక దళిత, వెనుకబడిన వర్గాల పిల్లలు ఆనాటి అరాచక పాలనకు బలయ్యారని మండిపడ్డారు. నాడు బాధితులను పరామర్శించడానికి వెళ్లిన ప్రతిపక్ష నాయకులను అడ్డుకున్న నాటి పాలకులు, నిందితులను వెనకేసుకు రావడానికే ప్రాధాన్యత ఇచ్చారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఇలాంటి ఫ్యాక్షన్, ఉన్మాద రాజకీయాలకు స్వస్తి పలికిందని ఎమ్మెల్యే తెలిపారు. చట్టాన్ని అతిక్రమించే వారు ఏ పార్టీకి చెందిన వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మహిళలు, పిల్లల రక్షణకు తమ ప్రభుత్వం అత్యంత పెద్దపీట వేస్తోందని, అమర్నాథ్ గౌడ్ కేసులోని నిందితులకు చట్టప్రకారం కఠినాతికఠినమైన శిక్షలు పడేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు కూటమి శ్రేణులు విశ్రమించబోవని, అమలాపురం నియోజకవర్గంలో కూడా ఎటువంటి అసాంఘిక శక్తులను సహించేది లేదని హెచ్చరించారు. ఈ కొవ్వొత్తుల నిరసన కార్యక్రమంలో స్థానిక కూటమి పార్టీల ముఖ్య నాయకులు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు, అశేష కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు పరిశీలించిన ఎంపీడీవో



కాట్రేనికోన (కాకతీయ ప్రతినిధి) జూన్ 17:
కాట్రేనికోన మండలం దొంతికుర్రు, పల్లం గ్రామ పంచాయతీ ల్లో జరుగుతున్న వీబీజీ రామ్ జీ పనులను ఎంపీడీఓ బి. రాజేశ్వర్ రావుబుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు .కొంతమంది ఉపాధిశ్రామికులకు వేతనం జాప్యం జరుగుతుందన్న విషయంపై తక్షణ చర్యలు చూపి వేతనం సమకూరే విధంగా చర్యలు చూపాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో మస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రాథమిక చికిత్సకి సంబందించిన కిట్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. వడదెబ్బకు గురి కాకుండా ఉపాధి శ్రామికులు తగు జాగ్రత్తలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు.

## పంట కాలువలోకి పల్టీ కొట్టిన ఆటో

కాట్రేనికోన (కాకతీయ ప్రతినిధి) జూన్ 17:



కాట్రేనికోన మండలం కుండలేశ్వరం గ్రామానికి సమీపంలో బుధవారం ఉదయం ఆటో పంట కాలువలోకి పల్టీ కాలాడి చిన్న అనే ఆటో డ్రైవర్ తన ఆటోలో పొర గ్రామం నుండి తాళ్లరేవు వెళు తుండగా ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలోకి పల్టీ కొట్టింది.కాలువలో నీరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్వల్ప గాయాలతో బాధితుడు బయటపడ్డాడు.

## నేరాలపై పోలీసుల అవగాహన సదస్సు

అమలాపురం (కాకతీయ జిల్లా ప్రతినిధి)
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లా ఎస్పీరాహుల్ మీనా ఐపిఎస్ ఆదేశాల మేరకు అమలాపురం పట్టణం నందు బుధవారంఏ ఎస్ ఎన్ కాలేజీలో మహిళలపై జరుగు నేరాలు , రోడ్డు ప్రమాదాలు, సైబర్



నేరాలు జరుగు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పట్టణ సీఐ వీరబాబు వివరించారు. కళాశాలలో ర్యాగింగ్ ఏదైనా జరిగితే Dail 112 కి సమాచారం అందివ్వాలని, మీ ప్రాంతాలలో గంజాయి గురించి ఏ విధంగా సమాచారం తెలిసినా సమాచారం ఇవ్వాలి అనే అంశాలపై ఏ ఎస్ ఎన్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పట్టణ ఎస్ఐ ఎన్ కిషోర్ బాబు, కళాశాల ప్రిన్సిపల్-రూమా మహా క్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

## మురమళ్ళ లో టిడిపి సమావేశం

ఐ పోలవరం (కాకతీయ ప్రతినిధి) జూన్ 17:
ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన బుధవారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం మురమళ్లలోని శాసనసభ్యుల కార్యాలయంలో జరిగింది.
ఈ సమావేశానికి నియోజకవర్గ పరిశీలకులు ,టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీమతి సుంకర పావని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి మాజీ శాసనసభ్యులు చెల్లి వివేకానంద అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఇన్‌చార్జీలు, నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు మండల స్థాయి, క్లస్టర్ల నుండి వచ్చిన తీర్మానాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులతో విడివిడిగా సమావేశమై ఆయా మండలాల సమస్యలు, పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలు మరియు ప్రజా సమస్యలపై చర్చించారు. అలాగే మండలాలు, క్లస్టర్ల నుండి వచ్చిన తీర్మానాలను క్రోడీకరించి పార్టీ రాష్ట్ర కార్యాలయానికి పంపించారు. గృహ నిర్మాణ పథకం, చంద్రన్న బీమా తదితర ప్రజా



సంక్షేమ పథకాలను త్వరితగతిన అమలు చేయాలని కోరుతూ పలు తీర్మానాలను ఆమోదించి పార్టీ అధిష్టానానికి పంపినట్లు తెలిపారు.

## కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారిగా జి. సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీపీటిడి) డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారిగా నియమితులైన జి. సత్యనారాయణ బుధవారం తన పదవీ బాధ్యతలను స్వీకరించారు.ఇంతకుముందు విజయనగరం జిల్లాలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఆపరేషన్స్ అండ్ కమర్షియల్)గా సేవలందించిన ఆయనకు రవాణా రంగంలో విశేష అనుభవం ఉంది. ప్రజలకు మరింత మెరుగైన రవాణా సేవలు అందించడంతో పాటు, సంస్థ ఆదాయ వృద్ధి, సేవల నాణ్యత పెంపు, ప్రయాణికుల సౌకర్యాల అభివృద్ధికి కృషి చేస్తారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.కోనసీమ జిల్లాలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించడంలో ఆయన నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు.

## బస్టాండ్ ప్రారంభించిన వంగవీటి రాధా

కాట్రేనికోన (కాకతీయ ప్రతినిధి) జూన్ 17: పల్లంకుర్లో భూపతి రాజు శివకుమార్ వర్మ ( గబ్బర్ సింగ్ ) ఆర్థిక సహాయంతో నూతనంగా నిర్మించిన బస్టాండ్ ను వంగవీటి రాధా బుధవారం ప్రారంభించారు. గ్రామ ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో గబ్బర్ సింగ్ చొరవ అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ముందుగా పల్లంకుర్రు బస్టాండ్ లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులుపూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, తాడి నరసింహారావు, నాగిడి నాగేశ్వరరావు, కంచు స్తంభం కృష్ణ ,తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచ రక్తదాతల దినోత్సవ వేడుకలో భాగంగా...

## రక్తదాతలకు చిరు జ్ఞాపకం రజనీ ట్రస్ట్



ధర్మవరం(కాకతీయ టౌన్ ప్రతినిధి) జూన్ 17 : పట్టణానికి చెందిన కన్నా వెంకటేష్ మాట్లాడుతూ రజిని ట్రస్ట్ రెండో వార్షికోత్సవం సందర్భంగా రక్త బంధం ట్రస్ట్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణ ప్రజలు సహకారంతో ముఖ్య అతిథులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సీనియర్ సభ్యులు, రిటైర్డ్ అంధత్వ



నివారణ అధికారి డాక్టర్ సంకరపు నరసింహులు, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ నేషనల్ లీగల్ అడ్వైసర్ అండ్ వైస్ ప్రెసిడెంట్ సుమలత, తాడిపత్రి సేవా బ్లడ్ బ్యాంక్ వారి సిబ్బంది సమక్షంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో దాదాపు 29 మంది రక్తదానం చేసి విజయవంతం చేయడం జరిగిందని తెలియజేశారు అలాగే రక్తదాతలకు జ్ఞాపకం ఇవ్వడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సమాజ సేవకులు కేత లోకేష్ చంద్రశేఖర్ రెడ్డి, జయ ప్రకాష్, మహేష్, వీరప్ప తదితరులు పాల్గొన్నారు

## శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమం నందు జిల్లా న్యాయ అధికార సంస్థ బృందం




అమడగూరు కాకతీయ ప్రతినిధి జూన్ 17 : "అనంతపురం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి శ్రీ ఎన్ రాజశేఖర్, వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి అవగాహన సదస్సులో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎన్ రాజశేఖర్ మాట్లాడుతూ వయోవృద్ధులను గౌరవంగా ఏ రకమైనటువంటి వివక్షకు నిర్లక్ష్యానికి తావు లేకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రతి అందరిపై ఉందని తెలియజేశారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టం వివరిస్తూ వాటిలోని రక్షణలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహేష్, న్యాయవాది, లీగల్ ఎయిడ్ డిఫెన్సు కౌన్సెల్, విజయనగర లా కాలేజీ విద్యార్థులు, అనంతపురము జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సిబ్బంది ప్రభాకర్, ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలలు పాత పద్ధతిలోనే కొనసాగించాలి




ఏలూరు జిల్లా లంకపాకల (కోయిదా) గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను మూడు నుండి పదవ తరగతి వరకు పాత పద్ధతిలోనే యధావిధిగా కొనసాగించాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలలను రేషనలైజేషన్ పేరుతో కుదించవద్దు అని స్థానిక అలివేరు సర్పంచ్ కారం లక్ష్మి, ఉపసర్పంచ్ చింతల కృష్ణ చేతులతో స్కూల్ గేట్ కి తాళం వేసి, ఉపాధ్యాయులను లోపలికి వెళ్ళనివ్వకుండా గేటు ముందు విద్యార్థుల తల్లిదండ్రులతో గ్రామస్తులతో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి బన్నె వినోద్, ఏ ఐ కె ఎమ్ ఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు విద్యను దూరం చేయడానికి రేషనలైజేషన్



పేరుతో పాఠశాలలను కుదించివేయడం అత్యంత దుర్మార్గపు చర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ అధికారులు తీసుకొచ్చిన అస్తవ్యస్త విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిర్ణయాల వలన గిరిజనులు విద్యార్థులు హాస్టల్ సదుపాయాలను, హక్కులను,ఉద్యోగ అవకాశాలను కూడా కోల్పోతారన్నారు. కావున విద్యా సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్న సమయాన్ని దృష్టిలో ఉంచుకొని, గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం పాత పద్ధతిలోనే లంకపాకల ఆశ్రమ పాఠశాలను మరియు ఇతర పాఠశాలలు అన్నింటిని పాత పద్ధతి మూడు నుండి పదవ తరగతి వరకు కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచ్ కారం లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు అన్యాయం చేసే విధానాలు తీసుకురావడం సరైనది కాదని విమర్శించారు. గిరిజన విద్యార్థులు చదువుకోవడానికి అభివృద్ధి చెందడానికి దగ్గరగా ఉన్న పాఠశాలలలో అన్ని



తరగతులను నిర్వహించాలని డిమాండ్ చేశారు. అంతర్వేది గూడెం ఎంపీటీసీ కొవ్వాసు గోవిందరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గిరిజనులు చదువుకోవడానికి కోసం స్థానికంగా గ్రామాలలో గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనివలన విద్యార్థులు చదువుకుని సమాజం పట్ల అవగాహన, జ్ఞానాన్ని, ఉద్యోగ అవకాశాలు పొందారున్నారు. గిరిజనులు చదువుకునీ అభివృద్ధి చెందడానికి ప్రోత్సహించకుండా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నారని రేషన్లైజేషన్ పేరుతో పాఠశాలల్లో ఉన్న తరగతులను కుదించి వేయడం హేయమైన చర్య అని లంక పాకల పాఠశాలను మూడు నుండి పదవ తరగతి వరకు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరకల పద్మ, గోగుల చంటి, గోగుల కళ్యాణి, చింతల చెల్లమ్మ, కరకాల సుశీల, కెచ్చేల రామ దేవి, కరకాల చిన్నారెడ్డి,కెచ్చల బాలకృష్ణారెడ్డి, గురుగుంట్ల గోపి, కరకాల చంద్రశేఖర్ రెడ్డి, కరకాల నడిపి రాజు, చింతల మహేష్, కరకాల సుధాకర్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులను నెట్టునిలువుగా మోసం చేశాయి

తాడిపత్రి, జూన్ 17 (కాకతీయ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులను నెట్టునిలువుగా మోసం చేశాయని, చేనేతల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మరో పోరాటానికి సిద్ధమవుతున్నామని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలూరు లక్ష్మయ్య పేర్కొన్నారు. పెద్దపప్పూరు మండలం నర్సాపురం గ్రామంలో చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చేనేత కార్మికుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 22న అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం



ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.25 వేల కోట్లు, రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం రూ.2 వేల కోట్లు కేటాయించి సకాలంలో నిధులు విడుదల చేయాలని, నేతన్నలకు ప్రతి ఏడాది రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని ఆలస్యం లేకుండా అందించాలని, 1985 హ్యాండ్లూమ్ రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేసి చేనేత హక్కులను పరిరక్షించాలని, అర్హులైన చేనేత కార్మికులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశానికి జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు మామిళ్ల నారాయణస్వామి, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతా పురుషోత్తం అధ్యక్షత వహించగా, చింత రఘు, రంగనాయకులు, మామిళ్ల రంగస్వామి, చింతా నాగయ్య, మంగళ నాగేష్, నారాయణస్వామి తదితర చేనేత కార్మికులు పాల్గొన్నారు.

కాకతీయ

అనంతపురం - శ్రీ సత్యసాయి

## సొసైటీ అభివృద్ధికి సహకరించండి

**- సింగల్ విండో అధ్యక్షుడు గణేష్**

అమరాపురం( కాకతీయ ప్రతినిధి) జూన్ 17 ఉమ్మడి అనంతపురం జిల్లా ఏ డి సి సి బ్యాంక్ చైర్మన్ కేశవరెడ్డిని మర్యాదపూర్వకంగా అమరాపురం సింగల్ విండో అధ్యక్షుడు గణేష్ కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ కేశవరెడ్డిని సింగల్ విండో అధ్యక్షుడు గణేష్ అమరాపురం మండలం లో ఉన్న సొసైటీ అభివృద్ధికి నోచుకోలేని పరిస్థితిలో ఉంది కావున సొసైటీ అభివృద్ధికి మరియు బలోపేతానికి అన్ని విధాల సహకరించాలని ఆయన విన్నవించినట్లు ఓ ప్రకటన విడుదల చేశారు. అంతేకాకుండా రైతులకు రుణాలు అందించే విషయంలో కానీ సబ్సిడీ రుణాలు కానీ ఈ మండల సొసైటీకి కాస్త ఎక్కువ మంజూరు చేయాలని విన్నవించినట్లు ఆయన తెలియజేశారు.



## క్రమశిక్షణతో కూడిన విద్య భవిష్యత్తుకు నాంది అవుతుంది

**- ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వనితావాణి**

ధర్మవరం(కాకతీయ టౌన్ ప్రతినిధి) జూన్ 17



క్రమశిక్షణతో కూడిన విద్య భవిష్యత్తుకు నాంది అవుతుందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వనితావాణి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రభుత్వ పుస్తకాలను ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 200 మంది విద్యార్థినీలకు పాఠ్యపుస్తకాలను ప్రిన్సిపాల్తో పాటు అధ్యాపకులు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ లో మంచి మార్కులు సాధించి, ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. ప్రభుత్వం కూడా నేడు విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థినీలు తల్లిదండ్రులు గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. పట్టుదలతో, అకుంఠిత దీక్షతో, కేవలం చదువు ధ్యాసతోనే శ్రమ పడితే విజయం తప్పక వరిస్తుందని తెలిపారు. పాఠ్యపుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం వంటివి ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి సస్త్ర చికిత్స శిబిరమును సద్వినియోగం చేసుకోండి

**.. లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి అధ్యక్షులు రమేష్ బాబు**

ధర్మవరం(కాకతీయ టౌన్ ప్రతినిధి) జూన్ 17



పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల లో (వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా) జూన్ 21వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ఉచిత కంటి శాస్త్ర చికిత్స శిబిరమును నిర్వహిస్తున్నట్లు లయన్స్ కంటి ఆసుపత్రి అధ్యక్షులు రమేష్ బాబు, కార్యదర్శి నాగేంద్ర, కోశాధికారి కొత్తపాలెం వెంకటేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిబిర దాతలుగా కీర్తిశేషులు లయన్ గవ్వల (లడ్డు) లక్ష్మీనారాయణ, కీర్తిశేషులు గవ్వల బాబు (మాజీ వైస్ చైర్మన్), నా జ్ఞాపకార్థం మనవడు గవ్వల చందన్ అల్లుడు లయన్ బండి బాబు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. గత 20 సంవత్సరాలుగా వందల శాంకలో ఉచిత శిబిరములతో పాటు, ఉచితంగా ఆపరేషన్లు ఉచితంగా అద్దాలు కూడా పంపిణీ చేశామని తెలిపారు. నిరుపేద పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటి వెలుగును ప్రసాదించుకోవాలని తెలిపారు. లయన్స్ కంటి ఆసుపత్రి ధర్మవరం నందు డాక్టర్ కిరణ్ కుమార్ వారి బృందంచే కంటి వైద్యులచే ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించబడునని తెలిపారు. బీపీ, షుగర్ ఉన్నవారు వాటిని అదుపులో ఉంచుకొని, వస్తే కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. అంతేకాకుండా ధనవంతులకు కూడా ఇతర నగరాలకు వెళ్లకుండా తక్కువ ధరలకే మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. కంటి వైద్య చికిత్సలకు వచ్చువారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ తో పాటు ఫోన్ నెంబరు, మూడు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని రావలెనని తెలిపారు. ఉచిత ఆపరేషన్లు ధర్మవరం పట్టణంలోని ఎర్రగుంట లో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో నిర్వహిస్తూ కంటి అద్దాలు కూడా ఉచితంగా ఇవ్వబడుతుందని తెలిపారు. చూపు తగ్గిన వారికి తక్కువ ఖర్చుతో లేజర్ చికిత్స కూడా నిర్వహిస్తామని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంత పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## అడ్వాన్స్ కంటైనర్ శ్రీజ పాల డైరీ ప్రారంభం

చిలమత్తూరు (కాకతీయ ప్రతినిధి) జూన్ 17:

చిలమత్తూరు మండలం మొరంపల్లి క్లస్టర్ బుదవారం క్లస్టర్ మేనేజర్ మధుసూదన్ ఆదేశాల ఆద్వర్యంలో పాలమిత్ర రమేశ్ రెడ్డి బిఎంసీ కోడ్ నందు కనిశెట్టిపల్లి గ్రామంలో అడ్వాన్స్ కంటైనర్




శ్రీజ పాల కేంద్రం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం పాలు వినియోగదారులకు రమేశ్ రెడ్డి తన భార్య శైలజ ఆద్వర్యంలో మహిళలకు కానుకగా చీరలు పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు మహిళలు సంతోషవ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ మధుసూధన్ రెడ్డి, ఏసీఓ మల్లికార్జున, పిఐబీ మారుతీ ప్రసాద్, సూపర్ వైజర్లు సోమశేఖర్, నారాయణ స్వామి, కంప్యూటర్ సునీత, పాల మిత్రులు సోమశేఖర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వినయ్ రెడ్డి, నరేశ్ బాబు, తధితరులు పాల్గోన్నారు.

## సర్ సర్వే ను పరిశీలించిన తహసిల్దార్

అమరాపురం( కాకతీయ ప్రతినిధి ) జూన్ 17



మండల కేంద్రంలో అమలాపురం పట్టణ పరిధిలోని 15వ బూత్ లో సర్ సర్వే నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక తహసిల్దార్ బి హనుమంతు ఎలా నిర్వహిస్తున్నారని పరిశీలన చేశారు. ఏ విధంగా చేయాలి ఎలా చేయాలని బి ఎల్ వో కు తెలియజేశారు. తమకు ఎలాంటి అనుమానాలు వచ్చిన వెంటనే ఉన్నతాధికారులను అడిగి తెలుసుకోవాలని బి ఎల్ఓ నేత్రావతికి సూచించారు.

## ఓటరు సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

**- తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి పిలుపు**

గుడిబండ (కాకతీయ ప్రతినిధి) జూన్ 17:



గుడిబండ మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గుడిబండ తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ ఈ కార్యక్రమాన్ని జూన్ 15 నుంచి జూలై 14 వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన యువతీ, యువకులు కొత్తగా ఓటరు నమోదు చేసుకోవచ్చున్నారు. అలాగే ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, వయస్సు, ఫొటో లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్నవారు వాటిని సవరించుకునే అవకాశం ఉందని వివరించారు. ఒక నియోజకవర్గం నుంచి మరొక ప్రాంతానికి మారిన వారు కూడా తమ వివరాలను సరిచేసుకోవచ్చని తెలిపారు. 2002 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. ఇందుకోసం అవసరమైన దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాలు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) లేదా తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించవచ్చున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడు తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ప్రజలు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి విజ్ఞప్తి చేశారు.

## నీట్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం

**- ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ**



ధర్మవరం(కాకతీయ టౌన్ ప్రతినిధి) జూన్ 17 : నీట్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణ సౌకర్యమును కల్పిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నీట్ పరీక్ష రాసే విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి పరీక్షా కేంద్రానికి ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం ఉందని తెలిపారు. పల్లె వెలుగు, అల్ట్రా వెలుగు, మెట్రో ఎక్స్ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సులలో ప్రయాణం చేసే అవకాశం ఉందని తెలిపారు. తప్పనిసరిగా విద్యార్థులు హాల్ టికెట్ చూపించితేనే ఉచిత ప్రయాణమునకు అవకాశం ఉంటుందని తెలిపారు. అవసరమైతే అదనపు ప్రత్యేక బస్సులను పరీక్షా కేంద్రం వద్ద సూపర్వైజర్ల నియామకం కూడా కలదని తెలిపారు. బస్సు స్టేషన్లో హెల్ప్ డిస్కులు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కావున విద్యార్థులు ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తుకు పునాదివేయాలని తెలిపారు.

## ధర్మవరం మున్సిపల్ ఆఫీస్ కు అసిస్టెంట్ కమిషనర్ గా ఉమామహేశ్వరరావు బాధ్యతలు స్వీకరణ

ధర్మవరం(కాకతీయ టౌన్ ప్రతినిధి) జూన్ 17



ధర్మవరం మున్సిపల్ ఆఫీసుకు అసిస్టెంట్ కమిషనర్ గా ఉమామహేశ్వరరావు బాధ్యతలను స్వీకరించారు. వీరు నెల్లూరు జిల్లా అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ గా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ధర్మవరం కు అసిస్టెంట్ కమిషనర్గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారు బాధ్యతలను స్వీకరించారు. తదుపరి మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్యతో పాటు, కార్యాలయ అధికారులు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మేస్త్రీలు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు పట్టణములోని మస్టర్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణములో ఎక్కడా కూడా అపరిశుభ్రత ఉండరాదని, ఫిర్యాదు అందిన వెంటనే సమస్యను పరిష్కరించే దిశలో అధికారులు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. పురపాలక అభివృద్ధికి తన వంతుగా పట్టణ పరిశుభ్రతలో కృషి చేస్తానని, ప్రజల సమస్యలను పరిష్కరించుటలో నా వంతుగా నిరంతరం ఉంటానని తెలిపారు. తదుపరి శానిటరీ విభాగంలో చేయాల్సిన విధి విధానాలను వారు సిబ్బందికి వివరించారు. అదేవిధంగా శానిటరీ విభాగంలో ఎటువంటి సమస్యలు ఉన్న, లేదా కార్మికుల సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరించే దిశగా తాను కృషి చేస్తానని తెలిపారు.

## వైభవంగా శ్రీ కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్టాపన

అమడగూరు కాకతీయ ప్రతినిధి జూన్ 17

అమడగూరు మండలంలోని చీకరేవులపల్లి పంచాయతీ పరిధిలోని బలకవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో బుధవారం శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన శుభకార్యాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, గ్రామస్తులు సంయుక్తంగా నూతన ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు,విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.అరటి మట్టలు,కొబ్బరి ఆకులు,మామిడాకుల తోరణాలు,రంగు రంగుల ముగ్గులతో





తీర్చి దిద్దారు.మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ట శుభకార్యాలు నిర్వహించిన్నట్లు తెలిపారు.మూడవ రోజు (చివరి రోజు) తెల్లవారుజామున నుండి గణపతి పూజ,కలశ స్థాపన,హోమం,గోపూజలు పురోహితుల మంత్రోచ్చారణలతో శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీ సీతారాముల విగ్రహాలకు అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఇతర రాష్ట్రాల నుండి విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమానికి, స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వందలాది మంది భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించిన్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**- పి ఆర్ ఎస్ వై ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి సాయినాథ్ రెడ్డి**

ధర్మవరం(కాకతీయ టౌన్ ప్రతినిధి) జూన్ 17




ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పి.ఆర్.ఎస్.వై.ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి సాయినాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాజేశ్వరి దేవి కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ పాఠశాలలలోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, ట్ క్షనరీలు తదితర విద్యా సామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.1లో పేర్కొన్న నియమ నిబంధనలను అనేక ప్రైవేట్ పాఠశాలలు పాటించడం లేదని తెలిపారు. పాఠశాలలను విద్యా సంస్థలుగా కాకుండా వ్యాపార కేంద్రాలుగా మార్చి పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, ఇతర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని విమర్శించారు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు అని మండిపడ్డారు.దీనివల్ల పేద, మధ్యతరగతి,బడుగు బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.కావున ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ప్రశంసపత్రాల బహుకరణ

**... ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు.**

ధర్మవరం(కాకతీయ టౌన్ ప్రతినిధి) జూన్ 17

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ధర్మవరం అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు ప్రశంస పత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాశాల కు చెందిన అధ్యాపకులు శ్రీ



బాలాజోషి, శ్రీ కిరణ్ కుమార్ శ్రీ చక్రపాణి రెడ్డి, డా. మల్లికార్జున, కళ్యాణి , అనూష 2026 వ సంవత్సరం నుండి అమలు లో వచ్చే పాలిటెక్నిక్ సిలబస్ సీ-26 తయారీ లో ముఖ్యభూమిక పోషించారు అని తెలిపారు. ఈ సందర్భంగా వారి కృషి కి అభినందిస్తూ ఉన్నత విద్య శాఖ సంచాలకులు, మంగలగిరి వారి నుండి ప్రశంషా పత్రాలు అందాయి అని తెలిపారు. . కళాశాల లో ఉండే అధ్యపకులు నుండి 6 మంది ఇంతటి గొప్ప కార్యక్రమములో పాల్గినడం ఏంతో గర్వముగ ఉందని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో శాఖదిపతులు బాలస్వామి, డా. హరిబాబు, కార్యాలయ పర్యవేక్షకులు సుశీల పాల్గొన్నారు.

## విత్తన శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి నారాయణ నాయక్

ధర్మవరం(కాకతీయ టౌన్ ప్రతినిధి) జూన్ 17



విత్తన శుద్ధి కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి నారాయణ నాయక్ ఆకాశవీకంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ధర్మవరం మండల కేంద్రంలోని శ్రీ సాయి సీడ్స్ ,విజేత అగ్రిటెక్ వేరుశనగ విత్తన శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ శుద్ధిచేసిన వేరుశనగ కాయలు నాణ్యత ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యత ప్రమాణాలను పాటించవలసిందిగా వారు తెలిపారు.విత్తనం శుద్ధి కేంద్ర ఇంచార్జ్ అబ్దుల్ అలీ, ఏడిఏశైల కుమారి, ఏ ఈ ఓ జగదీష్ , ఏపీ సీడ్స్ సహాయకుడు మహేష్ లను విత్తన నాణ్యత సరిగా ఉండేటట్లు పర్యవేక్షించాల్సిందిగా ఆదేశించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, ప్లాంట్ యజమానులు రమణారెడ్డి ,కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మారమ్మ దేవి, కాళికాంబ దేవిని దర్శించుకున్న ఈరలకప్ప,కాంతరాజు

అమరాపురం (కాకతీయ ప్రతినిధి) జూన్ 17



మండల పరిధిలోని ఆరోన పల్లి తండాలో వెలసినటువంటి శ్రీ మారమ్మ దేవి కాళికాంబ దేవి జాతర మహోత్సవంలో పాల్గొన్న వైయస్సార్సీపి సమన్వయకర్త ఈరలక్కప్ప, వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు హలకూరు కాంతా రాజు అమ్మవార్లను దర్శించుకున్నారు. మారెమ్మ దేవికి కాళికాంబ దేవికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్థానిక నాయకుడు మాజీ డీలర్ కృష్ణ నాయక్ ఇంటికి వెళ్లి కృష్ణ నాయక్ ను కలిశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ త్రిలోక్, ఎంపీటీసీ హనుమంతురాయప్ప, మాజీ సర్పంచులు నరసింహప్ప, ఈరన్న, ప్రసాద్, అర్చకులు తిప్పా నాయక్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న,మండల యువజన అధ్యక్షుడు మల్లికార్జున్, మండల బూత్ కమిటీ కన్వీనర్ రామ్మూర్తి, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ సురేష్, మండల ఎస్టీ సెల్ కన్వీనర్ తిప్పా నాయక్, పంచాయతీ వైఎస్ఆర్సిపి కన్వీనర్ శివకుమార్ నాయకులు జగదీష్ నాయక్, గిరీష్ నాయక్,ఆటో తిప్పయ్య, భోజన్న, రమేష్,మధు,పెద్దన్న తదితరులు భారీగా పాల్గొన్నారు.

Printed, Published & Owned by Mandalapu Benarji Naddh and Printed at Raghava Printers, D.No. 28-6-390/1, MIG-90, A.P. Housing Bord Colony, Near Masque, ANANTAPUR, A.P and Published at D.No. 28-6-390/1, MIG-90, A.P. Housing Bord Colony, Near Masque, ANANTAPUR, A.P , Editor.: Mandalapu Benarji Naddh